


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 339

శనివారం 29-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రెక్కలు తొడిగి...**
భారత పేసర్ శిఖా పాండే ప్రస్థానంపై ప్రత్యేక కథనం - స్పోర్ట్స్‌లో



**ఏడేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి**
డిసెంబర్ త్రైమాసికంలో 4.7 శాతంగా నమోదు - బిజినెస్‌లో

● వైరస్ విజృంభణ..

## కోవిడ్ @ 57 దేశాలు



కోవిడ్ ధాటికి ప్రపంచ దేశాలు విలవిల్లాడుతున్నాయి. ఒకవైపు చైనాలో కొత్త కేసుల సంఖ్య తగ్గుతూ ఉంటే, బాధిత దేశాల సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ న్యూజిలాండ్, లిథువేనియాలకు సోకింది. ఇప్పటివరకు 57 దేశాలకు ఈ వ్యాధి వ్యాపించి వణుకు పుట్టిస్తోంది.

- 5లో

● ప్రశాంతం...

## తెరుకుంటున్న ఢిల్లీ



ఈ వారం ప్రారంభంలో అల్లర్లతో అట్టుడికిన ఢిల్లీ క్రమంగా తేరుకుంటోంది. పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య అల్లర్లు చెలరేగిన ఈశాన్య ఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకున్నాయి.

- 5లో

● మహిళలకు ప్రత్యేకం..

## ప్రొడక్ట్ టు ప్రొటెక్ట్



ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ వినియోగం నిత్య జీవన క్రియలో భాగమైనది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మొబైల్ వాడకం విజృంభిస్తోంది. అవసరాలను తీర్చుకునే క్రమంలో శ్రమని, ఒత్తిడిని తగ్గించడానికి మహిళలకు ప్రత్యేకంగా యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. అలాంటి కొన్ని ట్రెండీ యాప్స్ విశేషాలు...

- ఫ్యామిలీలో

● మహాత్ముడి స్ఫూర్తి

## ఇప్పుడే అవసరం



ఢిల్లీలో చెలరేగిన అల్లర్లపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటొనియో గ్యుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాల్సిన పరిస్థితి ఏర్పడిన ప్రస్తుత తరుణంలోనే.. శాంతి, అహింస బోధించిన మహాత్మా గాంధీ స్ఫూర్తి అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు.

- 5లో

# అదనపు ఆదాయం ఎలా?

- ఆదాయ పెంపు మార్గాలపై సర్కారు కసరత్తు
- ఆస్తి పన్ను 100% వసూలయ్యేలా చర్యలకు సీఎం సూచన
- పన్ను పెంపు ప్రతిపాదనలకూ నో చెప్పని కేసీఆర్.. పరిశీలనలో విద్యుత్ టారిఫ్ పెంపు కూడా...
- ఈ ఏడాది అదనంగా రూ. 20 వేల కోట్లు సమకూర్చుకోవడంపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్వేషణ మార్గాలను వెతుక్కునే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో వచ్చే ఏడాది రాబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయనే అంచనాల నేపథ్యంలో వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనే యోచనలో ఉన్న సీఎం కేసీఆర్... బడ్జెట్ ప్రతిపాదనలకు తగినట్లు నిధులు రాబట్టుకోవడంపై దృష్టి పెట్టారు. బడ్జెట్ తయారీ సన్నాహక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సలహాదారు జీఆర్ రెడ్డి తదితరులతో బడ్జెట్ రూపకల్పనపై నిర్వహిస్తున్న సమావేశాల్లో ఆయన

మిగతా 2వ పేజీలో ▶

# కోవిడ్ కల్లోలం

## వైరస్ ఖండాంతర వ్యాప్తితో ప్రపంచ మార్కెట్లు ధమాల్

- అమెరికా, యూరప్, ఆసియా ఎటుచూసినా పతనమే
- సెన్సెక్స్ 1,448 పాయింట్లు క్రాష్.. 38,297 వద్ద క్లోజ్
- నిఫ్టీ 432 పాయింట్లు డౌన్.. 11,202 వద్ద ముగింపు
- దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలో రెండో భారీ క్షీణత ఇది



**12** లక్షల కోట్లు
6 రోజుల్లో ఆవిరైన ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ 6 రోజుల నష్టం: 2,873 పాయింట్లు
నిఫ్టీ పతనం: 879 పాయింట్లు

**5.45** లక్షల కోట్లు
శుక్రవారం ఒక్కరోజు నష్టం విలువ

చైనాను వణికిస్తున్న కోవిడ్–19 వైరస్ విలయతాండవానికి ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. నిన్నటివరకూ కొత్త శిఖరాలవైపు దూసుకెళ్లిన ప్రపంచ మార్కెట్లు ఇప్పుడు ఈ అంతుచిక్కని వైరస్ ఎటాక్‌తో నేలచూపులు చూస్తున్నాయి. అమెరికా నుంచి జపాన్... ఫ్రాన్స్ నుంచి భారత్ వరకూ స్టాక్ మార్కెట్లు 'బ్లాక్ ఫ్రైడే'తో కకావికలం అయ్యాయి. ఒక్కరోజులోనే 4 శాతానికిపైగా నష్టపోయాయి. రూ. లక్షల కోట్ల సంపద ఆవిరై ఇన్వెస్టర్లకు తీరని వేదన మిగిల్చింది. వైరస్ అన్ని ఖండాలకూ విస్తరిస్తుండటం.. ఇప్పట్లో దీనికి వ్యాక్సిన్‌ను కనుగొనే అవకాశాలు లేకపోవడం ఆర్థిక వ్యవస్థలకు శరాఘాతంగా మారుతోంది. విమానయానం, పర్యాటక రంగాలు తీవ్ర సంక్షోభంలోకి జారిపోతున్నాయి. ఈ పరిణామం ఫైనాన్షియల్ మార్కెట్లు కుదేలయ్యేందుకు దారితీస్తోంది. మరోవైపు ముడి చమురు ధర కూడా కుప్పకూలుతోంది. వైరస్‌కు విరుగుడు దొరికే వరకూ అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్ల మహా పతనం కూడా ఆగేలా కనబడటం లేదని మార్కెట్ విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు. - బిజినెస్‌లో



శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో చికెన్ అండ్ ఎగ్ మేళాను ప్రారంభించిన సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి, మంత్రులు తలసాని, ఈటల, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలసి లెగ్‌పీస్‌లను రుచి చూస్తున్న మంత్రి కేటీఆర్ - 13లో

## పార్టీ, సామాజిక సమీకరణాలకు
# పెద్దపీట...

- 'సహకార' పీఠాల కైవసానికి జిల్లాల వారీగా పరిశీలకులు
- సీల్డ్ కవర్‌లో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ల పేర్లు
- నేడు ఉదయం డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లతో పరిశీలకుల భేటీ
- పార్టీ మద్దతుదారులే గెలుపొందేలా చూడాలని ఆదేశం
- సీఎం నిర్ణయించిన అభ్యర్థుల జాబితాను అందజేసిన కేటీఆర్

- వివరాలు 3లో

'రఫేల్ జెట్స్' సరిపోవు: ఐఏఎఫ్ చీఫ్ 5లో









## టీఆర్‌ఎస్‌లో 'రాజ్యసభ' లెక్కలు

- రాజ్యసభలో 55 స్థానాలకు సంబంధించిన ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇదివరకే ప్రకటించగా, మార్చి 6వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. తెలంగాణ రాష్ట్ర కోటాలో కేవీపీ రామచంద్రరావు (కాంగ్రెస్), గరికపాటి రామ్మోహన్‌రావు (బీజేపీ)తో పాటు ఏపీ కోటాలో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్షం నేత కేకే రిటైర్ అవుతున్నారు.

- వివరాలు 3లో

## కరెంట్.. కొత్త రికార్డు!

- 13,168 మెగావాట్లకు ఎగబాకిన గరిష్ట డిమాండ్

రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ శుక్రవారం ఉదయం 7.52 గంటల ప్రాంతంలో 13,168 మెగావాట్లుగా నమోదైంది. 13 వేల మెగావాట్ల డిమాండ్‌ను రాష్ట్రం అధిగమించడం ఇది రెండోసారి.

- వివరాలు 2లో

### గనుల శాఖ డైరెక్టర్‌గా
## రొనాల్డ్ రోస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి డి.రొనాల్డ్ రోస్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ సోమేశ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న అనితా రామచంద్రను పశుసంవర్ధక, మత్స్య శాఖ కార్యదర్శిగా, బి.విజయేంద్రను రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, ఎమ్‌ఆర్‌ఎమ్ రావును రవాణా శాఖ కమిషనర్‌గా, ఎం.ప్రశాంతిను అటవీ శాఖ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు.







## రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధానంగా తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో శనివారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుంటే ఆదివారం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతోపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. మరోవైపు గత 24 గంటల్లో కొమురంభీం జిల్లా జిన్నేదారి, ఆసిఫాబాద్‌లలో 11 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా సిర్పూరు, కెరమెరి, నిర్మల్ జిల్లా బీరవెల్లి, కుబీర్, ఆదిలాబాద్ జిల్లా పోచర, లొకారి, తాంసి, అర్లి, బేలాలలో 12 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు.

## మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేయండి

### సీఎంకు ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖాశర్మ లేఖ



సాక్షి, హైదరాబాద్: మహిళలకు కష్టకాలంలో వెన్నుదన్నుగా నిలిచే రాష్ట్ర మహిళా కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖాశర్మ కోరారు. గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న రాష్ట్ర కమిషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు శుక్రవారం ఆమె లేఖ రాశారు. సమాజంలో మహిళల హక్కులకు భంగం కలగకుండా గౌరవం పెంపొందించడంలో మహిళా కమిషన్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. మహిళలకు న్యాయం చేసే కమిషన్‌ను సత్వరమే ఏర్పాటు చేయాలని విన్నవించారు.

## కశ్మీర్‌కు ఒక న్యాయం.. మాకో న్యాయమా..?

- అక్కడ అసెంబ్లీ స్థానాలు పెంచి.. తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు పెంచరు: వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, తమకు అనుకూలంగా లేని రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణల్లో అసెంబ్లీ సీట్లు పెంచేది లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనపై వినోద్‌కుమార్ మండిపడ్డారు. కశ్మీర్‌కు ఓ న్యాయం, తమకో న్యాయం అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఒకే దేశం–ఒకే చట్టం అనే నినాదం ఏమైందని నిలదీశారు. కశ్మీర్‌లో 7 అసెంబ్లీ స్థానాలను పెంచినప్పుడు ఏపీ, తెలంగాణల్లో పెంచడానికి ఇబ్బంది ఏంటో అర్థం కావట్లేదని తెలిపారు. కశ్మీర్‌లో అసెంబ్లీ స్థానాల పెంపుపై తమకెలాంటి అభ్యంతరం లేదని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు పెంచరన్నదే తమ సమస్య అని వెల్లడించారు. ఆరేళ్లుగా అసెంబ్లీ స్థానాలను పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సీట్ల పెంపు విషయంలో ఏపీ, తెలంగాణ ప్రజలు న్యాయస్థానంలో సవాలు చేస్తారని వినోద్‌కుమార్ వెల్లడించారు.

## సుప్రీంలో ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబ సభ్యుల పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: 'దిశ'పై అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటనలో నిందితులుగా ఉండి ఎన్‌కౌంటర్‌లో హతమైన నిందితుల కుటుంబ సభ్యులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఒక్కో కుటుంబానికి పరిహారంగా రూ. 50 లక్షలు ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందుకు శుక్రవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చి చంపారని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరారు.



కోర్టు వేసిన విచారణ కమిషన్‌కు అందించే సాక్ష్యాలు తారుమారు చేయకుండా సీపీ సజ్జనార్ సహా తెలంగాణ ప్రభుత్వాన్ని నియంత్రించాలని కోరారు. సీపీ సజ్జనార్ సహా ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై విచారణ కమిషన్ ఆధ్వర్యంలో సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరారు. అయితే ఇప్పటికే న్యాయ విచారణ కమిషన్ వేశామని, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం పేర్కొంది. తమ విన్నపాలను న్యాయ విచారణ కమిషన్‌కు చెప్పుకోవచ్చని, సాక్ష్యాలేవైనా ఉన్నా కమిషన్‌కు సమర్పించవచ్చని పేర్కొంది. కమిషన్ నివేదిక ఇచ్చాక న్యాయం జరగలేదని భావిస్తే హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు కూడా ధర్మాసనం అనుమతించింది.

## బ్రిటన్ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్!

సాక్షి, హైదరాబాద్: ఉద్యాన పంటల కోత అనంతర యాజమాన్య పద్ధతులకు బ్రిటన్–భారత ప్రభుత్వ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు తెలంగాణలో అవకాశాలపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చర్చ జరిగింది. వ్యవసాయశాఖ కార్యదర్శి ఎన్.జనార్దన్ రెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రామిరెడ్డిలతో బ్రిటిష్ హైకమిషన్‌కు సంబంధించిన జేస్ దీప్ జస్వాల్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది ఉద్యానరంగ నిపుణుల ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ఎల్.వెంకట్రామి రెడ్డి తెలంగాణలో ఉద్యాన పంటల విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలను వివరించారు. ఈ సమావేశంలో ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎ.భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

## కన్హయ్య కేసు ప్రాసిక్యూషన్‌ను ఖండిస్తున్నాం: నారాయణ

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ నేత కన్హయ్య కుమార్‌పై దేశద్రోహం కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఢిల్లీ ప్రభుత్వం ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వడాన్ని ఖండిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. ఇది రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. కన్హయ్య కుమార్ ప్రజాకోర్టులో నిర్దోషిగా నిరూపించుకున్నారని, న్యాయస్థానంలో కూడా పోరాడి విజయం సాధిస్తారని తమ ప్రగాఢ నమ్మకమని ధీమా వ్యక్తంచేశారు. ఇంతవరకు కేంద్రం పెద్దల ఒత్తిళ్లకు లొంగని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. ఇప్పుడు ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.



## అజ్మీర్ దర్గాకు మన చాదర్

సాక్షి, హైదరాబాద్

అజ్మీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్పించే చాదర్ శుక్రవారం బయల్దేరింది. ప్రగతిభవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు అధికారులు ఈ చాదర్ (గిలాఫ్)ను సీఎం కేసీఆర్‌కు అందించి ఆయన చేతుల మీదుగా అజ్మీర్‌కు పంపించారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీమ్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మైనారిటీ కమిషన్ చైర్మన్ ఖమ్రుద్దీన్ ఖాద్రి, మక్కా మసీదు ఇమామ్ హఫీజ్ మహ్మద్ ఉస్మాన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్.. కొత్త రికార్డు!

## 13,168 మెగావాట్లకు ఎగబాకిన గరిష్ట డిమాండ్

- రాష్ట్ర చరిత్రలో అత్యధిక విద్యుత్ వినియోగం
- భారీగా పెరిగిన రాష్ట్ర తలసరి వినియోగం
- సాగుకు 24 గంటల సరఫరా, ఎత్తిపోతల పథకాల వల్లే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ శుక్రవారం ఉదయం 7.52 గంటల ప్రాంతంలో 13,168 మెగావాట్లుగా నమోదైంది. 13 వేల మెగావాట్ల డిమాండ్‌ను రాష్ట్రం అధిగమించడం ఇది రెండోసారి. ఈ నెల 25న నమోదైన 13,040 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను శుక్రవారం రాష్ట్రం దాటేసింది. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ డిమాండ్ ఏర్పడినా ఏమాత్రం కోత, లోటు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగామని ట్రాన్స్‌కో ఓ ప్రకటనలో తెలిపింది. 23 జిల్లాలు కలిగిన ఉమ్మడి ఏపీలోనే 2014 మార్చి 23న 13,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ వచ్చింది. ఇప్పుడు తెలంగాణలోనే అంతకు మించి డిమాండ్ ఏర్పడింది. గతేడాది సరిగ్గా ఇదే రోజు రాష్ట్ర గరిష్ట డిమాండ్ 9,770 మెగావాట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 34 శాతం అధిక డిమాండ్ వచ్చింది. ప్రస్తుత వేసవి తీవ్రత పెరిగినా కొద్దీ రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ రోజుకో కొత్త రికార్డు సృష్టించే అవకాశాలున్నాయి. తెలంగాణ ఏర్పడిన నాటికి తెలంగాణ ప్రాంతంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 5,661 మెగావాట్లు కాగా, ఇప్పుడు 132.6 శాతం వృద్ధిని సాధించింది.

### పెరిగిన వార్షిక వినియోగం

రాష్ట్రంలో గరిష్ట డిమాండ్‌తో పాటు వార్షిక విద్యుత్ వినియోగం కూడా అంతకంతకూ పెరుగుతోంది. 2014లో రాష్ట్రంలో 47,338 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగగా, 2018–19లో 68,147 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. ఆరేళ్లలో 44 శాతం వృద్ధి రేటు నమోదైంది. ఇదే సమయంలో జాతీయ వృద్ధి రేటు 23 శాతమే. పెరిగిన తలసరి విద్యుత్ వినియోగం సుస్థిర అభివృద్ధి సూచికల్లో తలసరి విద్యుత్ వినియోగం ఒకటి. ఈ విషయంలో తెలంగాణ దేశ సగటును మించింది. ప్రస్తుతం రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 1,896 యూనిట్లు కాగా, జాతీయ సగటు 1,181 యూనిట్లు మాత్రమే. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్లుండగా, ఆరేళ్లలో 39.82 శాతం పెరిగింది. సీఎం కేసీఆర్ మార్గదర్శకం, అనుక్షణం పర్యవేక్షణ, విద్యుత్ సంస్థల ఉద్యోగుల అవిరళ కృషితోనే రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా సాధ్యమవుతోందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తెలిపారు.

### ఎత్తిపోతలకూ అంతే..

2014లో ఎత్తిపోతల పథకాలకు 680 మెగావాట్ల డిమాండ్ మాత్రమే ఉండేది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన భారీ నీటి పారుదల ప్రాజెక్టుల ఫలితంగా పంపుహౌస్‌ల నిర్వహణకు ప్రస్తుతం 2,200 మెగావాట్ల వరకు విద్యుత్ అవసరం అవుతోంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో పట్టణీకరణ శరవేగంగా పెరుగుతుండటం వల్ల వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు కూడా పెరిగాయి. దీంతో తెలంగాణవ్యాప్తంగా కొత్త విద్యుత్ కనెక్షన్ల వృద్ధి రేటు అధికంగా ఉంది. తెలంగాణ ఏర్పడే నాటికి మొత్తం విద్యుత్ కనెక్షన్లు 1,11,19,990 ఉంటే, నేడు 1,54,14,451 కనెక్షన్లున్నాయి. 38.61 శాతం కనెక్షన్లు పెరిగాయి.



### డిమాండ్ పెరిగింది ఇలా..

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం, భారీ ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా జరుపుతుండటంతో వ్యవసాయ విద్యుత్ డిమాండ్ 6 వేల మెగావాట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పడే నాటికి 19,02,754 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం 24,31,056కు పెరిగాయి.

# అదనపు ఆదాయం ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు చర్చిస్తున్నారు. బడ్జెట్ నిర్వహణకు అడ్డంకులు కలగకుండా ఉండేందుకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలపై అధికారులతో చర్చిస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఆస్తి పన్ను పెంపు అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఆస్తిపన్ను పెంచడం ద్వారా స్థానిక సంస్థలకు సర్దుబాటు చేయాల్సిన నిధుల్లో వెసులుబాటు వస్తుందనే చర్చ జరిగింది. పల్లెలు, పట్టణాల్లో ప్రగతి పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతోపాటు పలు అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టి ఠంచన్‌గా నెలవారీ నిధులు విడుదల చేస్తున్న నేపథ్యంలో ప్రజల నుంచి కూడా ఈ ప్రతిపాదనపై వ్యతిరేకత రాకపోవచ్చనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైనట్లు సమాచారం. అయితే పన్ను పెంచడమా లేక లీకేజీలు లేకుండా పన్ను 100 శాతం వసూలు చేయడమా అనే అంశంపైనా చర్చ జరిగింది. గ్రామ పంచాయతీల విషయానికి వస్తే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణపేట, మంచిర్యాల లాంటి జిల్లాలు మినహా మిగిలిన చోట్ల ఇంటి పన్ను నామమాత్రంగానే వసూలవుతోందని, ఈ పన్నును సజావుగా రాబట్టుకోవడం ద్వారా ఏటా రూ. 200 కోట్ల వరకు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నిధులు సమకూర్చవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, లీకేజీలు అరికట్టడమే లక్ష్యంగా గ్రామాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను వసూలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం తగ్గించుకోవచ్చనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆస్తిపన్ను ప్రతిపాదనను సీఎం తోసిపుచ్చలేదని కూడా సమాచారం. ఇక మరో ఆదాయ మార్గమైన విద్యుత్ టారిఫ్ పెంపు అంశాన్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోంది. సాధారణ కేటగిరీలో ఉండే ప్రజలకు భారం పడకుండా విద్యుత్ చార్జీలను పెంచుకోవడం ద్వారా డిస్కంలకు చెల్లించాల్సిన మొత్తం నుంచి ప్రభుత్వానికి ఊరట కలుగుతుందని, విద్యుత్ సబ్సిడీల రూపంలో ఇస్తున్న దాంట్లో దాదాపు రూ. 2 వేల కోట్ల భారం తగ్గించుకోవచ్చనే భావనతో త్వరలోనే విద్యుత్ చార్జీల పెంపునకు సీఎం కేసీఆర్ పచ్చజెండా ఊపనున్నట్లు తెలుస్తోంది.

### భూముల విలువలు సవరిస్తే...!

ఇక భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ అంశం కూడా ఆర్థిక శాఖ సమీక్షలో సీఎం చర్చించినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రంలోని భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించలేదు. కారణమేదైనా రెండేళ్లకోసారి సవరించాల్సిన ఈ ధరలు ఆరేళ్లయినా మార్చలేదు. దీంతో ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ. వేల కోట్లలోనే ఆదాయం కోల్పోతోంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులతోపాటు భూముల విషయంలో ప్రజల అభిప్రాయం కూడా రిజిస్ట్రేషన్ విలువల సవరణకు అనుకూలంగానే ఉంటుందనే చర్చ ఈ సమావేశంలో జరిగింది. దీంతో ఈ ఏడాది భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని తద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా నెలవారీ వచ్చే అదనపు ఆదాయంతో నెలవారీగా వచ్చే ఆర్థిక ఇబ్బందులను కూడా అధిగమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతోపాటు గతేడాది ప్రతిపాదించిన విధంగానే మరోమారు భూముల అమ్మకాలను కూడా ప్రతిపాదించాలనే దానిపైనా ఆర్థిక శాఖ అధికారులతో సీఎం చర్చించారు. ఈ ఏడాది కొత్తగా ఆపద్బంధు పథకం, కుట్టు మిషన్ల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండడంతో పాటు నెలనెలా పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలకు రూ. 500 కోట్ల వరకు అవసరం అవుతున్నందున ఖజానాకు లోటు రాకుండా ఎప్పుడు అవసరమైతే అప్పుడు అవసరానికి తగినట్లు భూముల విక్రయాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. భూముల అమ్మకాల ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 10–12 వేల కోట్ల వరకు ఆదాయాన్ని రిజర్వు చేసుకోవాలని, మిగిలిన మార్గాల్లో కలిపి మొత్తం రూ. 20 వేల కోట్లను అదనంగా అందుబాటులో ఉంచుకొనే విధంగా ముందుకెళ్లాలని ఈ సమావేశంలో సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

# అమెరికాలో పీహెచ్‌డీ.. ఆశ్రమంలో బందీ!

- ఆశ్రమం నుంచి మా కూతురును రక్షించండి
- ఢిల్లీ హైకోర్టులో ఓ యువతి తల్లిదండ్రుల పిటిషన్
- కేంద్రం, సీబీఐ, ఢిల్లీ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: అమెరికాలో పీహెచ్‌డీ పూర్తి చేసి పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ అసోసియేట్‌గా పనిచేసే తన కూతురు ఢిల్లీలోని ఓ ఆధ్యాత్మిక ఆశ్రమంలో బందీగా మారిందని, ఆమెను విడిపించి రక్షించాలంటూ ఓ యువతి తల్లిదండ్రులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఈ కేసు విచారించిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం.. కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి, సీబీఐకి నోటీసులు జారీచేసింది. అనంతరం కేసు విచారణను ఏప్రిల్ 13కు వాయిదా వేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. హైదరాబాద్‌కు చెందిన దుంపల రాంరెడ్డి, మీనావతి కూతురు సంతోష్ రూప జేఎన్టీయూ అనంతపురంలో బీటెక్ పూర్తి చేసి అమెరికాలోని లూయిస్‌విల్లే విశ్వవిద్యాలయంలో 2005 నుంచి 2012 వరకు ఎంఎస్, పీహెచ్‌డీ పూర్తిచేసింది. అనంతరం అక్కడే ఐఓడబ్ల్యూఏ వర్సిటీలో పోస్ట్ డాక్టరేట్ కోర్సులో చేరింది. పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ అసోసియేట్‌గా కూడా 2015 వరకు పని చేసింది. 2015 జూలైలో అకస్మాత్తుగా వర్సిటీ విడిచిపెట్టింది. అయితే ఎక్కడికి వెళ్లిందన్న విషయంలో తల్లిదండ్రులకు, ప్రొఫెసర్లకు ఎలాంటి సమాచారం లేదు. అయితే కొంత కాలానికి రూప.. ఢిల్లీ రోహిణీ ప్రాంతం లోని విజయ్‌విహార్‌లో వీరేంద్ర దీక్షిత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం పేరుతో నడుపుతున్న ఆశ్రమంలో ఉన్నట్లు తల్లిదండ్రులకు తెలిసింది.



సంతోష్ రూప

### బ్యాంకు ఖాతాలో రూ.కోటి

కాగా, రూప ఆశ్రమంలో చేరేనాటికి ఆమె బ్యాంకు ఖాతాలో దాదాపు కోటి రూపాయలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ కూతురు కోసం సంప్రదించిన ప్రతిసారి ఆశ్రమ నిర్వాహకులు సంతోష్ రూప ఇష్టానికి భిన్నంగా తాము ఒత్తిడి తెస్తున్నామని, తమ నుంచే రక్షణ కావాలని పోలీసులకు ఫిర్యాదు చేసేవారని తెలిపారు. కాగా, ఈ ఆశ్రమంలో అనేక మంది బాలికలు, మహిళలు బందీలుగా ఉన్నారని, వారిని కాపాడాలని 2017లో ఢిల్లీ హైకోర్టులో ఒక రిట్ పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఓ కమిటీ వేసింది. వందలాది మంది బాలికలు, మహిళలను అక్కడ పశువుల కొట్టాన్ని తలపించేలా ఉంచారని, అక్కడ ఎలాంటి వసతుల్లేవని, వైద్యం కూడా అందట్లేదని, ఇరుకైన సందులు ఉన్నాయని కమిటీలో ఉన్న న్యాయవాది నందితారావు నివేదికలో పేర్కొన్నారు. చాలా మంది డ్రగ్స్ అలవాటు పడ్డట్లు కనిపించారని వివరించారు. వారిని చీకటి గదుల్లో ఉంచారని, వారు పడుకునే ప్రాంతంలో కూడా పర్యవేక్షణ ఉండదని, వారికి ఎలాంటి గోప్యత లేదని తెలిపారు. ఆ తర్వాత హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. అయితే వీరేంద్ర దీక్షిత్ అదృశ్యమయ్యాడని 2018లో హైకోర్టుకు సీబీఐ తెలిపింది.

### జైలు లాంటి వాతావరణంలో

తాము వృద్ధాప్యంలో ఉన్నామని, రూ.2 వేల పెన్షన్ డబ్బులతో బతుకుతున్నామని, కూతురిని తీసుకెళ్లేందుకు ఇక్కడే ఢిల్లీలో ఒక గది అద్దెకు తీసుకుని బతుకుతున్నామని తల్లిదండ్రులు పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ కూతురు జైలులాంటి వాతావరణంలో ఉండటాన్ని చూసి మానసిక క్షోభతో తమ ఆరోగ్యం మరింత క్షీణిస్తోందని తెలిపారు. తమ బాగోగులు చూసుకునేందుకైనా తమ కూతురును పంపించాలని కోరారు. తమ కూతురు డ్రగ్స్‌కు బానిసై ఉంటుందని, ఆమె ఆరోగ్యంగా లేదని వివరించారు. ఆశ్రమంలో ఆత్మహత్య జరిగినందున తమ కూతురు క్షేమంపై బెంగగా ఉందని వివరించారు.

## పూలే విగ్రహానికి స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో విగ్రహ ఏర్పాటుకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇప్పటికే మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో వందల గురుకులాలను స్థాపించారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా వెనుకబడిన వర్గాలకు ఆధునిక విద్యతో విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి ఓవర్సీస్ విద్య పథకానికి జ్యోతిబాపూలే పేరు పెట్టి సముచిత గౌరవాన్ని అందిస్తున్నామన్నారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి అన్నారు. పూలే భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఏ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని, సీఎం కేసీఆర్ అణగారిన వర్గాల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన వారిలో జీహెచ్ఎంసీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్ అధికారులున్నారు.

## చెట్లు కొట్టినందుకు రూ.53వేలు జరిమానా

- ఓ గేటెడ్ కమ్యూనిటీలో చెట్లు నరికిన ఇందు ఫార్చ్యూన్
- వివరణతో సంతృప్తి చెందని అటవీ అధికారులు
- 80 మొక్కలు నాటాలని షరతు

సాక్షి,హైదరాబాద్: నగరంలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో అనుమతి లేకుండా 40 చెట్లను కొట్టివేసినందుకు వాల్టా చట్టం అతిక్రమణ కింద ఓ సంస్థకు అటవీ శాఖ రూ. 53,900 జరిమానా విధించింది. దీంతోపాటుగా కొట్టిన చెట్లకు బదులుగా 80 మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని షరతు విధించింది. కూకట్‌పల్లిలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్‌లో సంబంధిత శాఖల అనుమతి లేకుండా దాదాపు 40 చెట్లు కొట్టివేయడంపై స్పందిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కమ్యూనిటీలో అదనపు సౌకర్యాల కల్పన కోసం చెట్లు కూల్చాల్సి వచ్చిందని, కొట్టేసిన చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేశామని ఇందు ఫార్చ్యూన్ ఇచ్చిన వివరణతో అటవీశాఖ అధికారులు సంతృప్తి చెందలేదు. ఈ చెట్ల నరికివేతకు సంబంధించి మేడ్చల్ జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి, సిబ్బంది పరిశీలించి చెట్ల నరికివేత, మరోచోట వాటిని పెట్టడం శాస్త్రీయంగా జరగలేదని నిర్ధారించారు.

## కేంద్రం పెంచిన వేతనాలివ్వాలి

### శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన మేర వేతనాలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్), హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) విజ్ఞప్తి చేసింది. 2018 అక్టోబర్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ. 1,500, హెల్పర్లకు రూ. 750, మినీ వర్కర్లకు రూ. 1,250 పెంచినా.. ఈ వేతనాలను 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని ఈ శాఖ డైరెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో సంఘం అధ్యక్షురాలు ఎం.పద్మ, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి పేర్కొన్నారు. ఎండాకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక పూట బడి, మే నెలంతా సెలవులివ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆరేళ్ల నుంచి యూనిఫామ్స్, స్టేషనరీ, ఇంక్రిమెంట్, ఇన్‌చార్జి అలవెన్సులు, రెండు, మూడేళ్లుగా టీఏ, డీఏలు, సెంటర్ అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. జీవో 14ను సవరించి అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 19ను అనుసరించి గ్రాట్యుటీ పెంచి, చివరి జీతంతో సగం పెన్షన్ నిర్ణయించి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.



epaper.sakshi.com



# చేప సూపర్!

- 'మత్స్య' అభివృద్ధిలో నంబర్ 1
- రాష్ట్రంలో మత్స్యకారుల కోసం సంక్షేమ కార్యక్రమాలు
- ఫిష్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ యాదవ్
- 100 రకాల చేప వంటకాల ఘుమఘుమలు

**హైదరాబాద్:** దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సీఎం కేసీఆర్ మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, ఇందులో తెలంగాణ దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉందని మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఎన్‌టీఆర్ స్టేడియంలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, తెలంగాణ మత్స్య సహకార సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఫిష్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్‌ను మంత్రి ప్రారంభించి, చేపల వంటకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గంగపుత్ర, బెస్త, ముదిరాజ్‌ల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నగర ప్రజలకు చేపలు అందుబాటులో ఉండేందుకు, మత్స్యకారుల ఉపాధి కోసం త్వరలో ఔట్‌లెట్‌లను ప్రారంభిస్తామన్నారు. బేగంబజార్, రాంనగర్ చేపల మార్కెట్‌వాసులు అంగీకరిస్తే ఆర్టీసీ క్రాస్ రోడ్డు సమీపంలో పెద్ద మార్కెట్‌ను కట్టించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎన్‌ఎఫ్‌డీబీ జనార్దన్, మత్స్య శాఖ కమిషనర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుల వృత్తులకు సీఎం ప్రోత్సాహం: ఈటల



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని కుల వృత్తుల స్థితిగతులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు స్పష్టమైన అవగాహన ఉందని, అన్ని కుల వృత్తులను ప్రోత్సహించేలా ఆయన చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మేర వృత్తి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన టైలర్స్ డే కార్యక్రమంలో ఈటల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమల్లో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. కేంద్రంతో సహా ఇతర రాష్ట్రాలు ఇక్కడ సంక్షేమ పథకాల అమలు తీరును అధ్యయనం చేసి వెళ్తున్నాయని పేర్కొన్నారు. అన్ని కులాలకు హైదరాబాద్‌లో ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ అన్ని కులాల అభివృద్ధికి కేసీఆర్ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. మేర కుల వృత్తి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఈటల హామీ ఇచ్చారు. సమావేశంలో మేర కుల వృత్తి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఓడపల్లి ఆనంద్, కర్నె శ్రీనివాస్, శివరాం, కీర్తి జయంత్ కుమార్ పాల్గొన్నారు.

# పార్టీ, సామాజిక సమీకరణాలకు పెద్దపీట

**'సహకార'పీఠాల కైవసానికి జిల్లాల వారీగా పరిశీలకులు**

- సీల్డ్ కవర్‌లో డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పేర్లు
- నేడు ఉదయం డీసీసీబీ, డీసీఎంఎస్ డైరక్టర్లతో పరిశీలకుల భేటీ
- పార్టీ మద్దతుదారులే గెలుపొందేలా చూడాలని ఆదేశం
- సీఎం నిర్ణయించిన అభ్యర్థుల జాబితాను అందజేసిన కేటీఆర్



శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశమైన కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** సహకార ఎన్నికల ఘట్టం ముగింపు దశకు చేరుకోగా పూర్వపు ఉమ్మడి జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు పార్టీ మద్దతుదారులకే దక్కేలా చూడాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. శనివారం డీసీసీబీ, డీఎస్ఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఆయా జిల్లా పరిశీలకులతో పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో శుక్రవారం సాయంత్రం కేటీఆర్ గంటన్నర పాటు భేటీ అయ్యారు. శనివారం జరిగే ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన మద్దతుదారులే విజయం సాధించేలా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ ఎన్నికల పరిశీలకులకు దిశా నిర్దేశం చేశారు. డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించిన నేపథ్యంలో వారి ఎంపిక సాఫీగా జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎంపిక జరిగిందని, ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయించిన నేతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు డైరక్టర్లు సహకరించాలన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా అవకాశం దక్కని వారికి పార్టీ పరంగా భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. శనివారం జరిగే ఎన్నికలో అన్ని డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు టీఆర్ఎస్‌కే దక్కుతాయన్నారు.

### జిల్లాలకు బయల్దేరిన పరిశీలకులు

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా సీల్డ్ కవర్లు అందుకున్న టీఆర్ఎస్ సహకార ఎన్నికల పరిశీలకులు శుక్రవారం రాత్రికే తమకు కేటాయించిన జిల్లాలకు బయల్దేరి వెళ్లారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా, క్యాంపుల్లో ఉన్న డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు శనివారం ఉదయం 7 గంటలకల్లా ఆయా జిల్లా కేంద్రాలకు చేరుకోవాల్సిందిగా కేటీఆర్ ఆదేశించారు. వీరితో ఉదయం 7 గంటలకు పార్టీ పరిశీలకులు సమావేశమై పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయించిన వారికి మద్దతు పలకాలని కోరతారు. సీల్డ్ కవర్లను తెరిచి పార్టీ నిర్ణయించిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను వెల్లడిస్తారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుండటంతో, ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా పార్టీ పరిశీలకులు సమన్వయం చేస్తారు. మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ జరిగిన తర్వాత ఒక్కో పదవికి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి ఫలితం ప్రకటిస్తారు. సంఖ్యా బలం పరంగా టీఆర్ఎస్‌కు అన్ని డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో స్పష్టమైన బలం ఉండటంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.

### సామాజిక సమీకరణాల కోణంలో..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ పదవులకు సంబంధించి పార్టీ సమీకరణాలు, డీసీఎంఎస్ ఛైర్మన్ పదవులను సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అభ్యర్థులను సీఎం కేసీఆర్ ఖరారు చేసినట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయిలో టెస్కాబ్ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న కొండూరు రవీందర్‌రావును కరీంనగర్ డీసీసీబీ ఛైర్మన్‌గా ఖరారు చేశారు. వీరితో పాటు పోచారం భాస్కర్‌రెడ్డి (నిజామాబాద్), మార్నేని రవీందర్‌రావు (వరంగల్), అడ్డి బోజారెడ్డి లేదా శరత్‌చంద్రారావు (ఆదిలాబాద్), మనోహర్‌రెడ్డి (రంగారెడ్డి), గొంగిడి మహేందర్‌రెడ్డి (నల్లగొండ), ఎం.దేవేందర్‌రెడ్డి లేదా చిట్టి దేవేందర్‌రెడ్డి (మెదక్), మనోహర్ (మహబూబ్‌నగర్), కూరాకుల నాగభూషణం లేదా తూళ్లూరు బ్రహ్మయ్య (ఖమ్మం) పేర్లు జాబితాలో ఉన్నట్లు సమాచారం. డీసీఎంఎస్‌కు సంబంధించి మల్కాపురం శివకుమార్ (మెదక్), శ్రీనివాస్‌గౌడ్ (నిజామాబాద్), పి.క్రిష్టారెడ్డి (రంగారెడ్డి) పేర్లు జాబితాలో ఉన్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని డీసీసీబీ వైస్ ఛైర్మన్, డీసీఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన నేపథ్యంలో శనివారం ఉదయం ఈ జాబితాపై స్పష్టత రానున్నది.

### టీఆర్ఎస్ సహకార పరిశీలకులు

| జిల్లా | పరిశీలకులు |
|---|---|
| నిజామాబాద్ | మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఛైర్మన్, పౌర సరఫరాల కార్పొరేషన్ |
| వరంగల్ | గ్యాదరి బాలమల్లు, ఛైర్మన్ టీఎస్ఐఐసీ |
| ఆదిలాబాద్ | కోలేటి దామోదర్, ఛైర్మన్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ |
| రంగారెడ్డి | ఎంఎస్ ప్రభాకర్, మండలిలో ప్రభుత్వ విప్ |
| నల్లగొండ | శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ |
| మెదక్ | బడుగుల లింగయ్య యాదవ్, ఎంపీ |
| మహబూబ్‌నగర్ | బండా ప్రకాశ్, ఎంపీ |
| కరీంనగర్ | నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్సీ |
| ఖమ్మం | నూకల నరేశ్‌రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి |

## రైతులకు ఇబ్బంది లేకుండా రబీకి సన్నద్ధం కండి

**పౌర సరఫరాల మంత్రి గంగుల**



**సాక్షి, హైదరాబాద్:** గత ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని, అలాగే రబీలోనూ చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. శుక్రవారం ఆయన సమావేశ హాల్‌లో రబీపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఉన్నతాధికారులతో స మావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో 3,670 కొనుగోలు కేంద్రాలు, 9.28 లక్షల మంది రైతుల నుంచి 8,626 కోట్ల విలువైన 47.11 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. వచ్చే రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యానికి ముందుస్తు ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రబీ కొనుగోళ్లకు తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే నెల 2న కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

## అమిత్‌షా రాజీనామా చేయాల్సిందే

**టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్**



**సాక్షి, హైదరాబాద్:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అల్లర్లలో 39 మంది మరణించిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమిత్‌షా రాజీనామాను డిమాండ్ చేసిన సోనియాగాంధీ వ్యాఖ్యలను తాము బలపరుస్తున్నామని చెప్పారు. ఢిల్లీలో అల్లర్లు జరగడానికి బీజేపీ ప్రైవేటు సైన్యమే కారణమని, అమిత్‌షా, మోదీలు ఈ విషయంపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజలు వారికి ఓట్లేయలేదని పగ తీర్చుకుంటున్నారని దయాకర్ వ్యాఖ్యానించారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ లాంటి మహానేతలను విమర్శిస్తూ గాడ్సేకు గుడి కట్టే స్థాయికి బీజేపీ నేతలు దిగజారారని, రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని, పరమత సహనం ఉన్న ఈ దేశ ప్రజలు సంయమనంతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ కోరుతుందని దయాకర్ చెప్పారు.

## బీజేపీవి దిగజారుడు రాజకీయాలు: నిరంజన్



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన అల్లర్లను పక్కదోవ పట్టించేందుకు సోనియా గాంధీ రెచ్చగొట్టే ప్రకటనలు చేశారని బీజేపీ ఆరోపిస్తోందని మండిపడ్డారు. రెచ్చగొట్టేలా మాట్లాడినందుకే ముగ్గురు బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తీర్పు చెప్పిన న్యాయమూర్తిని బదిలీ చేయడం ఆ పార్టీ దివాళా కోరుతనమని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో అల్లర్లు జరిగి 39 మంది మరణించిన ఘటన పూర్తిగా కేంద్ర వైఫల్యమని, అంతమంది చనిపోయినా బీజేపీ నేతలు బుద్ధి తెచ్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఢిల్లీలో పరిస్థితులను పూర్తిగా విస్మరించిన హోంమంత్రి అమిత్‌షా ట్రంప్‌నకు స్వాగతం పలికేందుకు వెళ్లడమే ఇందుకు కారణమని నిరంజన్ ఆరోపించారు.

# టీఆర్ఎస్‌లో 'రాజ్యసభ' లెక్కలు

## రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు స్థానాలు..

- సామాజిక సమీకరణాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక!
- రేసులో మాజీ ఎంపీలు కవిత, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎస్సీ సామాజిక వర్గం నుంచి మాజీ డిప్యూటీ సీఎం కడియం



కవిత



పొంగులేటి



కడియం

**సాక్షి, హైదరాబాద్:** రాజ్యసభలో 55 స్థానాలకు సంబంధించిన ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇదివరకే ప్రకటించగా, మార్చి 6వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. తెలంగాణ రాష్ట్ర కోటాలో కేవీపీ రామచంద్రరావు (కాంగ్రెస్), గరికపాటి రామ్మోహన్ రావు (బీజేపీ)తో పాటు ఏపీ కోటాలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పక్ష నేత కె.కేశవ రావు రిటైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు స్థానాలకు వచ్చే నెల 26న పోలింగ్ నిర్వహించేలా షెడ్యూల్ విడుదలైంది. అయితే అసెంబ్లీలో సంఖ్యా పరంగా టీఆర్ఎస్‌కు 104 మంది ఎమ్మెల్యేల బలం ఉండటంతో రెండు స్థానాల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది. రాజ్యసభలో రాష్ట్రం నుంచి ఏడుగురు సభ్యులుండగా, ఐదుగురు టీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. వీరిలో డి.శ్రీనివాస్ ప్రస్తుతం టీఆర్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. వచ్చే నెలలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలో టీఆర్ఎస్ నుంచి మరో ఇద్దరు ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో రాజ్యసభలో రాష్ట్ర కోటాకు సంబంధించిన ఏడు స్థానాలు టీఆర్ఎస్‌కు దక్కనున్నాయి. వివిధ సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ యోచిస్తున్నట్లు తెలిసింది.

### అభ్యర్థిత్వం ఎవరికి?

శాసనసభలో టీఆర్ఎస్‌కు సంఖ్యా బలం ఉండటంతో పలువురు ఆశావహులు టీఆర్ఎస్ తరపున రాజ్యసభ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. త్వరలో రాజ్యసభ నుంచి రిటైరవుతున్న టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు మరోమారు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. అయితే సంఖ్యా పరంగా పార్టీ తరపున ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులుండటం కేశవరావు అభ్యర్థిత్వానికి ఆటంకంగా కనిపిస్తోంది. అయితే రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు స్థానాల్లో ఒకదానికి మాజీ ఎంపీలు కల్వకుంట్ల కవిత, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రెండో స్థానాన్ని ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒకరికి ఇస్తారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. ఎస్సీ సామాజికవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. 2014లో వరంగల్ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన కడియం ఆ తర్వాత తన పదవికి రాజీనామా చేసి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతున్నా సామాజిక సమీకరణాలతో రాష్ట్ర మంత్రిమండలిలో చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో కడియంను రాజ్యసభకు పంపాలని పార్టీ అధినేత కేసీఆర్ యోచిస్తున్నట్లు సమాచారం. ఇటు ఎస్టీ కోటాలో మాజీ ఎంపీ సీతారాంనాయక్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

# మార్చికి 1.20 లక్షల టన్నుల యూరియా

**రబీ వరినాట్లు పెరగడంతో అధికమైన యూరియా వినియోగం**

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే నెలకు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని మార్క్‌ఫెడ్ అంచనా వేసింది. ఆ మేరకు కేంద్రం నుంచి రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేసి అవసరమైన యూరియా తెప్పించినట్లు అధికారులు వెల్లడించారు. రబీ సాగు గణనీయంగా పెరగడంతో యూరియా వినియోగం పెరిగింది. దీంతో గత ఖరీఫ్‌లో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా, రబీలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని ముందస్తు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ రబీకి అన్ని రకాల ఎరువులు కలిపి 15.40 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. అందులో ఒక్క యూరియానే 7.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. అందులో శుక్రవారం నాటికి తెలంగాణకు 12.26 లక్షల ఎరువులు సరఫరా కాగా, అందులో 7.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం సరఫరా చేసింది. గత ఖరీఫ్‌లో మిగిలిన స్టాక్‌తో కలిపి ప్రస్తుతం 1.33 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని మార్క్‌ఫెడ్ వర్గాలు వెల్లడించాయి. ఇటు ఎన్‌పీకే 1.93 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 46 వేల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 22 వేల మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 7 వేల టన్నులుంది. ఇక అన్ని చోట్ల నీటి నిల్వ లుండటంతో రబీలో వరి నాట్లు రికార్డు స్థాయిలో పడుతున్నాయి. రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 16.87 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 29.98 లక్షల ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. దీంతో యూరియా సహా ఇతరత్రా ఎరువుల వినియోగం పెరిగింది.

# మళ్లీ రాములమ్మ 'క్రియాశీలకం'!



**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ ప్రచార కమిటీ ఛైర్‌పర్సన్ విజయశాంతి చేసిన తాజా ప్రకటన ఆసక్తిని కలిగిస్తోంది. తన మనస్తత్వానికి తగినట్టు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పోరాటాలు చేసేందుకు ఇదే సరైన సమయమని, ప్రజాక్షేత్ర పోరాటాల్లో మరింత దూకుడు అవసరమని ఇటీవల ఆమె చేసిన ప్రకటనతో రాములమ్మ మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలకం కాబోతున్నారనే చర్చ ప్రారంభమైంది. అయితే పైకి ఆ విధమైన చర్చ జరుగుతున్నప్పటికీ ఈ ప్రకటన వెనుక విజయశాంతి ఆంతర్యమేంటన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అధిష్టానం తన పోరాట కార్యాచరణకు అనుమతినిచ్చినప్పటికీ రాష్ట్ర నేతల వ్యవహారశైలి వల్లే ప్రజల్లోకి వెళ్లలేకపోయాననే భావన కలిగించే విధంగా ఆమె ప్రకటన విడుదల చేయడం పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీ ప్రచార కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైనప్పటికీ పూర్తిస్థాయిలో ఆమెను ప్రచార పర్వంలో టీపీసీసీ ఉపయోగించుకోకపోవడం, తదనంతర పరిణామాలతో చాలాకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలే ఓ సినిమా ద్వారా వెండితెరపై కనిపించిన లేడీ అమితాబ్ మళ్లీ ఫుల్‌టైమ్ సినిమాలకే కేటాయించబోతున్నారని, ఇప్పట్లో ఎన్నికలు కూడా ఏమీ లేనందున మరో మూడేళ్లు ఆమె రాజకీయాల్లో కనిపించేది డౌటేనని రాజకీయ వర్గాలు భావించాయి. అయితే ఇటీవల మీడియాకు ఇచ్చిన నర్మగర్భ ప్రకటనతో మరోమారు విజయశాంతి రాజకీయ వర్గాల్లో చర్చకు కేంద్ర బిందువయ్యారు. వచ్చే నెలలో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ చీఫ్ సోనియాతో పాటు రాహుల్, ఇతర పార్టీ పెద్దలతో ఆమె భేటీ అవుతారని తెలుస్తోంది. రాష్ట్రంలో రాజకీయంగా ప్రశాంత వాతావరణం ఉన్నా ప్రజల సమస్యలు పెరిగాయని, దీంతో తెలంగాణవ్యాప్తంగా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలతో కలసి పనిచేసేందుకు అనుమతివ్వాలని ఆమె కోరనున్నారు. తన ప్రతిపాదనలకు సమ్మతిస్తే రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం విజయశాంతి పనిచేస్తారని, లేదంటే తన దారి తాను చూసుకుంటానని అధిష్టానానికి తేల్చి చెప్తారని కూడా ఆమె సన్నిహితులు చెబుతున్నారు.




# విద్యుత్ చార్జీల పెంపునకు గ్రీన్‌సిగ్నల్!

- సీఎంతో చర్చించిన విద్యుత్ సీఎండీలు..
- నేడు ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పణ
- ఏప్రిల్ 1 నుంచి చార్జీల పెంపు అమలు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అనుమతించినట్లు సమాచారం. దీంతో వార్షిక బడ్జెట్ అంచనాల నివేదిక (ఏఆర్ఆర్)తో పాటు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు శనివారం రాష్ట్ర విద్యుత్‌నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి సమర్పించే అవకాశముంది. ఈఆర్సీ అనుమతి లాంఛనమే కాగా, పెరిగిన విద్యుత్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలోఅమల్లోకి రానున్నాయి. 2020–21కి సంబంధించిన ఏఆర్ఆర్ నివేదిక, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలను గతేడాది నవంబర్ నెలాఖరులోగా డిస్కంలు ఈఆర్సీకి సమర్పించాల్సి ఉండగా, వివిధ కారణాలు చూపి వరుసగా గడువు పొడిగింపును పొందుతూ వస్తున్నాయి. చివరిసారిగా పొడిగించిన గడువు నేటి (శనివారం)తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, డిస్కంల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమై చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. చార్జీల పెంపు ప్రతిపాదనలను శనివారం ఈఆర్సీకి సమర్పించేందుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న డిస్కంలను గట్టెక్కించేందుకు వాస్తవిక దృక్పథంతో విద్యుత్ చార్జీలు పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. దీంతో మిషన్ భగీరథ, ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించిన విద్యుత్ చార్జీల పెంపును ఈ సమావేశంలో సీఎం వ్యతిరేకించినట్లు సమాచారం. దీంతో కమర్షియల్, పరిశ్రమల కేటగిరీల వినియోగదారులపై చార్జీల పెంపు భారం గతంలో కంటే అధికంగా పడే అవకాశం ఉందని సమాచారం. అలాగే గృహ వినియోగదారులపై కూడా చార్జీల పెంపు భారం వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేటగిరీల వారీగా గృహ, పరిశ్రమలు, కమర్షియల్ ఇతర వినియోగదారులకు ప్రతిపాదిస్తున్న చార్జీల పెంపు వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. అన్ని కేటగిరీల వినియోగదారులపై దాదాపు రూ.2 వేల కోట్ల అదనపు భారం పడనుందని సీఎంకు వివరించినట్లు తెలిసింది. రాష్ట్ర డిస్కంల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సబ్సిడీకి రూ.10 వేల కోట్లకు పెంచుతామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం.



## విరిగిన పట్టా.. తప్పిన ప్రమాదం

**తాండూర్ (బెల్లంపల్లి):** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రానికి చేరువలో రైల్వే పట్టా విరిగింది. హైదరాబాద్ – న్యూఢిల్లీ మార్గంలో అఫ్‌లైన్‌పై 228/7 స్తంభం వద్ద ప్రమాదవశాత్తు రైలు పట్టా విరిగింది. ఈ సంఘటనను అదే ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న కీమ్యాన్ మల్లేశ్ గుర్తించి, రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి రైల్వే అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని రైల్వే ఏఈఈ సూరజ్, మరో ఇద్దరు సిబ్బంది రైల్వేట్రాక్ మరమ్మతు చేపట్టారు. అప్పటి వరకు ఓ ప్యాసింజర్, మరో ఎక్స్‌ప్రెస్ రైలు గంటపాటు ఆలస్యంగా నడిచాయి. కీమ్యాన్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## రేపు బాబ్లీ గేట్ల ఎత్తివేత

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ భాగాన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఆదివారం ఎత్తనున్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఆదివారం బాబ్లీ గేట్లు తెరిచి ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదులుతారు. దీంతో ఎస్సారెస్పీకి జలకళ వచ్చే అవకాశం ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు త్రి సభ్య కమిటీ సమక్షంలో ఎత్తుతారు. తెలంగాణ నుంచి ఎస్సారెస్పీ ఎస్ఈ పాల్గొనే అవకాశం ఉంది.

## సెల్ఫ్ ఇరిగేషన్ పద్ధతిలో మొక్కల పెంపకం

### 60 రోజుల పాటు మొక్కకు నీరు: కలెక్టర్ అజీమ్

**భూపాలపల్లి రూరల్:** దేశంలోనే మొదటిసారిగా సెల్ఫ్ ఇరిగేషన్ పద్ధతిలో మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మండలం మోరంచపల్లిలో సెల్ఫ్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా కలెక్టర్ జామ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ఫ్ ఇరిగేషన్ సిస్టం అనేది మొక్కల పెంపకంలో నూతన సాంకేతిక పద్ధతి అని.. ఈ విధానంలో ప్రత్యేకమైన బాక్స్‌లో మొక్కను పెట్టి భూమిలో పాతుతారు. బాక్సులో 15 లీటర్ల నీటిని నింపి 60 రోజుల వరకు అందిస్తే మొక్క ఆరోగ్యవంతంగా పెరిగేలా దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పద్ధతిలో ఒక మొక్క నాటేందుకు రూ.90 మాత్రమే ఖర్చు అవుతుందని, మెల్బోర్న్‌లో ఐటీ చదివిన హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌నౌ అనే సంస్థ డైరెక్టర్ రాహుల్ పర్యవేక్షణలో జిల్లాలో ఈ టెక్నాలజీ ద్వారా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## పందెం పావురం!

### కాళ్లకు రింగులు.. వాటికి బార్‌కోడ్



**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ మండలం జంగిలిగొండ గ్రామంలో ఎక్కడి నుంచో వచ్చిన ఓ పావురం ఓ ఇంటి ముందు వాలింది. ఇంటి యజమాని దాన్ని పట్టుకున్నాడు. పరిశీలించగా కాళ్లకు రెండు వైపులా రింగులు తొడిగి ఉండి.. జియో బార్‌కోడ్ నంబర్లు ఉండటంతో మొబైల్ ఆధారంగా దాన్ని అనుసంధానం చేయడంతో నంబర్ కనబడింది.. ఆ నంబర్‌కు కాల్ చేయగా చెన్నయ్‌కు చెందిన వ్యక్తి మాట్లాడాడు. అది పందేలకు ఉపయోగించే పావురమని చెప్పాడు.


**NATIONAL CENTRE FOR SUSTAINABLE AQUACULTURE (NaCSA)**
(MPEDA, Ministry of Commerce & Industry, Govt. of India) ISO 9001: 2015
Dr. No: 70-1A-6/1, Ramanayyapeta, Kakinada - 533003, E.G.Dist, A.P.
Telephone : + 91 884 2350655, E-mail : nacsa@mpeda.gov.in
Ref. No: NaCSA/HQ/Tech/14/2019-20 Date 28-02-2020
**NOTICE INVITING FOR QUOTATIONS**
NaCSA invites sealed quotations in two bid system in separately (i.e. Technical Bid and Financial Bid) from eligible bidders for the "Supply of Lab Equipment, Chemicals and Glassware" for NaCSA Aqua One Centres in different Coastal Districts of Andhra Pradesh. For further details please visit NaCSA website under the tenders http://nacsampeda.org.in. The bids shall be submitted to NaCSA, HQ Kakinada on or before at 18.00 P.M on 06-03-2020.
Sd/-
CEO - NaCSA

తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా**
టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నంబర్లు 13/2019-20, తేది: 27-02-2020 ద్వారా పనులకు గాను రూ. 96.96 లక్షలకు లభ్యమగు తేది : 27-02-2020 నుండి 05-03-2020 వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడగలరు.పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, I & CADD., ఇరిగేషన్ సర్కిల్, నిజామాబాద్
DIPR RO.No. 734-PP/CL/Advt/1/2019-20, Dt: 28/02/2020

తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ**
సంక్షిప్త టెండరు ప్రకటన
Rc.No.1088/2018/A4 తేది: 26-02-2020
నాగర్‌కర్నూలు జిల్లాలో ఆమ్రాబాద్ డివిజన్‌లోని దోమలపెంట రేంజ్‌లో Comp.No.202 లో తాటిగుండాల్ సెక్షన్‌లోని ఈగలపెంట (N) బీట్‌లో వజ్రాలమడుగు వద్ద వాచ్‌టవర్ నిర్మాణం కోసం దిగువ సంతకందారు సీల్డ్ టెండరు కోరుతున్నారు. పని స్వభావము: వాచ్‌టవర్ నిర్మాణం. రేంజ్ పేరు: దోమలపెంట. పని పేరు: వాచ్‌టవర్ నిర్మాణం. అంచనా వ్యయం: 9.602. టెండరు షెడ్యూలు (వాపసురాని) ధర రూ.2000/-ను "Forest Divisional Officer, Amrabad"పేరున DD రూపంలో చెల్లించాలి. టెండరు షెడ్యూళ్ళు 28-02-2020 నుండి 06-03-2020 ఉ.10:30 గం. నుండి సా.5:00 గం. వరకు కార్యాలయ పనివేళలలో జారీ చేయబడతాయి. సీల్డ్ టెండర్లు 07-03-2020న లేదా ఆలోగా మ.01:00 గం. వరకు స్వీకరించబడతాయి మరియు అదే రోజున అనగా 07-03-2020న మ.3:00 గం.కు టెండర్స్ కమిటీ సమక్షంలో తెరువబడును. సంప్రదించు నం. 7337442411, 9494885965
సం/- ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, ఆమ్రాబాద్
DIPR Ro.No.2550-DP/CL/Advt/1/2019-20, Dt: 28-02-2020

**శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా:**
**ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగ వేలము నోటిఫికేషన్**
ఆర్.సి నం.బి4/1322/2019 తేది: 28.02.2020
వేములవాడ మరియు కరీంనగర్ పట్టణములందు దేవస్థానమునకు చెందియున్న దుకాణములను తేది: 01.04.2020 నుండి తేది: 31/03/2022 వరకు రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుటకుగాను ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును మరియు వేములవాడ పట్టణమందలి జాతర గ్రౌండ్ నందు దేవస్థానమునకు చెందియున్న గోశాల ప్లాట్లు, రెండు టేలా స్థలములు మరియు బాలానగర్ & వేములవాడ నుండి కోరుట్లకు వెళ్ళు ఆర్ & బి రోడ్ మార్గమున గల దేవస్థానమునకు చెందియున్న ప్లాట్లను రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుటకుగాను ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు అన్ని అంశములకు బహిరంగ వేలము జరుగు తేది: 10.03.2020. కావున ఆసక్తి గలవారు https://tender.telangana.gov.in నకు లాగ్ ఆన్ చేసి పూర్తి వివరములు పొందవచ్చును. అట్లే దేవస్థానం లీజుల విభాగము నందు కూడా పూర్తి వివరములు తెలుసుకొనవచ్చును. పూర్తి వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9490525578, 8121269879 & 9963607403.
సం/- కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)
DIPR RO.No.732-PP/CL/Advt/1/2019-20, Dt: 28.02.2020

**TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED**
VIDYUT SOUDHA :: HYDERABAD - 500 082.
**T.No.e-21/CEG/SEG-II/E5A3/Hydrochloric Acid/TSGENCO/19-20**
Supply of 964 MT of Hydrochloric Acid (Technical Grade 30-33%) by conforming to IS-265-1993 (Reaffirmed 2015) or its latest versions for various Thermal Power Generating Stations of TSGENCO for the year 2020-21. Value of the works: ₹.23,04,700/-. Scheduled Open & Closing Date: 18.02.2020 at 15:00 Hrs & 17.03.2020 at 12:00 Hrs.
**T.No.e-22/CEG/SEG-II/E5A2/Sulphuric Acid/TSGENCO/2019-20**
Supply of 2445 MT of Sulphuric Acid (Technical Grade 98-99% by weight naked) conforming to IS-646-1993 (Reaffirmed 2015) or its latest versions along with Maintenance and Repair charges for various Thermal Power Generating Stations of TSGENCO for the year 2020-21. Value of the works: ₹.1,88,70,590/-. Scheduled Open & Closing Date: 24.02.2020 at 18:00 Hrs & 18.03.2020 at 15:00 Hrs.
**T.No.e-23/CEG/SEG-II/E5A1/Liquid Chlorine/TSGENCO/2019-20**
Supply of 310 MT of Liquid Chlorine in 01 MT Cylinders confirming to IS-646-1986(Reaffirmed 2015) or its latest versions along with Maintenance and Repair charges for various Thermal Power Generating Stations of TSGENCO for the year 2020-21. Value of the works: ₹.37,19,745/-. Scheduled Open & Closing Date: 24.02.2020 at 18:00 Hrs & 18.03.2020 at 15:00 Hrs.
**T.No.e-24/CEG/SEG-II/E5A1/Filter Alum/TSGENCO/2019-20**
Supply of 1338 MT of Filter Alum (Non-Ferric) in powder form with AL2O3(16-17%) conforming to IS-260-2001 (Reaffirmed 2017) or its latest versions packed in HDPE bags of 25 bags for various Thermal Power Generating Stations of TSGENCO for the year 2020-21. Value of the works: ₹.1,63,23,600/-. Scheduled Open & Closing Date: 25.02.2020 at 18:00 Hrs & 19.03.2020 at 15:00 Hrs.
For further Details: " www.tsgenco.co.in & https://tender.telangana.gov.in"




## మత్స్యావతారంలో నారసింహుడు

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు మత్స్యావతారంలో ముస్తాబైన స్వామివారు భక్తజనులకు దర్శనమిచ్చారు. అలాగే రాత్రి 9 గంటలకు శేష వాహనంపై దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఉదయం, సాయంత్రం సేవల్లో భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

– యాదగిరిగుట్ట



## పోటెత్తిన కందులు

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు కందులు పోటెత్తాయి. శుక్రవారం దాదాపుగా 3 వేల క్వింటాళ్ల కందులను రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. గురు, శుక్రవారాలు రెండు రోజులు కలిపి దాదాపుగా ఆరు వేల క్వింటాళ్ల కందులు మార్కెట్‌కు వచ్చాయి. కందుల రాశులతో మార్కెట్ నిండిపోయింది. శుక్రవారం బస్తాలు రావడంతో యథావిధిగా కాంటాలు మొదలయ్యాయి.

– సూర్యాపేట వ్యవసాయం

# చిచ్చురేపిన ఫేస్‌బుక్ చాటింగ్

### యువకుడి దారుణ హత్య.. వివాహిత ఆత్మహత్య

- నా జీవితంలో కార్తీక్ చిచ్చుపెట్టాడని సూసైడ్ నోట్
- కార్తీక్‌ను హత్య చేసిందెవరు? ● పోలీసుల అదుపులో నిందితులు?
- మహబూబ్‌నగర్, గద్వాలలో కలకలం

**గద్వాల క్రైం/ మహబూబ్‌నగర్ క్రైం:** ఫేస్‌బుక్ చాటింగ్.. ఒకరి హత్య.. మరొకరి ఆత్మహత్యకు కారణమైంది. డిగ్రీలో ప్రేమించమంటూ వెంటపడినా ఆమె పట్టించుకోలేదు. అనంతరం ఆ యువతికి వేరొకరితో వివాహమై ఏళ్లు గడిచాక ఫేస్‌బుక్ ద్వారా తిరిగి పరిచయం చేసుకున్నాడు. మంచి ఫ్రెండ్‌గా ఉంటానంటూ.. వ్యక్తిగత విషయాలు తెలుసుకొని మళ్లీ వేధించసాగాడు. ఈ క్రమంలోనే సదరు యువకుడు దారుణ హత్యకు గురికావడం.. ఈ హత్యానేరం తనపైకి వస్తుందని సదరు వివాహిత ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. ఈ ఘటనలు గద్వాల, మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం..

గద్వాల జిల్లా వెంకటరమణ కాలనీకి చెందిన రాగ సుధ (29), అదే ప్రాంతానికి చెందిన కార్తీక్ (31) డిగ్రీ క్లాస్‌మెట్లు. అప్పట్లో కార్తీక్ సుధను ప్రేమించమని వేధించేవాడు. ఈ క్రమంలో సుధకు 2011లో మహబూబ్‌నగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్‌తో వివాహమైంది. ప్రస్తుతం వారికి ఓ కుమారుడు ఉన్నాడు. ఏడాది కిందట కార్తీక్ ఫేస్‌బుక్ ద్వారా మళ్లీ సుధకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించి పరిచయం అయ్యాడు. కొంతకాలం స్నేహంగా ఉన్నా సుధ.. తర్వాత అతడిని దూరం పెడుతూ వచ్చింది. దీంతో కార్తీక్ ఆమెను పలు రకాలుగా బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. 'నువ్వు నాతో మాట్లాడకపోతే వివాహేతర సంబంధం ఉందని నీ భర్తకు చెబుతా.. అలాగే, నీ భర్తను, తల్లిదండ్రులను చంపుతానని బెదిరించాడు.

**కార్తీక్ దారుణ హత్య**

ఇదిలా ఉండగా.. గద్వాలలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్తీక్.. ఈ నెల 24వ తేదీన మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నా అని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తమ కుమారుడు కనిపించడం లేదని కార్తీక్ తండ్రి నాగేందర్ 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని యువకుడిని హత్య చేసి గద్వాల మండలం మేళ్లచెర్వు (99ప్యాకేజీ) గుట్టల సమీపంలో పూడ్చినట్లు శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. హత్యకు గురైంది కార్తీక్ అని సమాచారం.



రాగసుధ మృతదేహం



బయట పడిన యువకుడి తలభాగం

**సుధ బలవన్మరణం**

ఈ క్రమంలో తనను వేధింపులకు గురి చేసిన కార్తీక్ మృతి చెందాడనే విషయం తెలుసుకుని రాగ సుధ ఆందోళనకు గురైంది. ఆ నేరం తనపైకి వస్తోందని భావించి భయంతో శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అంతకంటే ముందు సుధ తన తండ్రి నాగేందర్‌కు ఫోన్ చేసి తాను మానసిక ఒత్తిడిలో ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన కొడుకును బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ కట్ చేసింది. అయితే, కార్తీక్ హత్యానేరం తనపైకి వస్తుందనే భయంతో ఆత్మహత్య చేసుకున్న సుధ.. తన చావుకు కారణమైనవారిని వదిలిపెట్టొద్దని సూసైడ్ నోట్‌లో రాయడం గమనార్హం. కాగా, కార్తీక్‌ను హత్య చేసింది ఎవరు.. ఈ కేసులో ఇంకా ఎవరిదైనా ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కార్తీక్ స్నేహితుడు కూడా ఫేస్‌బుక్ ద్వారా రాగ సుధకు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో కార్తీక్ పెడుతున్న ఇబ్బందులను ఆమె ఒకసారి అతడికి చెప్పింది. దీంతో తీరు మార్చుకోవాలని కార్తీక్‌ను సదరు స్నేహితుడు పలుమార్లు హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం గద్వాల మేళ్లచెరువు దగ్గర ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడం.. అది కార్తీక్‌దే అనే అనుమానం వ్యక్తమవడం కలకలం రేపింది. అయితే ఈ ఘటనపై కార్తీక్ స్నేహితుడి పాత్రపై పోలీసులు విచారిస్తున్నారు. కాగా, నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయారని సమాచారం.

### నా జీవితంలో కార్తీక్ చిచ్చు పెట్టాడు

ఆత్మహత్యకు ముందు రాగ సుధ ఆరు పేజీల సూసైడ్ నోట్ రాసింది. 'భర్త, కుమారుడితో ఆనందంగా ఉన్న నా జీవితంలోకి స్నేహం అనే పేరుతో కార్తీక్ వచ్చి నాకు జీవితం లేకుండా చేశాడు. అనేక ఇబ్బందులు పెడుతూ చివరకు నా చావుకు కారణం అయ్యాడు . నా చావుకు కారణమైనవారిని వదిలిపెట్టొద్దు' అని అందులో పేర్కొంది.

# 'కొండపోచమ్మ' పనులు వేగవంతం చేయాలి

### అనంతగిరి ప్రాజెక్టుకు త్వరలో ట్రయల్ రన్

- నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా ఉంటాం
- నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్
- మిడ్‌మానేరు ప్రాజెక్టు పనుల పరిశీలన

**బోయినపల్లి (చొప్పదండి):** కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు మిడ్ మానేరు, రంగనాయక సాగర్ ప్రాజెక్టుల మీదుగా కొండపోచమ్మ వరకు తరలించే పనులు వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం సీఎం ఓఎస్‌డీ శ్రీధర్ దేశ్‌పాండే, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ హరిరామ్‌లతో కలసి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం జలాలు కొండ పోచమ్మ ప్రాజెక్టు వరకు తరలించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే అనంతగిరి (అన్నపూర్ణ) ప్రాజెక్టులోకి ట్రయల్ రన్ విషయమై కొన్ని స్థానిక సమస్యలు ఉన్నాయని, వాటిని సాంకేతికంగా, న్యాయపరంగా చిక్కులు అధిగమిస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల డిమాండ్‌పై స్పందిస్తూ.. ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా ఉంటామన్నారు. కాగా, మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ సమస్యలు, ఇళ్ల నిర్మాణాలకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలను కలెక్టర్ కృష్ణభాస్కర్ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్‌కు వివరించారు.

**మార్చిలో రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు**

చిన్నకోడూరు: అంతగిరి, రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి మార్చి 10 వరకు గోదావరి జలాలు వస్తాయని రజత్ కుమార్ వెల్లడించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులో టన్నెల్, సర్జిపుల్ పంప్‌హౌస్ నిర్మాణాలు పరిశీలించారు. డిసెంబర్ వరకు భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. జూన్ 2021 వరకు అనంత రిజర్వాయర్ కింద 30 వేల ఎకరాల ఆయకట్టు, రంగనాయక సాగర్ కింద లక్ష పది వేల ఎకరాలు, మల్లన్న సాగర్ కింద లక్ష 25 వేల ఎకరాలు ఆయకట్టు, కొండ పోచమ్మ సాగర్ కింద రెండు లక్షల 85 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించాలని ఆయన ఆదేశించారు.



ప్రాజెక్టు అందాలు చూస్తున్న రజత్ కుమార్

### వావ్.. మిడ్‌మానేర్

మిడ్‌మానేరు ప్రాజెక్టు జలకళను చూసి రజత్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అందాలను చూసి ముగ్ధుడయ్యారు. ప్రాజెక్టు గేట్ల గదులను పరిశీలించారు. 25 టీఎంసీల నీరు చేరికతో ప్రాజెక్టు నిండు కుండలా తయారైందన్నారు. ఇక సాగు నీటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. వావ్ మిడ్ మానేర్.. అన్ బిలీవబుల్ అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

## పతనం దిశగా దేశ ఆర్థిక వ్యవస్థ

### కేంద్రంపై పీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం

**చింతలపాలెం:** భారత ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరుకుందని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అల్టిమేట్ ఎనర్జీ సోర్స్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ప్రధాన మంత్రి కౌశల్ శిక్షణ కేంద్రాన్ని ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీపీ, ఎకానమీ గ్రోత్‌లు కూడా తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో జీడీపీ గ్రోత్ రేట్ 8 శాతానికి పైగా ఉండగా.. ప్రస్తుతం 4.5 శాతం తగ్గుదల ఉందన్నారు. ఇది ఆందోళనకరమైన విషయమని చెప్పారు. దీంతో నిరుద్యోగులు ఎక్కువగా ఇబ్బందులు పడతారన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ 3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి కౌశల్ యోజన నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని, దీని ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు గిరిబాబు, శ్రీనివాస్, గోవింద్, నాన్‌రాజ్ పాల్గొన్నారు.



# పీటల మీద ఆగిన పెళ్లి

- జీలకర్ర బెల్లం పెట్టే సమయంలో నిరాకరించిన వధువు
- ఘర్షణ పడిన బంధువులు.. సర్దిచెప్పిన పోలీసులు

**కొత్తకోట రూరల్:** జీలకర్ర బెల్లం పెట్టే సమయంలో తనకు పెళ్లి ఇష్టం లేదని వధువు పెళ్లికి నిరాకరించింది. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం చర్లపల్లిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పామాపురం గ్రామానికి చెందిన నందిని అదే మండలం చర్లపల్లికి చెందిన వెంకటేశ్‌ల పెళ్లి శుక్రవారం చేసేందుకు పెద్దలు నిశ్చయించారు.ఉదయం 8.10 గంటలకు ముహూర్తం ఉండటంతో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. తీరా జీలకర్ర బెల్లం పెట్టే సమయానికి నందిని తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని చెప్పింది. దీంతో పెళ్లికి వచ్చినవాళ్లందరూ అవాక్కయ్యారు. నందినిని ఆమె మేనబావ పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఈ వివాహానికి నిరాకరించిందని నిర్ధారణకు వచ్చిన వరుడి బంధువులు వధువు మేనబావపై దాడి చేశారు. దీంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు వచ్చి, జరిగిన విషయం తెలుసుకొని అమ్మాయికి ఇష్టం లేని పెళ్లి చేయొద్దని ఇరు కుటుంబాలకు సర్ది చెప్పారు.



ట్రెంచ్ పైనుంచి దూకుతున్న కలెక్టర్ అజీమ్

## దుమికిన కలెక్టర్!

'పట్టణ ప్రగతి'కార్య క్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ శుక్రవారం పలు కాలనీల్లో పర్యటించారు. ఈ క్రమంలో జవహర్ కాలనీలో శ్మశాన వాటిక స్థల అన్వేషణ కోసం శివారులో ఫారెస్టు చుట్టూ ఉన్న ట్రెంచ్ దాటేందుకు జంప్ చేశారు. అచ్చం సినిమా షూటింగ్‌లో మాదిరి ఆయన జంప్ చేయగా.. ప్రజాప్రతినిధులు మాత్రం కాలువలో రాళ్లు వేసి దాటారు.

– గుర్రం సంపత్‌గౌడ్, ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా



మెట్లపై కూర్చుని విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

## బువ్వ బాగుందే..!

'పట్టణ ప్రగతి' కార్య క్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ శుక్రవారం తొర్రూరులో పర్యటించారు. పార్కుల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. తర్వాత ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అప్పటికే మధ్యాహ్న భోజన సమయం కావడంతో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటే మెట్లపై కూర్చుని భోజనం చేస్తూ వారి బాగోగులపై ఆరా తీయడం ఆకట్టుకుంది.

– తొర్రూరు

# కల్లోలం నుంచి క్రమంగా..!


అల్లర్లలో ఇల్లు తగులబడిపోగా సర్వస్వం కోల్పోయి దిగాలుగా కూర్చున్న దంపతులు

## తేరుకుంటున్న ఈశాన్య ఢిల్లీ; శుక్రవారం ప్రశాంతం

- 42కి చేరిన అల్లర్ల మృతుల సంఖ్య; ఢిల్లీ సీపీగా శ్రీవాస్తవ

**న్యూఢిల్లీ:** వారం ప్రారంభంలో అల్లర్లతో అట్టుడికిన ఢిల్లీ క్రమంగా తేరుకుంటోంది. పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య అల్లర్లు చెలరేగిన ఈశాన్య ఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రజలు శుక్రవారం ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చి, నిత్యావసరాలను కొనుగోలు చేశారు. వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగులు విధులకు వెళ్లడం ప్రారంభించారు. శుక్రవారం ప్రార్థనల సందర్భంగా భద్రతాదళాలు అన్ని ప్రాంతాల్లో గట్టి నిఘాను పెట్టాయి. మసీదుల్లో మౌల్వీలు శాంతి సంయమనం పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వదంతులకు, తప్పుడు వార్తలకు స్పందించవద్దని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసులు ప్రకటించారు. అయితే, చెత్త, వ్యర్థ వస్తువులను ఏరుకునేందుకు శుక్రవారం ఉదయం బయటకు వెళ్లిన తన తండ్రి తలపై గాయాలతో చనిపోయారని సల్మాన్ అన్సారీ అనే వ్యక్తి తెలిపారు.

### ప్రతీ ముగ్గురిలో ఒకరికి బుల్లెట్ గాయాలు

ఈశాన్య ఢిల్లీలో లెఫ్టినెంట్ జనరల్ అనిల్ బైజాల్ సీనియర్ పోలీసు అధికారులతో కలిసి మౌజ్‌పూర్, జఫ్రాబాద్, గోకుల్‌పురిల్లో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. అల్లర్లకు సంబంధించి పోలీసులు 148 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. దాదాపు 630 మందిని అరెస్ట్ చేయడమో లేక అదుపులోకి తీసుకోవడమో చేశారు. ఢిల్లీ పోలీసులతో పాటు 7 వేల మంది పారా మిలటరీ దళాలు సమస్యాత్మక ప్రాంతాల్లో పహారా కాస్తున్నాయి. అల్లర్లలో చనిపోయిన వారి సంఖ్య శుక్రవారానికి 42కి చేరింది. వందకు పైగా క్షతగాత్రులు వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతులు, క్షతగాత్రుల్లో ప్రతీ ముగ్గురిలో ఒకరికి బుల్లెట్ గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. జీటీబీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో శుక్రవారం నలుగురు చనిపోయారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం 9 ప్రాంతాల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడ బాధితులకు ఆహారం అందిస్తున్నారు. ఇళ్లు ధ్వంసమైన వారికి రూ. 25 వేల చొప్పున అందజేస్తున్నట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు.

### ఐపీఎస్ శ్రీవాస్తవకు అదనపు బాధ్యతలు

అల్లర్ల సమయంలో శాంతి భద్రతల విభాగం స్పెషల్ కమిషనర్‌గా నియమితుడైన ఐపీఎస్ అధికారి ఎస్ఎన్ శ్రీవాస్తవకు శుక్రవారం అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆదివారం నుంచి ఆయన ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా విధులు చేపట్టనున్నారు. అల్లర్లను గుర్తించడంలో, అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శలు ఎదుర్కొన్న ప్రస్తుత కమిషనర్ అమూల్య పట్నాయక్ నుంచి ఆయన బాధ్యతలను స్వీకరిస్తారు. 'ప్రజల్లో భద్రతా భావాన్ని, మా కోసం పోలీసులున్నారనే ధైర్యాన్ని పాదుకొల్పడమే ప్రస్తుతం నా ప్రధాన బాధ్యత' అని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తూ శ్రీవాస్తవ వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో 331 శాంతి సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు.

### కాంగ్రెస్ కమిటీ

అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను రూపొందించేందుకు ఐదుగురితో కూడిన కమిటీని శుక్రవారం కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ ఏర్పాటు చేశారు.

### బిల్డింగ్ పైనుంచి దూకేశాం

'బుధవారం రాత్రి ఇంట్లో ఉండగా, అకస్మాత్తుగా ఒక గుంపు మా ఇంట్లోకి జొరబడింది. నన్ను, నా ఇద్దరు కూతుర్లను లైంగికంగా వేధించడం ప్రారంభించారు. భయంతో దుప్పట్లు చుట్టుకుని బిల్డింగ్ పై నుంచి దూకేశాం' అని ఒక బాధిత మహిళ తెలిపింది. ఆమె ఒక ఎన్జీవోను నిర్వహిస్తున్నారు.

### 'గాంధీ'లపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి!

విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక వాద్రాలపై కేసులను నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, అమానతుల్లా ఖాన్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే వారిస్ పఠాన్‌లపై కూడా ఎఫ్ఐఆర్ దాఖలయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని 'లాయర్స్ వాయిస్' సంస్థ తమ పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్లను శుక్రవారం కోర్టు విచారించింది. విద్వేష ప్రసంగాలు చేసిన బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని దాఖలైన పిటిషన్లలో తాము భాగస్వాములమవుతామని భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించింది. సీబీఎస్సీ పరీక్ష కేంద్రాలకు పటిష్ట భద్రత కల్పించాలని ఢిల్లీ హైకోర్టు ప్రభుత్వాన్ని, పోలీసులను ఆదేశించింది.


అల్లర్ల తర్వాత తండ్రి ఆచూకీ తెలీకపోవడంతో తల్లితో కలసి ఢిల్లీలో ఓ ఆస్పత్రి మార్చురీ బయట వేచి ఉన్న బాలిక

## పేరు అడిగి.. కొట్టి చంపారు!


సల్మాన్

ఉదయం చెత్త ఏరేందుకు బయటకు వెళ్లిన వ్యక్తి తీవ్ర గాయాలతో తిరిగివచ్చి, అనంతరం చనిపోయిన ఘటన శుక్రవారం ఈశాన్య ఢిల్లీలో చోటు చేసుకుంది. అయూబ్ షబ్బీర్ ఢిల్లీ శివార్లలోని గజియాబాద్‌లోని నస్బంది కాలనీ వాసి. రోజూ చెత్త, ఇతర వ్యర్థ వస్తువులు ఏరుకుని, వాటిని అమ్మి జీవనం సాగిస్తుంటారు. ఆయన శుక్రవారం ఉదయం చెత్త సేకరణకు ఈశాన్య ఢిల్లీకి వెళ్లాడని, సాయంత్రం కొందరు ఆయనను తలపై తీవ్ర గాయాలతో తీసుకువచ్చారని ఆయన కుమారుడు సల్మాన్ తెలిపారు. ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మరణించాడన్నారు. 'వెళ్లొద్దని చెప్పాను. అయినా వినలేదు. పరిస్థితులు బాగానే ఉన్నాయి. సంపాదన లేకుండా ఎంతకాలం ఉంటాం? అని చెప్పి ఉదయమే బయటకు వెళ్లాడు' అని సల్మాన్ వివరించాడు. ఈశాన్య ఢిల్లీ ప్రాంతంలో కొందరు పేరు, మతం అడిగి, ఆ తరువాత దారుణంగా కొట్టారని తన తండ్రి తనకు చెప్పాడని సల్మాన్ వివరించాడు. పోలీసులకు సమాచారమిచ్చానని, అయినా, వారు తన తండ్రిని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు సహకరించలేదని చెప్పారు. తాను దివ్యాంగుడినని, తండ్రి తప్ప తనకెవరూ లేరని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

## ప్రతిపక్షాల వల్లే అల్లర్లు: అమిత్ షా



**భువనేశ్వర్:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు చేసిన దుష్ప్రచారమే ఢిల్లీలో మత ఘర్షణలకు దారితీసిందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. భువనేశ్వర్‌లో జరిగిన ర్యాలీలో శుక్రవారం ఆయన ప్రసంగిస్తూ.. 'సీఏఏ అమలుతో ముస్లింలు దేశ పౌరసత్వాన్ని కోల్పోతారంటూ ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం సాగించాయి. ప్రజలను రెచ్చగొట్టడం గొడవలకు దారితీసింది' అని అన్నారు. సీఏఏతో ఎవరూ పౌరసత్వం కోల్పోరు. పైపెచ్చు దీనితో మరికొందరికి పౌరసత్వం లభిస్తుంది. ఈ చట్టం చారిత్రక నిర్ణయం. అయితే, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఎస్పీ, బీఎస్పీ, మమతా దీదీ అబద్ధాలు ప్రచారం చేశారు' అని ఆరోపించారు.

## రెచ్చగొట్టిన వారిపై చర్యలు తీసుకోండి: విపక్షాల లేఖ

ఈశాన్య ఢిల్లీలో ప్రశాంతవాతావరణం నెలకొనేలా యంత్రాంగాన్ని ఆదేశించాలని, విద్వేషాలను ప్రేరేపించేలా ప్రసంగించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెసేతర ప్రతిపక్షాల నేతలు రాష్ట్రపతి కోవింద్‌కు లేఖ రాశారు. అల్లర్ల కారణంగా నిరాశ్రయులైన వారి కోసం సహాయ శిబిరాలను ప్రారంభించాలని, రక్షణ కల్పించడంతోపాటు నిత్యావసర సరుకులను సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పరిస్థితులపై చర్చించేందుకు తమకు సమయమివ్వాలని వారు రాష్ట్రపతిని కోరారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి, లోక్‌తాంత్రిక్ జనతా దళ్‌కు చెందిన శరద్ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రఫుల్ పటేల్, ద్రవిడ మున్నేట్ర కజగం నుంచి టీఆర్ బాలు, సీపీఐ నేత డి.రాజా, రాష్ట్రీయ జనతాదళ్‌కు చెందిన మనోజ్ ఝా, ఆప్ నేత సంజయ్ సింగ్ ఆ లేఖపై సంతకాలు చేశారు.

## ఢిల్లీ అల్లర్లను ప్రస్తావించా: మమతా



**భువనేశ్వర్:** ఈస్టర్న్ జోనల్ కౌన్సిల్(ఈజెడ్‌సీ) సమావేశంలో ఢిల్లీ అల్లర్ల అంశాన్ని ప్రస్తావించినట్లు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వెల్లడించారు. భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగిన ఈజెడ్‌సీ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఈ సమావేశంలో సీఏఏ, ఎన్నార్సీల ప్రస్తావన రాలేదు. అవి సమావేశం ఎజెండాలో లేవు. ఢిల్లీలో ఘర్షణలను మాత్రం నేను ప్రస్తావించా. ఈశాన్య ఢిల్లీలో పరిస్థితులు మరింత విషమించకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు పరిహారం అందించాలని కోరా' అని తెలిపారు.

## ఈసారి ఎండలు సాధారణం కంటే ఎక్కువే

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో దక్షిణ, వాయవ్య, పశ్చిమ, మధ్య భారతంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. ఈ సీజన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హరియాణా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో ఎండలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించింది.

## కన్హయ్య కుమార్‌పై దర్యాప్తునకు అంగీకారం

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కన్హయ్య కుమార్ సహా మరో ఇద్దరిపై నమోదైన 2016 రాజద్రోహ నేరం కేసులో దర్యాప్తు కొనసాగించేందుకు ఢిల్లీ ప్రభుత్వం పోలీసులకు అనుమతిచ్చింది. జేఎన్‌యూ పూర్వ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, కన్హయ్యలపై ఢిల్లీ పోలీసులు 2019 జనవరి 14 చార్జిషీట్ దాఖలు చేశారు. 2016 ఫిబ్రవరి 9, జేఎన్‌యూలో నిర్వహించిన ఊరేగింపునకు వారు నాయకత్వం వహించారని, క్యాంపస్‌లో దేశద్రోహ నినాదాలిచ్చిన వారికి మద్దతుగా నిలిచారని పోలీసులు వెల్లడించారు.

## మే 1 కల్లా ప్లాస్టిక్‌రహిత రాష్ట్రంగా మారుస్తాం



**ముంబై:** మే 1 నాటికల్లా మహారాష్ట్రను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తామని మంత్రి ఆదిత్య ఠాక్రే వెల్లడించారు. శుక్రవారం ఆయన శాసనమండలిలో ఈ విషయం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికే ఈ మేరకు చర్యలు ప్రారంభించిందని పేర్కొన్నారు. 2018లో ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల తయారీ, వాడకం, అమ్మకం, నిల్వ చేయడం వంటి వాటిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించినా సరిగ్గా అమలు కావడం లేదంటూ అడిగిన ప్రశ్నకు ఆదిత్య సమాధానమిచ్చారు. వాడి పారేసిన ప్లాస్టిక్ వస్తువులను కేజీకి రూ.15 చెల్లించి ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తోందని వెల్లడించారు.

## చొరబాటుదారుల సమాచారమిస్తే రూ.5వేలు

**మహారాష్ట్ర:** చొరబాటుదారుల సమాచారాన్ని అందించేందుకు రాజ్‌థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవ్‌నిర్మాణసేన (ఎంఎన్‌ఎస్).. ఔరంగాబాద్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. చొరబాటుదారుల గురించి కచ్చితమైన సమాచారం ఇచ్చినవారికి రూ.5 వేలు నజరానాను పార్టీ ప్రకటించింది. ఆకాశ్‌వాణి ప్రాంతంతోపాటు మరో ఐదు చోట్ల ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఎంఎన్‌ఎస్ ఔరంగాబాద్ చీఫ్ సుమిత్ ఖంబేకర్ తెలిపారు. అక్రమ చొరబాటుదారులెవరైనా మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో దాక్కున్నట్టైతే వారిగురించి నిర్భయంగా ఈ కౌంటర్ల ద్వారా పోలీసులకు సమాచారమివ్వవచ్చని సమిత్ తెలిపారు. ఎంఎన్‌ఎస్ ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలిస్తున్నామని పోలీసు కమిషనర్ చిరంజీవ్ ప్రసాద్ తెలిపారు.

## మన శాస్త్రవేత్తల నైపుణ్యం గొప్పది

**న్యూఢిల్లీ:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ భారతీయ శాస్త్రవేత్తల నైపుణ్యాన్ని ప్రశంసించారు. 'మన శాస్త్రవేత్తల వినూత్న ఆలోచనలు, పరిశోధనల పట్ల వారి మార్గదర్శకాలు దేశానితోపాటు ప్రపంచానికి ఎనలేని కీర్తిని తెస్తాయి' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీంతో భారత్ శాస్త్ర, సాంకేతిక రంగం వృద్ధిలో కొనసాగడమే కాక.. యువతకు సైన్స్ పట్ల ఉత్సుకతను పెంపొందించేందుకు దోహదం చేస్తుందన్నారు. 'మన శాస్త్రవేత్తలను గౌరవించుకునేందుకు జాతీయ సైన్స్ దినోత్సవం ఒక మంచి సందర్భం'అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారత్‌లో పరిశోధన, ఆవిష్కరణల్లో అనుకూల వాతావరణాన్ని కల్పించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు.

### పరిశోధనల్లో మహిళలు 15 శాతమే: కోవింద్

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళలు తక్కువ సంఖ్యలో ఉన్నారని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వ్యాఖ్యానించారు. పరిశోధన, అభివృద్ధి రంగాల్లో మహిళలు 15 శాతానికే పరిమితం అయ్యారని పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలోని పరిశోధన, అభివృద్ధి సంస్థల్లో లింగ సమానత్వం, అభివృద్ధికి సంబంధించి మూడు కార్యక్రమాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించారు.


జాతీయ అవార్డు అందుకుంటున్న ఎయిమ్స్ వైద్యురాలు ఉమా కుమార్

## జడ్జీలను వివాదాల్లోకి లాగకండి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా



**న్యూఢిల్లీ:** 'ఎవరి గురించైనా నాలుగు మంచి మాటలు చెబితే.. కొంతమందికి నచ్చడం లేదు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా వ్యాఖ్యానించారు. 'జడ్జీలను వివాదాల్లోకి లాగకండి' అని చమత్కరించారు. ఇటీవల జరిగిన ఒక అంతర్జాతీయ న్యాయ సదస్సులో ప్రధాని మోదీని జస్టిస్ మిశ్రా ప్రశంసించడంపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ల్యుటెన్స్‌ఢిల్లీ ప్రాంతంలోని ఖాన్ మార్కెట్ ఎదురుగా ఉన్న పాఠశాలను సీజ్ చేయడంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా శుక్రవారం జస్టిస్ మిశ్రా పై వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని సుసంపన్న ప్రాంతాల్లో ఖాన్ మార్కెట్ ప్రాంతం ఒకటి. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీతో జస్టిస్ మిశ్రా.. 'మీరు కూడా ఖాన్ మార్కెట్ దగ్గర్లోనే నివసిస్తున్నారు కదా! ఆ ప్రాంతంలో సంపన్నులు ఉంటారు' అన్నారు. దానికి సింఘ్వీ.. 'నేను 30 ఏళ్ల క్రితమే ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయాను. ఖాన్ మార్కెట్ అనేది ఇప్పుడు తప్పు పదంగా మారింది. అయినా ఆ ప్రాంతంలో మంచి కాఫీ షాప్స్ ఉన్నాయి. జడ్జీలు కూడా ఖాన్ మార్కెట్లో షాపింగ్ చేస్తుంటారు' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీనికి స్పందిస్తూ.. 'జడ్జీలను వివాదాల్లోకి లాగకండి' అని చమత్కరించారు.

## మళ్లీ పట్టాల పైకి గోల్డెన్ చారియెట్

మార్చి 22 నుంచి సేవలు ప్రారంభం



**న్యూఢిల్లీ:** రైల్వేలకు చెందిన కేటరింగ్, ఆన్‌లైన్ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో మరో లగ్జరీ రైలు పట్టా లెక్కబోతోంది. రెండు సంవత్సరాల విరామం తర్వాత గోల్డెన్ చారియట్ రైలు మార్చి 22 నుంచి సేవలు అందిస్తుందని ఐఆర్‌సీటీసీ అధికారులు వెల్లడించారు. కర్ణాటక స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కేఎస్‌టీడీసీ) 2008లో ఈ రైలుని ప్రారంభించింది. నిర్వహణ భారంతో 2018 మార్చిలో దాని సేవల్ని నిలిపివేశారు. తాజాగా ఐఆర్‌సీటీసీ ఈ రైలు నిర్వహణ, మార్కెటింగ్ వ్యవహారాలను తీసుకుంటూ కేఎస్‌టీడీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మార్చి 22 నుంచి ఈ కొత్త రైలుని నడపనుంది. మొత్తం ఆరు రాత్రులు/ఏడు పగళ్లు ప్యాకేజీతో యశ్వంతపూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు బందీపూర్ నేషనల్ పార్క్, మైసూర్, హలెబీడు, చిక్‌మంగళూరు, హంపి, బాదామి, గోవాలకు వెళ్లి తిరిగి బెంగళూరుకు చేరుకుంటుంది.

## సుప్రీంకోర్టులో పవన్ క్యూరేటివ్ పిటిషన్



**న్యూఢిల్లీ:** నిర్భయ అత్యాచారం, హత్యకేసులో నలుగురు దోషుల్లో ఒకరైన పవన్ గుప్తా తనకు విధించిన మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేశారు. నిర్భయదోషుల్లో న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకోని ఏకైక వ్యక్తి పవన్ గుప్తా, అలాగే నిర్భయ కేసులో రాష్ట్రపతి దయాభిక్ష కోసం అర్జీపెట్టుకున్న చివరి వ్యక్తి కూడా పవన్ గుప్తాయే. నిర్భయ ఘటనలో నలుగురు దోషులు ముకేశ్ కుమార్ సింగ్, పవన్ గుప్తా, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్‌లకు మార్చి3న ఉరిశిక్ష అమలు చేయాలని ఫిబ్రవరి 17న ట్రయల్ కోర్టు ఆదేశించింది. వీరిలో ఇప్పటికే ముకేశ్ కుమార్ సింగ్, వినయ్ శర్మ, అక్షయ్ కుమార్‌ల క్షమాభిక్ష పిటిషన్లను రాష్ట్రపతి తిరస్కరించారు. రాష్ట్రపతి దయాభిక్ష పిటిషన్ల తిరస్కరణను సవాల్ చేస్తూ ముకేశ్, వినయ్ లు దాఖలు చేసుకున్న ప్రత్యేక పిటిషన్లను సైతం సుప్రీం కోర్టు కొట్టివేసింది. అయితే క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించడాన్ని ఇంకా అక్షయ్ కోర్టులో సవాలు చేయలేదు.

## కోర్టు ముందుకు 'ఎల్గార్' కేసు నిందితులు


కోర్టుకు హాజరైన వరవరరావు, సుధీర్

**ముంబై:** ఎల్గార్ పరిషద్–మావోయిస్టు లింకు కేసులో అరెస్టయిన ఏడుగురు శుక్రవారం ఎన్ఐఏ స్పెషల్ కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసు విచారణను ఎన్ఐఏ తీసుకున్న కొద్దిరోజులకే నిందితులను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. 2017కు సంబంధించిన ఈ కేసును పుణే పోలీసులు విచారణ జరుపుతుండగా, ఈ ఏడాది జనవరిలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి బదలాయించారు. నిందితుల్లో సురేంద్ర గాడ్లింగ్, మహేశ్ రౌత్, రోనా విల్సన్, సుధీర్ ధవలే, వరవరరావు, అరుణ్ ఫెర్రీరా, సుధా భరద్వాజ్, షోమ సేన్, వెర్నన్ గోన్‌సాల్వేస్ ఉన్నారు. వీరిని బుధవారమే ఎర్రవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. కోర్టు ఆదేశాలతో శుక్రవారం వీరిని కోర్టు జడ్జి డీఈ కొతాలికర్ ముందు ప్రవేశపెట్టారు. కాగా, తదుపరి విచారణను మార్చి 13కు వాయిదా వేసింది.

## మహాత్ముడి స్ఫూర్తి ఇప్పుడే అవసరం

ఐరాస ప్రధాన కార్యదర్శి గ్యుటెరస్



**ఐక్యరాజ్యసమితి:** ఢిల్లీలో చెలరేగిన అల్లర్లపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటొనియో గ్యుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాల్సిన పరిస్థితి ఏర్పడిన ప్రస్తుత తరుణంలోనే.. శాంతి, అహింస బోధించిన మహాత్మా గాంధీ స్ఫూర్తి అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. సమాజంలో అంతా కలిసిమెలసి జీవించేందుకు గతంలో కన్నా ఇప్పుడే మహాత్ముడి స్ఫూర్తి అవసరం ఎంతో ఉందన్నారు. హింసను విడనాడాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. 'భారత్‌లో నెలకొన్న పరిస్థితిని ప్రధాన కార్యదర్శి నిశితంగా పరిశీలిస్తున్నారు. అల్లర్ల సందర్భంగా ఢిల్లీలో చోటు చేసుకున్న మరణాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి, సంయమనం పాటించాలని కోరుతున్నారు' అని గ్యుటెరస్ ప్రతినిధి తెలిపారు.

## 'రఫేల్ జెట్స్' సరిపోవు: ఐఏఎఫ్ చీఫ్



**న్యూఢిల్లీ:** పెరుగుతున్న వైమానిక దళ అవసరాలకు త్వరలో దళంలో చేరనున్న రఫేల్ యుద్ధవిమానాలు సరిపోవని ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ బదౌరియా పేర్కొన్నారు. దేశీయంగా యుద్ధ విమానాలు ఇతర ఆధునిక ఆయుధాల ఉత్పత్తిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన 36 రఫేల్ యుద్ధ విమానాలు త్వరలో వైమానిక దళంలో సేవలందించనున్న విషయం తెలిసిందే. బాలాకోట్ వైమానిక దాడుల తరువాత వైమానిక దళం అందించగల సేవలపై ఉన్న అభిప్రాయంలో కీలక మార్పు వచ్చిందన్నారు. సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్ శుక్రవారం నిర్వహించిన 'ఎయిర్ పవర్ ఇన్ నో వార్ నో పీస్ సినారియో' సదస్సులో బదౌరియా ప్రసంగించారు. '36 రఫేల్ యుద్ధ విమానాలు మన అవసరాలకు సరిపోవు. మనం దేశీయంగా తయారు చేసిన అస్త్ర క్షిపణిని ఎస్‌యూ 30, మిగ్ 29 వంటి ఇతర ఫైటర్ జెట్‌పై ఉపయోగించగలగాలి. అప్పుడే మన వైమానిక శక్తి మరింత పెరుగుతుంది' అన్నారు. అయితే, ఇతర క్షిపణులను ప్రయోగించగల యుద్ధ విమానాలను దేశీయంగా ఉత్పత్తి చేసుకోవాల్సి ఉందన్నారు. బాలాకోట్‌లోని ఉగ్రస్థావరాలపై విరుచుకుపడాలన్న ప్రభుత్వ నిర్ణయం సాహసోపేతమైందన్నారు. మన వైమానిక దళం లక్ష్యాలను కచ్చితంగా ఛేదించిందన్నారు. మన దాడిపై స్పందించేందుకు పాకిస్తాన్ వైమానిక దళానికి 30 గంటల సమయం పట్టిందని బదౌరియా వ్యాఖ్యానించారు.

# కోవిడ్ కోరల్లో 57 దేశాలు

- ద.కొరియా, జపాన్ దేశీయుల వీసా తాత్కాలిక నిలిపివేత: భారత్
- భారత్ సామర్థ్యంపై అమెరికా ఇంటెలిజెన్స్ పరిశీలన


కోవిడ్ నుంచి కాపాడుకునేందుకు ప్రత్యేక దుస్తులు ధరించిన దక్షిణకొరియాలోని డేగు ఆస్పత్రి సిబ్బంది

**బీజింగ్:** కోవిడ్ ధాటికి ప్రపంచ దేశాలు విలవిలలాడుతున్నాయి. ఒకవైపు చైనాలో కొత్త కేసుల సంఖ్య తగ్గుతూ ఉంటే, బాధిత దేశాల సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ న్యూజిలాండ్, లిథువేనియాలకు సోకింది. ఇప్పటివరకు 57 దేశాలకు ఈ వ్యాధి వ్యాపించి వణుకు పుట్టిస్తోంది. చైనా ప్రభుత్వ లెక్కల ప్రకారం శుక్రవారం ఒక్కరోజే 44 మంది మరణించారు. దీంతో ఆ దేశంలో మృతుల సంఖ్య 2,780 దాటింది. ప్రపంచవ్యాప్తంగా 83 వేల మందికి పైగా చికిత్స పొందుతున్నారు. కోవిడ్ బారిన పడిన దేశాల సంఖ్య పెరిగిపోతూ ఉండడంతో భారత్ అప్రమత్తమైంది. దక్షిణ కొరియా, జపాన్ దేశాల నుంచి వచ్చే వారి వీసాలను తాత్కాలికంగా నిలిపివేసింది. దక్షిణ కొరియాలో ఇప్పటివరకు 13 మంది ఈ వ్యాధితో మరణిస్తే, కేసులు 2 వేలు దాటిపోయాయి. జపాన్ షిప్‌లో ఉన్న ప్రయాణికుల్లో కూడా చాలా మందికి కరోనా వైరస్ సోకడంతో ఈ రెండు దేశాల నుంచి వీసాల జారీని తాత్కాలిక రద్దు చేసినట్టుగా భారత్ వెల్లడించింది. ఇటలీ, ఇరాన్‌లో కూడా కేసులు భారీగా పెరిగాయి. ఇరాన్‌లో తమిళనాడుకు చెందిన 450 మంది ,గుజరాత్‌కు చెందిన 350 మంది జాలర్లు చిక్కుకుపోయారు. వారిని స్వదేశానికి తిరిగి తేవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరాయి.

### రంగంలోకి అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు

కోవిడ్–19 విస్తరించిన దేశాల సంఖ్య 50 దాటిపోవడంతో అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ వైరస్‌ను ఎదుర్కొనే సామర్థ్యం ఏయే దేశాలకు ఉంది ? వేటికి లేదు అన్న దిశగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా భారత్‌లో జనాభా ఎక్కువ కావడం, ఆరోగ్య సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడంతో ఈ వైరస్‌ను ఎలా ఎదుర్కొంటారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు భారత్‌లో మూడు కేసులు నిర్ధారణ అయ్యాయి. వారు కోలుకున్నారు కూడా. మరో 23,531 మందిని కరోనా వైరస్ సోకిందన్న అనుమానంతో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

## 'పుల్వామా' నిందితుడి అరెస్ట్



**న్యూఢిల్లీ:** గత సంవత్సరం జరిగిన పుల్వామా దాడికి సంబంధించి ఒక కీలక నిందితుడిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) శుక్రవారం అరెస్ట్ చేసింది. అతడిని పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మొహ్మద్ సభ్యుడిగా గుర్తించారు. పుల్వామాలోని కాకాపొరా ప్రాంతంలోని హాజిబల్‌కు చెందిన షకీర్ బషీర్ మాగ్రే పుల్వామా దాడిలో పాల్గొన్న ఆత్మాహుతి సభ్యుడు ఆదిల్ అహ్మద్ ధార్‌కు వసతి, ఇతర సౌకర్యాలు కల్పించాడు. బషీర్‌కు అక్కడ ఒక ఫర్నిచర్ షాప్ కూడా ఉంది. 2018లో పాకిస్తాన్ ఉగ్రవాది మొహ్మద్ ఉమర్ ఫారూఖ్ ద్వారా ధార్‌కు బషీర్ పరిచయం అయ్యాడు. ఆ తరువాత బషీర్.. జైషే మొహ్మద్ కోసం పూర్తి కాలం పనిచేశాడు. పలు సందర్భాలో ఆయుధాలు, పేలుడు సామగ్రిని ఉగ్రవాదుల కోసం సిద్ధం చేశాడని ఎన్ఐఏ తెలిపింది.

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 29

# న్యాయ ప్రక్రియకు గండి

భావోద్వేగాలు చిక్కబడినప్పుడు విచక్షణ నీరుగారటం సహజం. తమకో, తమవారికో అన్యాయం జరిగిందనుకున్నవారు తక్షణ న్యాయం కావాలని ఆశించడం తప్పు కాదు. కానీ ఆ న్యాయం ఫలానా విధంగానే ఉండాలనడం, అది ఫలానా సమయానికల్లా దక్కాలనడం వల్ల ఆ పనిలో ఉండే వ్యవస్థలు సమస్యలెదుర్కొంటాయి. అన్యాయానికి గురైన సాధారణ వ్యక్తులు భావోద్వేగాలకు లోనై ఎలా స్పందించినా వారిని సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. ఆ స్పందన చట్ట పరిమితులకు లోబడి వున్నంతవరకూ చట్టాలు సైతం మౌనంగా ఉంటాయి. కానీ ఈమధ్యకాలంలో ఉన్నతంగా ఆలోచించాల్సిన, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన సంఘాలు సైతం అదే మాదిరి ధోరణి ప్రదర్శిస్తున్నాయి. కశ్మీర్‌కు స్వేచ్ఛనివ్వాలంటూ ప్లకార్డు ప్రదర్శించిన కేసులో కర్ణాటకలోని మైసూర్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థినిని రాజద్రోహ నేరం కింద అరెస్టు చేయగా అక్కడి బార్ అసోసియేషన్ ఆమె తరపున న్యాయవాదులెవరూ వాదించకూడదని తీర్మానం చేసింది. నళిని దేశద్రోహి కనుక, జాతి వ్యతిరేకి గనుక వాదించొద్దని ఆ తీర్మానం సారాంశం. అదే రాష్ట్రంలోని హుబ్లీలోనూ ఈ మాదిరి పరిణామమే చోటుచేసుకుంది. పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసిన కేసులో ముగ్గురు కశ్మీరీ విద్యార్థులను ఇలాంటి నేరారోపణలపైనే అరెస్టు చేయగా, అక్కడి బార్ అసోసియేషన్ కూడా వారికి న్యాయ సహాయం చేయరాదంటూ తీర్మానించింది. ఇతరులతో పోలిస్తే న్యాయం గురించి, చట్టాల గురించి న్యాయవాదులకు ఎక్కువ అవగాహన ఉంటుంది. అలా ఉండాలని అందరూ కోరుకుంటారు. కానీ ఆ రెండుచోట్లా బార్ అసోసియేషన్లు అందుకు విరుద్ధంగా వ్యవహరించాయి. మైసూర్‌లో నళిని తరఫున వాదించడానికి వేర్వేరు జిల్లాలకు చెందిన 170మంది న్యాయవాదులు వెళ్లారు. హుబ్లీలో నిందితుల తరఫున వాదించడానికెళ్లిన ముగ్గురు న్యాయవాదులను దూషించడం, చంపేస్తామని బెదిరించడం వంటివి కూడా చోటు చేసుకున్నాయి. ఈ తీరు సరికాదని కర్ణాటక హైకోర్టు హితవు చెప్పడంతో హుబ్లీ బార్ అసోసియేషన్ తన తీర్మానాన్ని సవరించుకుని నిందితుల తరఫున వాదించడం న్యాయవాదుల వ్యక్తిగత ఇష్టానికి వదిలేస్తున్నామని తెలిపింది. కానీ ఇది కూడా తప్పేనని హైకోర్టు చెప్పడంతో తీర్మానాన్ని వెనక్కు తీసుకుంది.

'రాజు తలచిందేను ధర్మం...రాజు చెప్పిందేను శాస్త్రం' అన్నట్టు ఎలాంటి చట్టం, న్యాయం లేని మధ్యయుగాల నాటి పరిస్థితులనుంచి మానవ సమూహాలు ప్రజాస్వామ్య సమాజాలకు ఎలా పరివర్తన చెందాయో, ఏ పరిణామాలు అందుకు దోహదపడ్డాయో తెలిసున్నవారు ఇలాంటి అపరిపక్వ ఆలోచనలకు తావీయరు. ప్రజాస్వామ్య దేశాల్లోని రాజ్యాంగాలు, చట్టాలు అక్కడి సమాజాల సమష్టి వివేకానికి దర్పణాలు. అన్యాయానికి లోనైనవారికి న్యాయాన్ని అందించటం, సమాజానికి హానికరంగా పరిణమించినవారిని ఆ సమాజం నుంచి దూరంగా వుంచి, వారిని సంస్కరించటం చట్టాల మౌలిక ఉద్దేశం. రాజ్యాంగం రచించిననాటికి ఉన్న పరిస్థితుల ప్రభావం వల్ల కావొచ్చు, చట్టాలు రూపకల్పన చేసినప్పటి ఆలోచనల పర్యవసానంగా కావొచ్చు...ఆచరణలో సమస్యలెదురవుతుంటాయి. మారిన పరిస్థితులు, ఆలోచనల ఆధారంగా వాటికి సవరణలు చేసుకోవటం ఎక్కడైనా ఉండేదే. ఒక సమాజం న్యాయాన్ని మరింత చురుగ్గా, మరింత మెరుగ్గా అందించదల్చుకుని ఈ సవరణలు చేసిందా లేక తిరోగమన దృక్పథంతో వ్యవహరించిందా అన్నది ఆ సవరణల సారాంశం తేటతెల్లం చేస్తుంది. మన దేశంలో చట్టాలు ఏమేరకు ఆసరాగా నిలుస్తున్నాయో సాధారణ ప్రజానీకానికి నిత్యానుభవం. ఎడాపెడా దుర్వినియోగమవుతున్న చట్టాల జాబితాను రూపొందిస్తే మాత్రం అందులో రాజద్రోహ చట్టం మొట్టమొదట ఉంటుంది. 1962లో కేదార్‌నాథ్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం దీన్ని గుర్తించి కొన్ని మార్గదర్శకాలు విధించింది. రాజద్రోహ చట్టం రాజ్యాంగబద్ధమేనని చెబుతూనే, దాని దుర్వినియోగం మాత్రం అధికంగానే వున్నదని అభిప్రాయపడింది. చిత్రమేమంటే ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా సైతం ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. అంటే ఏళ్లు గడుస్తున్నా మన సమాజం తీరుతెన్నులు పెద్దగా మారలేదన్నమాట. ఇలా దుర్వినియోగమవుతున్న చట్టంలో చిక్కుకున్నవారికి కనీసం న్యాయస్థానాల్లో కూడా ఉపశమనం దక్కనీయకుండా నివారించే ప్రయత్నం చేయడం ధర్మం కాదని మైసూరు, హుబ్లీ బార్ అసోసియేషన్లకు తట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దాని సంగతలావుంచి వృత్తిపరంగా ఎలా వ్యవహరించాలో, ఎలాంటి సంప్రదాయాన్ని పాటించాలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) నిబంధనలు చెబుతున్నాయి. తీవ్రమైన నేరం చేశాడని మొత్తం సమాజం భావించిన వ్యక్తి సైతం తన తరఫున వాదించమని ఆశ్రయించినప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప ఏ న్యాయవాదీ అందుకు నిరాకరించరాదని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్లమెంటు చేసే చట్టాలు మాత్రమే కాదు...వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చే ఆదేశాలు కూడా చట్టాలతో సమానమే. ఏ పౌరుడైనా తెలియక తప్పు చేశానంటే చట్టం ఊరుకోదు. చట్టానికి సంబంధించినంతవరకూ తాను అజ్ఞానినని మొత్తుకున్నా అంగీకరించదు. నిత్యం ఆ చట్టాలకు సంబంధించిన పనిలోనే నిమగ్నమై వుండేవారికి ఇది తెలియదనుకోగలమా? తెలియక చేశారనుకున్నా అది కోర్టు ధిక్కారం కాదా?

దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించేవారిపట్ల కోపావేశాలుండటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ అలాంటివారిని సైతం చట్టబద్ధంగా విచారించి శిక్షించాలని కోరుకోవాలి తప్ప అన్నిటినీ బేఖాతరు చేసి, వారికి అన్ని దారులూ మూసేయాలన్న వితండవాదనకు దిగకూడదు. ఇలా కోరుకోవడం ద్వారా తాము నాగరిక సమాజం మౌలిక పునాదులనే ప్రశ్నార్థకం చేస్తున్నామని, న్యాయపరమైన ప్రక్రియ ముందుకు సాగకుండా అడ్డుకోవడంతోపాటు అసలు ఆ ప్రక్రియనే సందేహాస్పదంగా మారుస్తున్నామని వారు గ్రహించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, తిథి శు.షష్ఠి పూర్తి (24 గంటలు)
నక్షత్రం భరణి రా.3.11 వరకు, తదుపరి కృత్తిక
వర్జ్యం ప.11.31 నుంచి 1.14 వరకు
దుర్ముహూర్తం ఉ.6.23 నుంచి 7.55 వరకు
అమృతఘడియలు... రా.9.56 నుంచి 11.40 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# భావజాలం రగిలించిన ఘర్షణలు

**నాటి ప్రధాని ఇందిర హత్యానంతరం సిక్కులపై పనిగట్టుకుని చేసిన విషప్రచారం కారణంగా 1984లో మూక భయంకరదాడులకు పాల్పడింది. 35 ఏళ్ల తర్వాత సీఏఏ వ్యతిరేక నిరసనకారులపై బీజేపీ నేత కపిల్ మిశ్రా విద్వేష ప్రసంగం మరోసారి మూకదాడులకు దారితీసింది. ఆనాడు ఢిల్లీలో జరిగిన ఘోర దాడులు, నేడు ఈశాన్య ఢిల్లీలో జరిగిన హింసాకాండ సందర్భంగా.. పోలీసులు చేష్టలుడిగి నిమిత్తమాత్రులుగా ఉండిపోయారు. మూక మనసత్వంతో ఘర్షణలకు పాల్పడిన యువతలో చాలామంది రాజ్యం దన్నుతో తీవ్రమైన ముస్లిం వ్యతిరేక భావజాలాన్ని పుణికిపుచ్చుకుంటూ పెరిగారు. ముస్లింలు చావడానికి సిద్ధపడాలని ఛాందసవాదులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. మొత్తంమీద మెజారిటీ వర్గ దురభిప్రాయాలతో కూడిన తప్పుడు పక్షం వైపు నిలబడకూడదన్న స్పృహను మన నేతలు కోల్పోయారు. ఇలాంటి పిరికి మనస్తత్వంతో కూడిన రాజకీయాల దుష్ఫలితాలు రానున్న తరాల్లో కానీ స్పష్టమైన రూపం తీసుకోవు.**

ఢిల్లీ నగరంలో 1984లో సిక్కు వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాల్లో ఒకటి ఏమిటంటే నగరవ్యాప్తంగా పుకార్లను శరవేగంగా వ్యాప్తి చెందించడం. సిక్కులు ఢిల్లీ నగర నీటి సరఫరా చానల్స్‌లో విషం కలిపారని, పంజాబ్‌లో హత్యకు గురైన హిందువుల శవాలను రైళ్లలో కుక్కి ఢిల్లీకి పంపుతున్నారనే స్థాయి పుకార్లను నాటి ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం వ్యాపింపచేశారు. అప్పట్లో వాట్సాప్ ఉండేది కాదని గుర్తుంచుకోవాలి. పుకార్లను ఒకరి నుంచి ఒకరికి వ్యాపింపజేసేవారు. ఇందిర హత్య ఘటన జరి గిన 24 గంటలలోపే ఢిల్లీని ఈ రకమైన పుకార్లు ఆరకంగానే చుట్టుముట్టాయి. ఢిల్లీ పోలీసులు కూడా ఈ పుకార్ల వ్యాప్తికి తమవంతు పాత్ర పోషించారు. పోలీసులే కొన్ని ప్రాంతాలకు వాహనాల్లో వచ్చి లౌడ్ స్పీకర్ల ద్వారా పంజాబ్ నుంచి శవాలతో కూడిన రైళ్లు వస్తున్నాయని, నగరంలో తాగునీటిలో విషం కలుపుతున్నారని గట్టిగా అరుస్తూ ప్రచారం చేశారని అప్పట్లో కొన్ని నిజనిర్ధారణ కమిటీలు నిర్ధారించాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే పోలీసు అధికారులు ఇంటి తలుపులు తట్టి జనాన్ని లేపి తాగు నీటిని తాగవద్దని మరీ సలహా ఇచ్చేంతవరకు వ్యవహారం సాగింది.

పోలీసులకు, వ్యవస్థీకృత మూకలకు మధ్య అసాధారణమైన కుమ్మక్కుకు ఇదొక స్పష్టమైన ఉదాహరణ. ఆనాడు సిక్కులను ఢిల్లీలో ఊచకోత కోస్తున్నప్పుడు పోలీసులు పత్తా లేకుండా పోయారని, లేక ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారని లేక ఆ హత్యాకాండలో తామూ స్వయంగా పాల్గొన్నారని ప్రత్యక్ష సాక్షులు నిర్ధారించారు. 1984 ఘర్షణలు వ్యాపించిన కీలక ప్రాంతాల్లో ఒకటైన త్రిలోక్‌పురిలో పోలీసులే మూకలకు రక్షణగా వచ్చారని, తమ వాహనాల్లోని ఇంధన ట్యాంకులను ఖాళీ చేసి అమాయకులను, ఇళ్లను, దుకాణాలను తగులబెట్టడానికి అవసరమైన డీజిల్‌ను స్వయంగా అందించారని అప్పట్లోనే వార్తలొచ్చాయి. సిక్కు యువతులను దుండగులు సామూహిక అత్యాచారం చేస్తున్నప్పుడు అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులను ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు వెనక్కు రప్పించారని, సుల్తాన్‌పురి ప్రాంతంలో ఒక పోలీసు అధికారి ఇద్దరు సిక్కులను స్వయంగా చంపాడని కూడా అప్పట్లో నివేదికలు వచ్చాయి.

ఆనాడు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడానికి కూడా పోలీసులు తిరస్కరించారు. తమ పొరుగున ఉన్న సిక్కు ప్రజలకు హిందువులు రక్షణగా నిలబడి పోలీసు ఠాణాలకు తోడుకెళ్లి ఫిర్యాదు చేయిస్తే మీ మతస్తులకోసం పోరాడండ్రా అంటూ అక్కడి పోలీసులు సలహాఇచ్చిన ఘటనలు కూడా నమోదయ్యాయి. ఒకవైపు హింసోన్మాదులను స్వేచ్ఛగా వదిలిపెడుతూ మరోవైపు శాంతియాత్రలు చేస్తున్నవారిని ఎక్కడికక్కడ నిలిపివేశారు. పైగా, ఘర్షణలను నిరోధించాలని చూసిన కొందరు పోలీసులకు తమ సీనియర్ అధికారులు ఏమాత్రం సహకరించలేదు. పోలీసులు తమకు తాముగా ఆ ఘర్షణల పట్ల అలా స్పందించారన్న ముసుగులో ఉద్దేశపూర్వకంగా హింసాత్మక ఘటనలపై అధికారులు శీతకన్ను వేశారు. అందరూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలే ఆ హింసాకాండకు మొత్తంగా పథకరచన చేసి అమలు చేశారని బాధితులు, ప్రత్యక్షసాక్షులు, జర్నలిస్టులు, పౌర బృందాలు ఏకకంఠంతో చెప్పారు. ఆనాడు చుట్టుపక్కల గ్రామాలనుంచి, రీసెటిల్‌మెంట్ కాలనీలనుంచి గూండాలను టూవీలర్లలో, టెంపో వ్యాన్లలో, ట్రక్కులలో తీసుకొచ్చి హింసకు ప్రేరేపించారు. చివరకు డీటీసీ బస్సులలో కూడా ఒకచోటినుంచి ఒకచోటికి గూండాలను తరలించి హింసకు పాల్పడ్డారు. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు తమ తమ నివాస ప్రాంతాల్లో సిక్కు కుటుంబాలకు చెందిన ఇళ్లకు గుర్తు పెట్టి మరీ రంగం సిద్ధం చేశారు. తర్వాత పోలీ సులు తీరుబడిగా మూకతో వచ్చి అలా గుర్తు పెట్టి ఉన్న ఇళ్లపైపడి మృత్యుతాండవం చేయించారు. ఆ విషాద సమయంలో సిక్కు వితంతువులకు ఉపశమన చర్యల్లో పాల్గొన్న కొందరు వ్యక్తులు ఆనాడు వారి దిగ్భ్రమను ప్రపంచానికి చాటి చెప్పారు. అన్నాళ్లూ తమ పొరుగునే ఉంటూ పలకరించిన వారే తమను విద్రోహులుగా ముద్రవేసిచూడటం కలిచివేసిందని భర్తల్ని పోగొట్టుకున్న వితంతువులు పేర్కొన్న వైనాన్ని చరిత్రకారిణి ఉమా చక్రవర్తి రాశారు. ఆ దహనకాండ ఎంత ఆకస్మికంగా సంభవించిందంటే ఆ వాస్తవాన్ని జీర్ణం చేసుకోవడానికి బాధితులకు ఏళ్ల సమయం పట్టింది. ఒక్క రాత్రిలోనే వారు ప్రభుత్వం పట్ల, కాంగ్రెస్‌పట్ల విశ్వాసాన్ని కోల్పోయారు.



అందుకే పైకి రెండు ఘటనల మధ్య సాదృశ్యం ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ఇప్పుడు ఈశాన్య ఢిల్లీలో జరిగిన హింసాకాండకు, 1984లో సిక్కువ్యతిరేక హింసాత్మక దాడులకు మధ్య పోలికలు తీసుకురావడం సమస్యను పక్కదారి పట్టిస్తుంది. ఈ రెండు ఘటనల్లో పోలీసులు చేష్టలుడిగి నిమిత్తమాత్రులుగా ఉండిపోయారు, ఈ వారం జరిగిన ఘర్షణల్లో కూడా ఏదోమేరకు ముస్లింల ఇళ్లు, షాపులు, కార్లను గుర్తు పెట్టి మరీ దాడి చేయడానికి పథకం పన్నిన ఘటనలు చోటు చేసుకున్నట్లు మనకు తెలుసు. కానీ ఈ రెండు ఘటనల మధ్య పోలిక ఇంతటితోనే ఆగిపోతుంది. 1984 నాటి హింసాత్మక ఘటనల్లో కాంగ్రెస్ నేతల పాత్రకు సంబంధించి విస్తృతంగా సాక్ష్యాలు లభించినప్పటికీ నేటి ఢిల్లీ ఘర్షణల్లో అంతవేగంగా మంటలు చెలరేగడం తమను సైతం నివ్వెరపర్చిందని బీజేపీ నేతలే చెబుతున్నట్లు నేను మాట్లాడిన రిపోర్టర్లు తెలిపారు. అందుకే ఢిల్లీ బీజేపీ చీఫ్ మనోజ్ తివారీ ఇటీవలి ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమిని తట్టుకోలేక తమ పార్టీనేత కపిల్ మిశ్రా చేసిన విద్వేష ప్రసంగాన్ని తప్పు పట్టాల్సి వచ్చింది. అంతే కాకుండా మిశ్రాను పార్టీ పదవి నుంచి తొలగించాలని కూడా తివారీ చెప్పారు. తివారీ అలా మాట్లాడిన కొన్ని గంటల్లోపే కపిల్ మిశ్రా తన మద్దతుదారులతో ర్యాలీ తీయడమే కాకుండా ఈశాన్య ఢిల్లీలోని జాఫ్రాబాద్‌లో తిష్టవేసిన సీఏఏ వ్యతిరేక నిరసనకారులను ఢిల్లీ పోలీసులు తక్షణం తొలగించనట్లయితే తాను వీధుల్లోకి వస్తానని తీవ్ర హెచ్చరిక చేశాడు. మిశ్రా ప్రసంగం తర్వాత కొన్ని గంటల్లోపే అంటే మరుసటి దినం ఉదయాన్నుంచి పూర్తి స్థాయి ఘర్షణలు చెలరేగాయి.

బీజేపీలో విభేదాలు తివారీ, మిశ్రాలకే పరిమితం కాలేదు. భారత మాజీ క్రికెటర్, ఢిల్లీ ఎంపీ గౌతమ్ గంభీర్ కూడా మిశ్రా చేసిన విద్వేష ప్రసంగం ఆమోదనీయం కాదని, తనపై కఠిన చర్య తీసుకోవాలని చెప్పాడు. కానీ బీజేపీ ఢిల్లీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ జాజు మిశ్రాను వెనకేసుకు రావడమే కాకుండా మిశ్రా ప్రసంగం శాంతికి పిలుపుగా వర్ణించాడు. గంభీర్‌ను సమర్థించాలా లేక మిశ్రాను సమర్థించాలా అనే విషయంపై పార్టీ ట్విట్టర్ విభాగం కూడా చీలిపోవడాన్ని చూస్తే బీజేపీలో విభజన ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇక క్షేత్ర స్థాయిలో సైతం, మూక హింసపై స్థానిక స్థాయిలోని బీజేపీ నేతలు రెండుగా చీలిపోయారని వార్తాహరులు చెబుతున్నారు. కొందరు మూక హింసను సమర్థించగా, మరికొందరు ముస్లిం కుటుంబాలను కాపాడటంలో మునిగిపోయారు. 1984లో స్వయంగా కాంగ్రెస్ నేతలే తమ కార్యకర్తలను హింసాత్మక ఘర్షణలవైపు నడిపించగా, ఇటీవలి ఢిల్లీ ఘర్షణలు కింది స్థాయి నుంచి ప్రేరేపితం కావడం గమనార్హం. మూక మనస్తత్వంతో ఘర్షణలకు పాల్పడిన యువతలో చాలామంది తీవ్రమైన ముస్లిం వ్యతిరేక భావజాలాన్ని పుణికిపుచ్చుకుంటూ పెరిగారు. ఏ పార్టీకి ఓటేసినా వీరంతా హిందుత్వ భావజాలంతోనే ఐక్యమయ్యారు. కపిల్ మిశ్రా కూడా గతంలో ఆప్ పార్టీకి చెందినవాడే కదా.

ఒక రీతిలో 2020 ఘర్షణలు 1984 ఘర్షణలకు కొనసాగింపు అని చెప్పవచ్చు. ఆనాడు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ నేతలు రెచ్చగొట్టిన తీవ్ర హింసాకాండ ఫలితంగా సిక్కు కుటుంబాలు తమ జీవితాలను పునర్నిర్మించుకునే క్రమంలో ప్రభుత్వంపై, రాజకీయ పార్టీలపై, న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారు. మరోవైపున రాజ్యానికి సంబంధించిన పలు విభాగాలు తమవైపు ఉన్నాయని హిందువులు విశ్వసించడం ప్రారంభించారు. ఒక మతానికి వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరించినప్పుడు అది హిందువులను కాపాడటానికేనని వీరు నమ్మసాగారు. గత కొన్నేళ్లుగా ఈ సెంటిమెంట్ మరింత పెరుగుతూ వచ్చింది. అందుకే పోలీసులు తమ వైపు ఉన్నారనే భావనతో హిందూ మూకలు కెమెరా ముందుకు ధైర్యంగా వచ్చి ఘర్షణలకు పాల్పడ్డారు. పైగా కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు వచ్చాయి కాబట్టి ముస్లింలు చావడానికి సిద్ధపడాలని ఛాందసవాదులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. మొత్తంమీద రాజకీయనేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మెజారిటీ వర్గ దురభిప్రాయాలతో కూడిన తప్పుడు పక్షం వైపు నిలబడకూడదన్న స్పృహ కోల్పోయారు. ఇలాంటి పిరికిమనస్తత్వంతో కూడిన రాజకీయాల ఫలితాలు రానున్న తరాల్లో కానీ స్పష్టమైన రూపం తీసుకోవు.

అనింద్యో చక్రవర్తి, సీనియర్ జర్నలిస్టు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### సందర్శన



"ఏదో ఒక ర్యాలీలో పాల్గొనడానికి ఎన్నిసార్లైనా ఒడిశా వెళ్లడానికి సమయం కేటాయించే కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఢిల్లీలో దాడులు జరిగిన ప్రాంతాలను సందర్శించేందుకు మాత్రం సమయం లేదు. అదనపు బలగాలను మోహరించడానికి ఆయనకి కుదరటం లేదు"

– నిఖిల్ వాగ్లే, జర్నలిస్ట్

### మైనారిటీలు



"పాకిస్తాన్‌లో ఓ చర్చి నిర్మాణంలో పనిచేస్తున్న మాసి అతని కుమారుడిని కాల్చి చంపారు. మరొకరిపై గొడ్డలితో దాడి చేశారు. వాళ్లు మతద్రోహులనీ, టాయిలెట్లు కడుక్కుని బతకాల్సినవారని దాడికి పాల్పడినవారు అన్నారు. ప్రతిరోజూ మైనారిటీలను చిత్రహింసలు పెట్టి చంపేస్తున్నారు. కానీ, పట్టించుకునేవారేరీ? అధికార యంత్రాంగమేమో నోరు మెదపదు"

– ఫరా ఖాన్, లాయర్

### తక్షణం



"కరోనా రావడంతో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పడిపోయింది. ఇప్పటికే బలహీనంగా ఉన్న భారతీయ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడప్పుడే కోలుకునేలా లేదు. ఉద్యోగాల పెరుగుదల కూడా కుంటుపడింది. తక్షణ చర్యలు అవసరం. కానీ, వీళ్లేమో హిందూ ముస్లిం, హిందూ ముస్లిం అంటూ కూర్చున్నారు"

– చేతన్ భగత్, రచయిత

### అభినందనలు



"తాప్సీ.. ఈ వారం అంతా నిన్ను పొగుడుతూ ఎన్నో మాటలు వెలువడతాయి. ఇప్పటి వరకు వచ్చిన వాటిల్లో నువ్వు అద్భుతంగా నటించిన తప్పాడ్ చిత్రం చూశాకా నేను కూడా అదే మాట చెబుతా. ఎప్పుడూ గుర్తుండిపోయే ఇటువంటి ఆణిముత్యాన్ని రూపొందించిన అనుభవ్ సిన్హాకు అభినందనలు. తానున్న ప్రతి సన్నివేశంలో నన్ను ఏడిపించిన ఒకే ఒక నటుడు కుముద్ మిశ్రా"

– చేతనా కపూర్, జర్నలిస్ట్

### తెలివి



"తనను తాను తెలివైనవాడిగా చెప్పుకునే ఒక ఫూల్ ముందు ఫూల్‌లా ఉండేవాడే నిజంగా తెలివైనవాడు"

– అమితాబ్ బచ్చన్, హీరో

### సమయం



"బీజేపీ నాయకులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి ఇది తగిన సమయం కాదని ఢిల్లీ హైకోర్టులో సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సెలవిచ్చారు. అంటే, దాడులకు పాల్పడినవారు బీజేపీ ప్రోద్బలంతోనే చేశారని ఆయన కోర్టులో బహిరంగంగా ఒప్పుకున్నట్టే అర్థం. బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తే వారిని మరింత రెచ్చగొట్టినట్టవుతుందనేది ఆయన మాటల్లోని అంతరార్థం"

– సాకేత్ గోఖలే, కార్యకర్త

### చర్చ



"నోర్మూయ్ అంటే నువ్వే నోర్మూయ్, కాదు నువ్వే నోర్మూయ్.. ఇదీ ప్రస్తుతం టీవీల్లో చర్చా కార్యక్రమాల తీరు. మీకు సిగ్గులేదు, కాదు మీకే సిగ్గులేదు.. అంటూ ఆ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి"

– అద్వైత కాలా, కాలమిస్ట్

## ఇన్‌బాక్స్

# కంప్యూటర్ లేని స్కూళ్లు ఇంకెన్నాళ్లు!

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ల శాతం కేవలం 25 శాతం మాత్రమే. అంటే మన పాఠశాలలు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ వాడకంలో (ఐ.సి.టి.) ఎంత వరకు ఉన్నామో తెలుస్తోంది. పనితీరు గ్రేడింగ్ సూచీలో ఇటీవల ప్రకటించిన స్థానాల్లో మన రాష్ట్రం సదుపాయాల విభాగంలో 30వ స్థానం సంపాదించడమే ఇందుకు నిదర్శనం. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీలు, వృత్తి విద్య, త్రాగు నీరు సౌకర్యాలు వంటి అంశాల్లో తగిన వృద్ధి సాధించకపోగా, సౌకర్యాలు తగ్గింపు వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కె.జి.బి.వి లాంటి స్కూళ్లలో మాత్రమే సగటు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఎందుకంటే వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉన్నది. కానీ ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ అవసరం. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్స్ వినియోగం, విద్యార్థులు వాటిపై అవగాహన తీరుని ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తే సరిపోదు, నూతన కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు, ప్రతి విద్యార్థి కంప్యూటర్ ఉపయోగించే విధంగా శిక్షణ అత్యవసరం. నేటి పోటీ ప్రపంచంలో ఉత్తర భారతదేశ రాష్ట్రాలు ఆన్‌లైన్ కోర్సులు, స్వయం, యన్.పి.టెల్., మూక్స్, ఈ–పాఠశాల వంటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసిస్తుంటే ఇంకా కంప్యూటర్ సౌకర్యాలు లేక మన విద్యార్థులు సాంకేతికంగా వెనుకబడి ఉన్నారు. విద్యార్థి దశ నుండే కంప్యూటర్ విద్యని నేర్చుకుంటే ఉన్నత విద్యలో మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ప్రత్యేకంగా కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులని నియమించి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ప్రయోగశాలలు ఉండేలా నిధులు సమకూర్చాలి. నేటి సాంకేతికతని అందుకొని అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ముందుకు సాగుతాయి.

– శ్రవణ్ కుమార్ కందగట్ల,
రీసెర్చ్ స్కాలర్,
కాకతీయ యూనివర్సిటీ

# దత్తుడు గార్లెండ్స్ బాబ్జీ



శ్రీరమణ

'దత్తుడు గార్లెండ్స్ బాబ్జీ, బాబ్జీ గార్లెండ్స్ దత్తుడు'– అంటూ నానుడిలాంటి వాడుక ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారంలో ఉండేది. పెద్ద బస్తీల్లో, చిన్న నగరాల్లో చిన్న చిన్న కూటములుంటాయ్. వారు తమ వృత్తి వ్యాపారాల్లో కొండచిలువల్లా పెరిగినవారై ఉంటారు. వాళ్లకి కీర్తిని కొనుక్కోవడానికి లెక్కలు చూపని చిల్లర ఉంటుంది. వారి వారి శక్త్యానుసారం అప్పుడప్పుడు సవాపావో, సవాశేరో కీర్తిని కొనుక్కుని దండతో ఇంటికి వెళ్తుంటారు. దండోరా వేయించుకుంటారు. ఈ కూటమి వాళ్లకి వినసొంపైన పదవులుంటాయ్. అవి అజాగళస్తనాల్లాంటివి– ఇదేమరి అక్కర్లేని సొల్లు కబుర్లంటే– మొన్న ట్రంప్ టూర్ ప్రసంగాల్లాగా. ట్రంప్ మోదీని, మోదీని ట్రంప్ అడుగడుగునా దండించుకున్నారు. నగర సంకీర్తన వలె పలుచోట్ల పరస్పరం భజించుకున్నారు. ఆ పొగడ్తలకి ఇద్దరి పళ్లు పులిసిపోయి ఉంటాయ్. ట్రంప్ గాంధీ పేరు ఎత్తలేదు, మోదీ తాజ్‌మహల్ గుమ్మం ఎక్కలేదు. చెల్లుకు చెల్లు.

ఏ అమెరికా ప్రెసిడెంటు వచ్చినా ఏవుండదు కడుపు నిండేది– మా మేనత్త పెళ్లిళ్లకి వెళ్లినట్టే! ఆ వైనం చెబుతా. ఆవిడ ఆస్తిపరురాలు. బాధ్యతలు లేవు. పెద్దతనంలో కూడా జుత్తూడక, మాట చెడక నిండుగా ఉండేది. ఒంటినిండా నగలుండేవి. వొంకుల వడ్డాణం, కాసులపేరు, ఓ చేతికి కట్టె వంకీ, ఇంకో చేతికి నాగవత్తు ఇంకా చాలినన్ని బంగారు గాజులు ఉండేవి. ముక్కుకి ఎర్రరాయి నత్తు, తలతిప్పితే అరచెయ్యంత చేమంతిబిళ్ల, అసలు సిసలు కంజీవరం పట్టు చీరెలో ఆవిడ పందిట్లో తిరుగుతుంటే దేవుడి రథం కదుల్తున్నట్టుండేది. పెళ్లికి వస్తే హీనపక్షం మూడు రోజులుండేది. పట్టుచీరెలన్నీ ప్రదర్శించేదాకా ఉండేది. ఆ రోజుల్లో అరడజనుంటే మహాగొప్ప. ఆవిడ దీవెనలు మాత్రం ఉదారంగా ఇచ్చేసి, పెళ్లివాళ్లు పెద్దరికంగా పెట్టేవి స్వీకరించి వెళ్లేది.



అక్షర తూణీరం

అమెరికా ప్రెసిడెంటు తెల్లఏనుగు లాంటి విమానం గురించి, మందీమార్బలం గురించి, జరగాల్సిన మర్యాదల గురించి ఎన్నో కథలు వింటూనే ఉన్నాం. ఒబామా పెంపుడు కుక్కతో సహా వచ్చాడు. అత్తగారు కూడా వచ్చింది. అసలావిడ కోసమే వచ్చారని అనుకున్నారు. తాజ్‌మహల్ చూడాలని మదర్ ఇన్ లా అడిగిందట. అది మన దేశ పౌరులు చేసుకున్న అదృష్టం. అయినా ఎప్పుడూ అదేం దరిద్రమో తెలియదు. ఏ అమెరికా ప్రెసిడెంటు వస్తున్నాడన్నా కోట్లకు కోట్లు ధారపోసి అతి మర్యాదలు చేయడం మనకు అలవాటే. కరువులో అధిక మాసం అంటే ఇదే. అప్పుడెప్పుడో ఇవాంకా వస్తేనే భాగ్యనగరానికి రంగులు వేశాం. దానికి రిటన్ గిఫ్ట్‌గా కేసీఆర్‌ని పిలిచి ట్రంప్ షేక్ హ్యాండ్ ఇచ్చాడు. నవ్వుతూ ఆరుసార్లు చెయ్యి ఊపాడు. జగన్‌కి పిలుపు లేదు. ఇహ దానిమీద ఆయనంటే గిట్టని మీడియా కావల్సినన్ని కథనాలు అల్లింది. నా చిన్నప్పుడు ఐసన్‌హోవర్ రష్యానించి వస్తుంటే నెహ్రూ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఇప్పుడు ట్రంప్ స్వాగతానికి మోదీ కనీసం కొన్ని వందల కోట్లు ఖర్చుచేసి ఉంటారు. శివరాత్రి నుంచి శివతాండవంలా నడిచింది. మోదీకి కూడా పూనకం వస్తుందని అర్థమైంది.

ఆ దేశం గొప్ప దేశమే కావచ్చు. మనదీ గొప్ప దేశమే. అంతమాత్రంచేత దాని పాలకులంతా గొప్పవారు కానక్కర్లేదు. మన దేశాన్ని ఎందరు నికృష్టులు పాలించలేదు. పద్ధతులు పాటించవచ్చుగానీ మరీ అతి అవసరం లేదు. సబర్మతి ఆశ్రమంలో ఎన్నో రకాలు ఎంతో వ్యయంతో, శ్రమతో చేయించిన ఉపాహారాలను ట్రంప్ ముట్టనే లేదు. దారిలో ప్రాకృతిక వాతావరణంలో పచ్చని చెట్టు కింద కావాల్సినన్ని మాంసాహారాలు వండి వడ్డించాల్సింది. ట్రంప్ రాబోతున్న ఎన్నికల దృష్ట్యా వచ్చాడని అందరికీ తెలుసు. మోదీ గాంధీల రాష్ట్రం తనకి బాసటగా ఉంటుందని ట్రంప్ ఆశ. సువీ అంటే రోకలిపోటని తెలియందెవరికి. ఆయన మళ్లీ త్వరలోనే వస్తారు. మళ్లీ పొగడ్తలుంటాయ్ కాకపోతే కొత్తవి. కానీ మహాశయా! ఈసారి తప్పనిసరిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించండి. తెలుగువారు కూడా మీ జాతకం తేల్చగలవారే. ఎందుకైనా మంచిది చంద్రబాబుని కూడా పిలవండి. ఆయనగానీ ఒక్క వీల వేస్తే......

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# నార చీరలు

జ్యోతిర్మయం

'రామ పట్టాభిషేకం రద్దయింది. ఆయన అరణ్యవాసానికి వెళుతున్నాడు' అన్న వార్త అయోధ్యలో వ్యాపించినప్పుడు, ఆవేదన చెందని వాళ్లు ఆ నగరంలో నలుగురే. అలా జరగాలని కోరుకున్న కైకమ్మ, మంథరా; ఏం జరిగినా, ఎలా జరిగినా కుంగని, పొంగని స్థితప్రజ్ఞులు సీతమ్మా, రామయ్యా. కైకేయి తనే స్వయంగా నార చీరలు తెచ్చి, రాఘవుడికి ఇచ్చి 'ఇవి కట్టుకుని ఇక బయల్దేరు'అని తొందర పెట్టడం, అంతఃపురవాసులకేమిటి, అయోధ్య వాసులందరికీ ఆగ్రహం కలిగించింది. ఆ ఘట్టాన్ని వర్ణిస్తున్న వాల్మీకి కవికే ఆవేశం కట్టలు తెంచుకొంది. 'సిగ్గూ లజ్జా లేకుండా కైకేయి తనే నారచీరలు తెచ్చి అందరి సమక్షంలో రాముడిని ధరించమని ఆజ్ఞాపించింది' అంటాడు. అక్కడున్న అందరికీ అంతకంటే ఎక్కువ కోపమూ, దుఃఖమూ కలిగింది. అన్నెంపున్నెం ఎరుగని సీతమ్మకు కూడా నారచీరలు అందిస్తుంటే.. ఏమీ ఎరుగని అయోనిజ, వలను చూసి లేడి బెదిరిపోయినట్టు భీతిల్లింది. సత్య సంపన్నుడైన రాజపురోహితుడు వశిష్టుడు కూడా సంయమనం కోల్పోయాడు. 'కైకేయీ, అతిగా ప్రవర్తిస్తున్నావు. రాజును వంచించి సాధించుకున్న వరాల అవధి కూడా దాటిపోతున్నావు. నారీమణి సీతతో నారచీరలు కట్టించి అరణ్యవాసం చేయించే అధికారం నీకు లేదు' అని కటువుగా హెచ్చరించాడు. కైకేయిపై దశరథుడు మరోసారి మండిపడ్డాడు. 'దౌర్భాగ్యురాలా, నువ్వు నరకానికి పోవడానికి రాముడితో వనవాసం చేయించటం అనే మహాపాపం ఒక్కటి చాలు. కోసలాధీశుల కోడలికి నార చీరలిచ్చి అవమానించి, నీ పాతకాల సంఖ్య పెంచుకోనక్కర్లేదు' అన్నాడు.

కోశాధికారిని పిలిపించి వైదేహి వనవాస కాలం జాగ్రత్తగా లెక్కగట్టి, ఆ సమయానికి సరిపడా అమూల్యమైన వస్త్రాభరణాలను తక్షణం ఆమెకు తెచ్చి ఇమ్మని ఆదేశించాడు. పొలిమేర చేరి అరణ్యవాసం ఆరంభించేందుకు సీతారామలక్ష్మణులు రథమెక్కుతుంటే ఊరంతా భోరుమంది. దశరథుడూ, నగరవాసులు 'ఆగు, ఆగు' అంటూ రథాన్ని పోనివ్వరు. వాళ్ల దుఃఖాన్ని చూడలేక రాముడు మాత్రం 'పద, పద'అని తొందరపెడతాడు. కదలలేక, కదలలేక రథం కదిలింది. రాముడి రథం వేగంగా దూరమవుతూంటే కన్నీళ్లతో చూస్తున్న దశరథుడికి అంత వేదనను మోస్తూ తన గుండె బద్దలవకుండా ఎలా నిలుస్తున్నదో అర్థం కాలేదు.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



ఇమేజ్ మారుతుందా?

సినిమా పేజీలో...

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ

శనివారం ॥ 29-2-2020



అవును... ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా!

సినిమా పేజీలో...

# ప్రొడక్ట్ టు ప్రొటెక్ట్




**ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ వినియోగం నిత్య జీవన క్రియలో భాగమైనది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మొబైల్ వాడకం విజృంభిస్తోంది. స్మార్ట్ ఫోన్ అరచేతిలోకి తీసుకొచ్చేశాక యువతరంలో సోషల్ మీడియా ఎంత పాప్యులరైందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నాణేనికి రెండు వైపులా ఉన్నట్టే... కాలక్షేపంతో పాటు కష్టాల్ని కొనితెచ్చే టిక్‌టాక్ లాంటి యాప్స్ మాత్రమే కాదు మన అవసరాలను తీర్చుకునే క్రమంలో శ్రమని, ఒత్తిడిని తగ్గించడానికి మహిళల కోసం ప్రత్యేకంగా వందలాది యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. అలాంటి కొన్ని ట్రెండీ యాప్స్ విశేషాలు...**

### రొపోసో ఆప్

దేశంలోనే అత్యంత ఆదరణ పొందిన ఫ్యాషన్ సోషల్ నెట్‌వర్క్‌గా నిలిచింది రొపోసో. నెట్టింట్లో అధునాతన ఫ్యాషన్ టెక్నాలజీ, సరికొత్త ట్రెండ్స్‌ని కోరుకునే ఆడవారికి రొపోసో ఆప్ మంచి వేదికగా మారింది. ఇందులో ఎవరైనా సరే తమ ఫ్యాషన్‌కి సంబంధించిన విశేషాలు, వీడియోలు తదితర అంశాలను షేర్ చేసుకోవచ్చు. అంతేకాకుండా ఈ మాధ్యమంలో తమకు నచ్చిన వారిని ఫాలో అవుతూ అభిరుచులను పంచుకోవచ్చు. బాగా నచ్చిన ఉత్పత్తులను, స్టోరీస్‌ని రొపోసో వేదికగా రీ పోస్ట్ చేసుకోవచ్చు. ఇన్ని ఉపయోగాలున్న ఈ యాప్‌ని ప్రస్తుతం సెలబ్రెటీల నుండి సామాన్య ప్రజల వరకు ఫ్యాషన్ ప్రియులందరూ ఫాలో అవుతున్నారు.

### స్పై కెమెరా డిటెక్టింగ్ ఆప్

ప్రస్తుతం సామాజికంగా అమ్మాయిలను అతిగా ఇబ్బందిపెడుతున్న సమస్య స్పైయింగ్. ప్రయాణాల్లో, షాపింగ్స్, హోటల్స్‌లో, టూరిస్ట్ ప్లేసెస్ తదితర జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేసిన రహస్య కెమెరాలతో వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నాం. ఇలాంటి సందర్భాలలో రాడార్‌బోట్ ఫ్రీ, యాంటీ స్పై కెమెరా, స్పై హిడెన్ కెమెరా డిటెక్టర్ లాంటి యాప్స్ వీటిని ఎదుర్కొనేందుకు ఉపకరిస్తున్నాయి. యాప్‌ని స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని మనకు అనుమానాస్పదంగా అనిపించిన ప్రదేశాలలో ఆన్ చేస్తే చాలు.. ఆ యాప్‌లోని మాగ్నెటిక్ సెన్సార్, ఇన్‌ఫ్రా రెడ్ డిటెక్టర్ సాంకేతికతతో రహస్య కెమెరాలను కనిపెడుతుంది. ప్రస్తుతం వ్యక్తిగత భద్రత దృష్ట్యా యువతకు ఈ యాప్ చాలా ఉపయుక్తం అని చెప్పొచ్చు.

### ఎప్పీ లేకున్నా... యాప్ ఉండాలి...

అరచేతిలోని అంతర్జాలాన్ని మనకున్న పరిస్థితికి అనుగుణంగా మార్చుకొని శ్రమ ఒత్తిడిని తగ్గించుకోవడమే కాకుండా వ్యక్తిగత భద్రతనూ పెంచుకోవచ్చు. సిటీలోని ఒక మార్కెటింగ్ కంపెనీలో జాబ్ చేస్తున్నాను. నైట్ షిఫ్ట్ చేసినప్పుడు కానీ, సిటీలో తప్పనిసరి రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. నా మొబైల్‌లో 112 ఇండియన్ యాప్ వాడుతున్నా. విపత్కర పరిస్థితుల్లో క్షణాల్లోనే పోలీస్ సహాయం అందిస్తుంది. ఆడవారికి వాట్సాప్, ఫేస్‌బుక్ అకౌంట్స్ సంగతేమో కాని ఇలాంటి యాప్స్ ఎంతో అవసరం. ఇటీవలే యువతలో ఇలాంటి యాప్స్‌పై అవగాహన పెరుగుతోంది.



**– రమ్యసుధ**, మార్కెటింగ్ ఉద్యోగిని

– సాక్షి, హైదరాబాద్

### పెప్పర్ ట్యాప్ ఆప్

ఉద్యోగం చేసుకొంటూ, ఇంటినీ పిల్లలనీ చూసుకొనే ఆధునిక మహిళలకు క్షణం కూడా తీరిక ఉండడడం లేదు. ఇలాంటి పరిస్థితులలో నిత్యావసర వస్తువులకై సూపర్ మార్కెట్, కిరాణాషాప్‌కి వెళ్ళాలంటే కూడా సమయం దొరకని పరిస్థితి. ఇలాంటి వారి కోసమే ఈ పెప్పర్ ట్యాప్ ఆప్. ఒక్క క్లిక్‌తో ఆర్డర్ చేస్తే చాలు.. కావలసిన సరుకులన్నీ, ఎంచుకున్న మోతాదులో, చెప్పిన సమయానికే ఇంటివద్దకి డెలివరీ చేసేస్తారు. ఎలాంటి షాపింగ్ చేయకుండానే అతి సులభంగా అన్ని వస్తువులు ఇంటికే వస్తుండటంతో పెప్పర్ ట్యాప్‌కి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది.

### గుడ్ గైడ్ ఆప్

ప్రతిరోజూ ఎన్నో రకాల కొత్త కాస్మెటిక్స్ తదితర మహిళా సంబంధ ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తుంటాయి. అయితే అవి ఉపయోగించడం ఆరోగ్యకరమైనదో కాదో తెలుసుకోవడం అంత సులభం కాదు. అలాంటి సందేహం ఉన్నవారు ఈ గుడ్‌గైడ్ యాప్‌తో ఆ వస్తువు నాణ్యతను ఇట్టే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో డియోడరంట్ నుండి డైపర్ క్రీమ్ వరకు అన్నిరకాల ఉత్పత్తులకు రేటింగ్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఇందులో అందించే రేటింగ్ ఆధారంగా కావలసిన వాటిలో బెస్ట్ అనబడే వస్తువులను కొనుగోలు చేయవచ్చు.

### 112 ఇండియా మొబైల్ ఆప్

భారత నిర్భయ చట్టం అనుబంధంగా 112 ఇండియా మొబైల్ ఆప్‌ను తయారు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మహిళల, బాలికల తక్షణ సహాయం కోసం దీనిని రూపొందించారు. ఈ యాప్‌ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత... ఎలాంటి అవాంఛనీయ పరిస్థితుల్లోనైనా కేవలం ఒక్క క్లిక్‌తో కాల్ చేయడం వలన పోలీసులు క్షణాల్లో సంఘటనా స్థలానికి చేరుకొంటారు. ఈ ఆప్‌లోని ERSS టెక్నాలజీతో సంఘటన జరిగిన ప్రదేశాన్ని పోలీసులు క్షణాల్లో గుర్తిస్తారు. అంతేకాకుండా ఈ యాప్‌కి 100 (పోలీస్), 101(ఫైర్), 108(అంబులెన్స్), 181(మహిళా, శిశు సంరక్షణా శాఖ) మొదలైనవి అనుసంధానమై ఉంటాయి.

విశేషం | అర నిముషం

## చైనాలో డౌటే

**ఇం**టికొకరు సైన్యంలో చేరాలని చైనా చక్రవర్తి ప్రకటించాడు. ఒక ఇంట్లో జబ్బున పడి ఉన్న తండ్రి తరపున ఆయన కూతురు మారువేషం వేసుకుని సైన్యంలో చేరింది! శత్రు సైన్యాలతో పోరాడి చైనాసైన్యం సత్తాను చాటింది. ఆమె పేరు హ్వా మ్యులన్. చైనా జానపద కథ ఇది. డిస్నీ వాళ్లు ఇరవై రెండేళ్ల క్రితమే ముల్యన్ పాత్రతో ఓ యానిమేషన్ సినిమా తీశారు. ఇప్పుడు ఆ పాత్ర పేరుతోనే 'మ్యులన్' అనే హాలీవుడ్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. సిద్ధంగా అయితే ఉంది కానీ, చైనాలో విడుదలే డౌట్‌గా ఉంది. ఒకవేళ విడుదలైనా సుమారు 15 వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ సినిమా అంత పెద్ద మొత్తాన్ని వసూలు చేయగలదా అని నిర్మాతలు సంశయంలో పడ్డారు. కరోనా వైరస్ కారణంగా 'మ్యులన్' చిత్రానికి ఎదురైన అవరోధం ఇది. మార్చి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. అయితే కరోనా వ్యాప్తి కారణంగా చైనాలో 70 వేలకు పైగా థియేటర్‌లు ఇప్పటికే మూత పడ్డాయి. వైరస్ తగ్గుముఖం పట్టి పరిస్థితులు పూర్తిగా మెరుగైతే మార్చి 27 లోపు థియేటర్‌లన్నిటినీ తెరిచేందుకు అనుమతిస్తాం అని చైనా అంటోంది. అనుమతించినప్పటికీ ఎంతమంది ప్రేక్షకులు ధైర్యం చేసి థియేటర్‌లకు వస్తారన్న ఆందోళనలో నిర్మాతలు ఉన్నారు. ఆ రోజుకీ కరోనా ప్రభావం తగ్గకుండా ఉంటే ఈ చిత్రానికి చైనాలో భారీ నష్టం సంభవించవచ్చు. ఇందులో ఎవరైనా చేయగలిగిందేమీ లేదు. కరోనాపై పోరాడేందుకు మ్యులన్ లాంటి శక్తిమంతమైన యోధురాలైన ఔషధాన్ని ఎవరైనా సృష్టించాలి.



హ్వా మ్యులన్ పాత్రధారి లీ యూఫీ

## ఇప్పటికీ ఉంది

**అ**మ్మాయి బాగుంది! చూడగానే గుండె క్షణమాగి కొట్టుకుంది. పేరడగాలి. భయం. పేరే అడగలేనప్పుడు ఫోన్ నెంబర్ ఏమడుగుతాం! ఇరవై మూడేళ్ల క్రితం విక్టోరియా అనే అమ్మాయిని చూడగానే డేవిడ్ బెక్‌హామ్‌కి కూడా ఇలాగే భయం వేసింది. అయితే అతడికి పేరు అడిగే అవసరం రాలేదు. విక్టోరియా అప్పటికే విశ్వవిఖ్యాత ఫ్యాషన్ డిజైనర్, సింగర్. బెక్‌హామ్‌కి ఆమెను ఫోన్ నెంబర్ అడగాలని ఉంది. నెంబర్ తీసుకుని రోజూ మాట్లాడాలని ఉంది. అప్పటికే అతడు కూడా పేరున్న ఫుట్‌బాల్ ప్లేయర్. పైగా ఇంగ్లండ్ జట్టుకు అప్పుడే కెప్టెన్ అయ్యాడు. అయినా విక్టోరియా నెంబర్ అడగడానికి ధైర్యం సరిపోలేదు. ఏదో పార్టీలో చూశాడు ఆమెను. ధైర్యం కోసం ఇలాంటి అబ్బాయిలు ఆల్కహాల్ సేవిస్తారు. అయితే బెక్‌హామ్.. ఆ అమ్మాయి ఆల్కహాల్ సేవించే వరకు ఆగాడు. మరికొంచెం తీసుకునే వరకు ఆగాడు. ఇంకొంచెం తాగనిచ్చాడు. అప్పుడు వెళ్లి ఫోన్ నెంబర్ అడిగాడు! విక్టోరియా నవ్వింది. పెన్ కోసం పక్కకు చూసింది. ''నా దగ్గర ఉంది'' అని.. తను కూడా ఎక్కడో పక్కనుంచి తీసుకున్న పెన్‌ని ఆమెకు ఇచ్చాడు. విక్టోరియా దగ్గర కాగితం లేదు. హ్యాండ్‌బ్యాగ్‌లో వెతికి ట్రెయిన్ టిక్కెట్ ఉంటే తీసి, దానిమీద తన ఫోన్ నెంబర్ రాసి బెక్‌హామ్‌కి ఇచ్చింది. ''ఇప్పటికీ ఆ టిక్కెట్ నా దగ్గర ఉంది'' అని గురువారం జిమ్మీఫాలెన్ లేట్ నైట్ షోలో చెప్పాడు బెకహామ్. మంచి భర్తే.



డేవిడ్ బెక్‌హామ్, విక్టోరియా

## పుట్టబోయే బిడ్డతో సెల్ఫీ

స్యూ రాఫోర్ట్ ఈవిడ పేరు. యు.కె.లో ఉంటారు. వయసు 44. పిల్లలు 21 మంది. ఇప్పుడు ఇంకో పాపాయి వీళ్ల ఫ్యామిలీతో జాయిన్ అవడానికి రెడీగా ఉంది. స్యూ ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ''మరొకసారి నేను తల్లిని కాబోతున్నా నన్న భావన నాలో మాతృత్వపు మధురిమల్ని కలిగిస్తోంది. పుట్టబోయే బిడ్డకు పేరేం పెట్టాలో తెలియడం లేదు'' అంటున్నారు స్యూ. తన 13 వయేట తొలిసారి తల్లి అయ్యారావిడ. కడుపులో ఉన్న తన 22వ బిడ్డతో సెల్ఫీ దిగి అప్పుడే సోషల్ మీడియాలో కూడా పెట్టేశారు.



స్యూ రాఫోర్డ్

## సన్నగా ఉన్నప్పుడు

**పా**త ఫొటోల్లో మనకు మనం భలేగా ఉంటాం. ఇలాంటి 'త్రోబ్యాక్'ఫొటోలను ఇటీవల సెలబ్రిటీలు ఎక్కువగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఇలా ఉన్నామనీ, 'ఇరవై ఏళ్ల క్రితం నేను' అనీ.. ఆ సెలబ్రిటీలు పోస్ట్ చేసే ఫొటోల్లో వాళ్లకు వాళ్లే కాదు, మనకూ వాళ్లు ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తారు. లేటెస్ట్‌గా కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ.. కొన్నేళ్ల క్రితం 'కాఫీ విత్ కరణ్' షోలో కరణ్ జోహర్, సాక్షి తన్వర్ లతో కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అప్పుడు చాలా సన్నగా ఉన్నానని, కరణ్ ఇచ్చిన గిఫ్ట్ హ్యాంపర్ వల్లనే ఇప్పుడిలాగయ్యానని సరదా కామెంట్ కూడా ఒకటి పెట్టారు. హ్యాంపర్ ఇచ్చారని చెప్పారు కానీ అందులో ఏమున్నాయో స్మృతి చెప్పలేదు. సాధారణంగా కరణ్ ఇచ్చే హ్యాంపర్‌లో లగ్జరీ ఐటమ్స్ ఉంటాయి. బహుశా అతడు ఫుడ్ ఐటమ్స్ ఏవో స్మృతికి ఇచ్చి ఉండాలి.



'కాఫీ విత్ కరణ్' (షో) పాత ఫొటోలో స్మృతి, కరణ్

## అందాల రాణి

**ఫే**స్‌బుక్‌కి ఇప్పుడు పెద్ద కాంపిటిషన్ టిక్‌టాక్. ఫేస్‌బుక్‌ని టిక్‌టాక్ డ్రాగన్‌లా మింగేసినా ఆశ్చర్యం లేదు. ఇప్పటికే యూత్.. క్లాస్‌బుక్స్‌ని విసిరికొట్టినట్లుగా, ఫేస్‌బుక్‌ని విసిరికొట్టి టిక్‌టాక్‌తో ఆడుతున్నారు. పాడుతున్నారు. టిక్ టాక్ చైనా రాక్షసి. ఫేస్‌బుక్ అమెరికా అందాలరాణి. ఆ అందాల రాణి పేరు షెరిల్ శాండ్‌బర్గ్. ఫేస్ బుక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సి.ఓ.ఓ) ఆమె. ఎంత ఆపరేట్ చేస్తున్నా టిక్‌టాక్ పరుగుని అందుకోలేకపోతోంది ఫేస్‌బుక్. 'మాకు ఆందోళనగా ఉన్నమాట వాస్తవమే. కొత్తగా మేము ఇంకా ఏదైనా చేసి, యూత్‌ని మా వైపు లాక్కోవాలి'' అని షెరిల్ అంటున్నారు. లాక్కోడాని కన్నా ముందు.. ఆమె ఒక అస్త్రాన్ని సంధించారు. ''టిక్‌టాక్ చైనా కంపెనీ కాబట్టి యూజర్‌లకు ప్రైవసీ ఉండదు'' అని అన్నారు. చెప్పలేం ఒక్కోసారి ఇలాంటి చిన్నమాట కూడా పెద్ద ఇన్నొవేషన్‌లా పని చేసి ప్రత్యర్థుల దూకుడును తగ్గించవచ్చు.



షెరిల్ శాండ్‌బర్గ్

### ఆదిశంకరులతో వినాయకుడు ఏం మాట్లాడాడు?




**తి**లకిస్తున్న వారి కన్నులు ధన్యములవుతుండగా ప్రభలు చిమ్ముతున్న వెలుగుల ముద్ద అయిన విఘ్నేశ్వర మూర్తి శంకరుణ్ణి 'జగద్గురూ!' అని సంబోధించింది. ఆ సంబోధన ఆలకించిన సర్వజ్ఞపీఠం యావత్తూ ఒక్కసారిగా జయజయ శంకర ధ్వానం చేసింది. ఆ సందడి కొద్దిగా సద్దుమణిగిన తర్వాత గజాననుడు తిరిగి మాట్లాడాడు... శంకరునితో గజాననుడు ఏం మాట్లాడాడో రేపటి ఫన్‌డేలో చదవండి...

**'ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్ర' సీరియల్ భాగం 'షణ్మత స్థాపనాచార్య'**

### ఇంతకూ ఆ ప్రాక్టికల్ జోకేమిటి?

నెటిల్‌విక్ చేష్టలుడిగి అలా కూర్చుండిపోయాడు. ''ఆల్‌రైట్ ఆల్‌రైట్'' అంటూ తను డైరీలో రాసుకున్న రిమార్కులు కొట్టేసి... ''మహానుభావా నీ ప్రాక్టికల్ జోక్ కాదుగాని... నేను వేసుకున్న డబుల్ ప్రోగ్రామ్ పాడు చేశావు కదా...ఇంకా స్టాక్‌మన్ నేషనల్ బ్యాంకు పని రేపే చేస్తా... దయచేసి మీ మెసెంజర్‌ని సాయం ఇచ్చి గెస్ట్‌హౌస్‌కి దారి చూపిస్తారా... ఈ రాత్రికి ఇక్కడే మకాం'' అని ఓ వెకిలి నవ్వు నవ్వేసి– కరచాలనం చేసి రాయ్ వెనకాల రాగా వెళ్లిపోయాడు. ఇంతకూ నెటిల్‌విక్‌పై ఆ బ్యాంకు మేనేజర్ వేసిన ప్రాక్టికల్ జోక్ ఏమిటి? దానికి కారణం ఏమిటి?...



*రేపటి ఫన్‌డేలోని 'కథాప్రపంచం'లో చదవండి 'స్నేహమేరా జీవితం! స్నేహమేరా శాశ్వతం!*

**ఇంకా...** అరణ్యకాండ ( మార్చి 3 ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ముఖచిత్రకథనం), ఎండ (ఈవారం కథ), కుంభకర్ణుని హితోక్తులు (పురాణం), ఈ పాటలోని నవ్వులు నావే...(గాయని రమోల మాటల్లో పాటతత్వం), మురిసిన స్వప్నం...ముస్సోరీ (యాత్రాయణం), అల వైట్‌హౌజ్‌లో...(లాఫింగ్‌గ్యాస్), పరామర్శ (కొత్తపుస్తకాల పరిచయం), అధరహో (బ్యూటీజర్) , పెట్టెడు యాది (ఇసుకచెట్టు: గల్ఫ్‌కథలు), గన్నీ బ్యాగులో శవం (క్రైం కథ)... మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
29-2-2020

# చిల్‌గుడ్ దుంప

చిలగడ దుంపని 'స్వీట్ పొటాటో' అంటారు.
తెలంగాణలో 'మొరం గడ్డ' అంటారు.
ఆంధ్రాలో 'గెనుసు గడ్డ' అని కొందరంటారు.
పేర్లు వేరైనా పదార్థం ఒక్కటే.
ఎర్రగా, తెల్లగా పండే ఈ దుంప
తీపి పదార్థాలకే కాదు,
కూరలకు కూడా రుచిగా ఉంటుంది.
పల్లెల్లో నిప్పులపై కాల్చి తినే ఈ గడ్డ
పట్టణాలలో పాయసంగా, కట్లెట్‌గా,
వేపుడుగా డైనింగ్ టేబుల్ మీదకు వస్తుంటుంది.
కడిగి పిల్లలకిస్తే పచ్చిగా నమిలి
పంటికి బలం తెచ్చుకుంటారు.
సుగర్ పేషెంట్స్ కూడా తినొచ్చు.
అన్ని విధాలుగా మంచి చేసే
చిల'గుడ్' దుంప ఇది.
చిల్‌గుడ్ దుంప కూడా.





## చిలగడ దుంప కట్‌లెట్

**కావలసినవి:** చిలగడ దుంపలు – పావు కేజీ (ఉడికించి, తొక్క తీసి, మెత్తగా చేయాలి); పచ్చిమిర్చి – 4 (ముక్కలు చేయాలి); కొత్తిమీర – అర కప్పు; పుదీనా – గుప్పెడు ఆకులు; సెనగ పిండి – ఒక కప్పు; ఉప్పు – తగినంత; నూనె – తగినంత.

**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక పచ్చి మిర్చి వేసి వేయించాలి ● ఉడికించిన చిలగడ దుంప ముద్ద వేసి బాగా కలపాలి ● కొత్తిమీర జత చేసి మరోమారు కలపాలి ● సెనగ పిండి, ఉప్పు జత చేసి మరోమారు కలియబెట్టి దింపేయాలి ● చేతికి కొద్దిగా నూనె రాసుకోవాలి ● తయారుచేసి ఉంచుకున్న మిశ్రమాన్ని కొద్దికొద్దిగా చేతిలోకి తీసుకుని వడలా ఒత్తి పక్కన ఉంచాలి ● స్టౌ మీద పాన్ ఉంచి నూనె వేసి వేడయ్యాక, తయారు చేసి ఉంచుకున్న కట్‌లెట్‌లను పాన్ మీద వేసి రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి ● టొమాటో సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.



## చిలగడ దుంప పాయసం

**కావలసినవి:** నెయ్యి – అర కప్పు; బాదం పప్పులు – 10; జీడి పప్పులు – 10; పాలు – ఒక కప్పు; చిలగడ దుంపలు – పావు కేజీ; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; కుంకుమ పువ్వు – చిటికెడు; బెల్లం పొడి – ఒక టేబుల్ స్పూను.

**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక బాదం పప్పులు, జీడి పప్పులు వేసి వేయించి ఒక ప్లేటులోకి తీసుకోవాలి ● అదే బాణలిలో పాలు పోసి మరిగించాలి ● ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు, చిలగడ దుంప ముక్కలు వేసి, ఉడికించి, తొక్క తీసి గుజ్జు చేసి, మరుగుతున్న పాలలో వేసి కలపాలి ● బెల్లం పొడి, ఏలకుల పొడి జత చేసి బాగా కలియబెట్టాలి ● కుంకుమ పువ్వు జత చేసి, ఒకసారి కలిపి దింపేయాలి.

నిర్వహణ:
**వైజయంతి పురాణపండ**

## చిలగడ దుంప పులుసు

**కావలసినవి:** చిలగడ దుంపలు – 4; ఉల్లి పాయలు – 2; చింతపండు – నిమ్మ కాయంత; ఎండు మిర్చి – 4; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; ఇంగువ – తగినంత; నూనె – తగినంత; ఉప్పు – తగినంత; కొత్తిమీర – కొద్దిగా; కరివేపాకు – రెండు రెమ్మలు; బియ్యప్పిండి – ఒక టేబుల్ స్పూను.



**తయారీ:** ● చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి, పెద్ద పెద్ద ముక్కలు గుండ్రంగా తరగాలి ● ఉల్లి పాయలను పెద్ద పెద్ద ముక్కలుగా తరగాలి ● ఒక పాత్రలో చిలగడ దుంప ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి, తగినంత ఉప్పు వేసి స్టౌ మీద ఉంచాలి ● చింతపండుకు తగినన్ని నీళ్లు జత చేసి రసం తీయాలి ● దుంప ముక్కలు ఉడుకుతుండగా, చింతపండు రసం అందులో వేసి కలియబెట్టాలి ● ఒక గిన్నెలో ఒక కప్పుడు నీళ్లలో బియ్యప్పిండి వేసి బాగా కలిపి, ఉడుకుతున్న పులుసులో వేయాలి ● స్టౌ మీద చిన్న బాణలిలో నూనె కాగాక ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించి మరుగుతున్న పులుసులో వేయాలి ● కొత్తిమీర వేసి దింపేయాలి ● అన్నంలోకి రుచిగా ఉంటుంది.

## చిలగడ దుంప కూర

**కావలసినవి:** చిలగడ దుంప ముక్కలు – 2 కప్పులు; ఉల్లి తరుగు – ఒక కప్పు; టొమాటో గుజ్జు – ఒక కప్పు; పచ్చి మిర్చి – 1 (నిలువుగా మధ్యకు తరగాలి); అల్లం ముద్ద – ఒక టీ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; ధనియాల పొడి – ఒక టీ స్పూను; గరం మసాలా – ఒక టీ స్పూను; మిరప కారం – అర టీ స్పూను; పసుపు – కొద్దిగా; ఉప్పు – తగినంత; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – పావు టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; ఇంగువ – చిటికెడు.



**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, జీలకర్ర, ఆవాలు వేసి చిటపటలాడించాలి ● ఇంగువ, అల్లం ముద్ద, కరివేపాకు వేసి మరోమారు వేయించాలి ● ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి ● టొమాటో తరుగు, ఉప్పు, పసుపు వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి ● మంట బాగా తగ్గించి, మూత పెట్టి రెండు నిమిషాల పాటు ఉడికించాలి ● మిరప కారం, గరం మసాలా, ధనియాల పొడి, మిరప కారం జత చేసి మరో రెండు నిమిషాలు ఉడికించాలి ● చిలగడ దుంప ముక్కలు, తగినన్ని నీళ్లు జత చేసి బాగా కలిపి, మూత ఉంచాలి ● సన్న మంట మీద సుమారు పావు గంట సేపు ఉంచి దింపేయాలి ● అన్నంలోకి రుచిగా ఉంటుంది.

## చిలగడ దుంప డెజర్ట్

**కావలసినవి:** చిలగడ దుంపలు – అర కేజీ; ఏలకుల పొడి – అర టీ స్పూను; బెల్లం పొడి – పావు కేజీ; నెయ్యి – ఒక టేబుల్ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను.

**తయారీ:** ● చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి, గుండ్రంగా పెద్ద పెద్ద ముక్కలు చేయాలి ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక తరిగి ఉంచుకున్న చిలగడ దుంప ముక్కలు వేసి కలియబెట్టాలి ● బెల్లం పొడి, ఏలకుల పొడి జత చేసి బాగా కలిపి, రెండు కప్పుల నీళ్లు పోసి మరోమారు కలిపి, మూత ఉంచాలి ● సన్నటి మంట మీద పావుగంట సేపు ఉడికించాలి ● మూత తీసి ముక్కలు మెత్తబడ్డాయో లేదో చూసి దింపేయాలి ● వీటిని డెజర్ట్‌లా తింటే రుచిగా ఉంటాయి.



## ఫుడ్ ప్రింట్స్

**ముంబై కాల్బాదేవిలోని నరోత్తమ్ వాడీలో ఫ్రెండ్స్ యూనియన్ జోషీ క్లబ్‌లోకి ప్రవేశించటం అంత సులువు కాదు. కొత్తగా వెళ్లేవారు గూగుల్ మ్యాప్స్ ఆన్ చేసుకుంటేనే ఆ ప్రాంతానికి చేరుకోగలుగుతారు. కొత్తవారు ఆ ప్రాంతాన్ని గుర్తించటం చాలా కష్టం. ఇక్కడకు వస్తే ఏవో కొత్తకొత్త వంటకాలు, మసాలా వంటలు దొరుకుతాయనుకుంటే పొరపాటే. అందమైన అలంకరణలతో మనసును హత్తుకునేలా ఉంటాయనుకుంటే బోర్లా పడినట్లే. ఇంటి వాతావరణంలో దాల్, కూరలు, రోటీ, భక్రీలతో కూడిన ఇంటి భోజనంలాంటి గుజరాతీ థాలీ మాత్రమే ఉంటుంది.**

## ఫ్రెండ్స్ యూనియన్ జోషీ క్లబ్







ఈ ఫ్రెండ్స్ యూనియన్ జోషీ క్లబ్ వందేళ్ల క్రితం భోజనాలయ్‌గా ప్రారంభమైంది. గుజరాత్ నుంచి ముంబై వచ్చిన వారికి, అమ్మ వంట మీద బెంగను పోగొట్టడానికి స్వాతంత్ర్య సమర యోధుడు గోవింద్ జోషీ స్థాపించినట్లుగా చెబుతారు. ఈ భోజనాలయ్ దేశభక్తుల కూడలి ప్రదేశంగా ఉండేది. అప్పట్లో దీనిని 'జోషి మిత్ర మండలి' అనేవారు. బహుశ దానికే 'ఫ్రెండ్స్ యూనియన్ జోషీ క్లబ్' అనువాదం అయి ఉండొచ్చని స్థానికులు చెబుతారు.

ఇక్కడి వంటకాలలో మసాలాలు, ఎక్కువ నూనెలు వాడరు. గుజరాతీలకు తీపి అంటే ఇష్టం. వంటలలో మధుర పదార్థాలను ఎక్కువగానే ఉపయోగిస్తారు. వంటకాలను వారి హృదయాలలాగే తియ్యగా తయారు చేస్తారని వారికి పేరు. తీపి, పులుపు, కారం అన్నీ సమానంగా ఉండేలా చూస్తారు. అంటే భేల్‌పురీ రుచిలాగ ఉంటుందన్నమాట.

ఫ్రెండ్స్ యూనియన్ జోషీ క్లబ్ రుచులు మరే ఇతర పెద్ద పెద్ద హోటల్స్‌లోనూ దొరకవు. ప్రతిరోజూ ఇక్కడి మెనూలో కొద్దికొద్ది మార్పులు ఉంటాయి. గుజరాతీ పద్ధతిలో కొద్దిగా తియ్యగా ఉండే పప్పు మాత్రం ప్రతిరోజు తప్పనిసరి. మిగతా వంటల్లోనే మార్పులు ఉంటాయి. బెండ కాయ నుంచి క్యాలీఫ్లవర్ వరకు అన్నిరకాల కూరలు వండుతారు. పాలక్ పనీర్, కాకర కాయ కూడా వండి వడ్డిస్తారు. వేడి వేడిగా రోటీలు, తవ్వ రోటీలు అందిస్తారు. వాటి మీద కరిగించిన నెయ్యి వేసి అందించటం వీరి ప్రత్యేకత.

టొమాటో, కీరదోసకాయలతో సలాడ్ తయారు చేసి, కడుపును చల్లబరుస్తారు. చిన్న బిస్కెట్ల లాంటి భక్రీలు గుజరాతీయుల ప్రత్యేక వంటకం. అప్పుడప్పుడు బూరెలు, బొబ్బట్లతో కూడా అతిథిని ఆదరిస్తారు. ప్రత్యేకమైన చట్నీలతో కచోరీ, ఢోక్లాలను అదనంగా అందిస్తారు. ఏడాది పొడవునా గులాబ్ జామూన్, రసగుల్లా, బాసుంది తప్పనిసరిగా అందిస్తారు. ఈ మొత్తం వంటకాలను పెద్ద పళ్లెంలో అమరుస్తారు.

**పంక్తి భోజనాలు**

పెళ్లిళ్లకు వడ్డించే పంక్తి భోజనాల మాదిరిగా బల్లలను అమరుస్తారు. అందువల్ల ఇక్కడ కాలక్షేపానికి, కబుర్లు చెప్పుకోవటానికి అనువుగా ఉండదు. పూర్తిగా వివాహ విందు బంతిలా ఉంటుంది. ముంబైలో ఇంత చక్కటి గుజరాతీ భోజనం మరెక్కడా దొరకదు.పెద్ద పెద్ద స్టార్ హోటల్స్‌లో కూడా ఇటువంటి ఆహారం దొరకదు. సామాన్యమైన వంటకాన్ని రుచికరంగా, ఇంటి భోజనంలా రుచి చూడాలంటే ఇక్కడకు రావలసిందే.

## చిటికెలో వంటకం

### సేమ్యా దోసె

**కావలసినవి:** సేమ్యా – ఒక కప్పు; బొంబాయి రవ్వ – ఒక టేబుల్ స్పూను; బియ్యప్పిండి – ఒక టేబుల్ స్పూను; పచ్చి మిర్చి తరుగు – ఒక టీ స్పూను; కొత్తిమీర తరుగు – ఒక టీ స్పూను; ఉల్లి తరుగు – అర కప్పు; క్యారట్ తురుము – పావు కప్పు; ఉప్పు – తగినంత; నూనె – తగినంత; పెరుగు – రెండు కప్పులు



**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో సేమ్యా వేసి దోరగా వేయించాలి ● ఒక గిన్నెలో పెరుగు, సేమ్యా, బొంబాయి రవ్వ, బియ్యప్పిండి, ఉప్పు వేసి సుమారు గంటసేపు నానబెట్టాలి ● పచ్చి మిర్చి తరుగు, కొత్తిమీర, ఉల్లి తరుగు, క్యారట్ తురుము జత చేసి బాగా కలపాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక ఈ పిండిని దోసెలుగా వేసి, రెండు వైపులా నూనె వేసి కాల్చుకోవాలి ● టొమాటో సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.

## ఆయుర్వేదం

# చిలగడ దుంప చెలిమికి ఇంపు

దీని వృక్ష శాస్త్ర నామం 'ఇపోమియా బటాటాస్'. ఈ దుంప భూమిలో పెరుగుతుంది. భూమి పైన విశాలమైన ఆకుపచ్చని ఆకులతో లతలాగ పెరుగుతుంది. ఈ ఆకులలోని సొలానిన్ రసాయనం విష ప్రభావం కలిగి ఉంటుంది. జంతువులకు మనుషులకు కూడా హానికరం. మోతాదు మించితే, గుండె, కాలేయం, మూత్ర పిండాలు, బ్రెయిన్‌లకు విషతుల్యమే. దుంపలు మాత్రం ఆరోగ్యానికి చాలా మంచిది. తెలుపు, లేత ఎరుపు, లేత పసుపు వంటి వివిధ రంగులలో పై పొరలు కలిగి చిన్నపాటి తేడాలతో రకరకాల దుంపలు మనకు లభిస్తాయి. ఎరుపు తొక్క గల దుంపలలో కొద్దిగా పోషకాలు అధికం. బంగాళా దుంపలు (ఆలుగడ్డ), కంద గడ్డల కంటె చిలగడ దుంపలు భిన్నమైన దుంపజాతి.



**పచ్చి మిర్చి, టొమాటో వలె ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలో చిలగడ దుంప ప్రస్తావన లేదు. దీని పుట్టుక మూలాలు మధ్య దక్షిణ అమెరికా సీమలో ఐదు వేల సంవత్సరాల క్రితం ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.శ.15వ శతాబ్దపు ఉత్తరార్ధంలో (1492) క్రిస్టఫర్ కొలంబస్ ఈ చిలగడ దుంపని ఐరోపా ఖండం లోని స్పెయిన్ దేశానికి పరిచయం చేశాడు. అనంతరం 16వ శతాబ్దంలో చైనా ద్వారా ఆసియా ఖండానికి పరిచితమైంది. 1597లో బ్రిటన్‌కి పరిచయమైంది.**

**ఆధునిక శాస్త్రం రీత్యా పోషక పదార్థాలు:** ● *100 గ్రా. ల పచ్చి చిలగడ దుంపలలో: పోషకాలు గ్రాములలో:* ● క్యాలరీలు 86, నీరు 77%, ప్రొటీన్లు 1. 6 గ్రా. (స్టార్చ్ అధికం), కొవ్వులు 0. 1 గ్రా. (ఇంచుమించు శూన్యం) శర్కర 4. 2 గ్రా. (గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్, మాల్టోజ్); కార్బోహైడ్రేట్స్ (స్టార్చ్ రూపంలో పిండి పదార్థాలు) 20.1 గ్రా. పీచు (ఫైబర్) 3 గ్రా. సోడియం 55 మిల్లీ గ్రాములు, పొటాషియం 337 మి. గ్రా.

**నిత్య ఆహారపు శక్తి (రెండు వేల క్యాలరీలు)లో విటమినుల శాతం:**
● ఎ 283%, బి 6 – 12%, బి 12 – శూన్యం, సి – 4 %, డి – శూన్యం, ఐరన్ 3%, మెగ్నీషియం 6%, మ్యాంగనీసు 1%, కాపర్ 0. 3 %, జింక్ 0. 6 %

**ఆరోగ్య ప్రయోజనాలు:** ● కంటి చూపు, చర్మ కాంతి మెరుగు పడతాయి. (బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉండటం వలన) ● మెదడు చురుకుగా పనిచేసి తెలివితేటలు పెరుగుతాయి (బి6 విటమిను వలన) ● గుండెకు బలం సమకూరి అధిక రక్తపోటు (హైబీపీ) తగ్గటానికి దోహదపడుతుంది (పొటాషియం, మెగ్నీషియం లవణాల వలన) ● పిల్లలలో శారీరక మానసిక వికాసం గణనీయంగా వృద్ధి చెందుతుంది (మ్యాంగనీసు వలన). ధాతు పరిణామం మెరుగుపడుతుంది ● పీచు ప్రభావం వల్ల చెడు కొలెస్టరాల్ తగ్గుతుంది ● శరీరం బరువు కూడా తగ్గటానికి ఉపకరిస్తుంది ● వ్యాధినిరోధక శక్తి అద్భుతంగా పెరుగుతుంది (యాంటీ ఆక్సిడెంట్స్ బాగా మేలు చేస్తాయి)

**డయాబెటిస్ (మధుమేహం): (టైప్ 2)** *(వయసు పైబడినప్పుడు వచ్చే శర్కర వ్యాధి):* ఈ వ్యాధిగ్రస్తులకు ఇది చాలా చక్కటి ఆహారం. ఉడికించి తింటే దీనికి గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. పచ్చివి తింటే కొంచెం ఎక్కువైనా పీచు పదార్థం వలన క్రమేపీ రక్తంలోని శర్కర శాతం నియంత్రణలోకి వస్తుంది. నీరసం ఉన్న వారికి (మధుమేహం ఉన్నా, లేకున్నా) మంచి శక్తి లభించి ఉత్సాహం వస్తుంది.

**జాగ్రత్త:** ● దీనిలో ఆక్సలేట్లు అధికంగా ఉంటాయి కనుక మూత్ర పిండంలో రాళ్లు ఉన్న రోగులు దీనిని తినటం మంచిది కాదు ● మొత్తం మీద చిలగడ దుంపతో చెలిమి ఆరోగ్యానికి ఇంపు, మనిషి మనుగడకు పెంపు.



**– డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి** ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

# మోస్ట్ హ్యాండ్‌సమ్ యాక్టర్

యంగ్ బాలీవుడ్ -16 / సిద్ధార్థ్ మల్హోత్రా












రాబోయే చిత్రం 'షేర్ షా'లో

**రూపవంతుడు అనే మాట అందరికీ వర్తించదు.**
**చెక్కిన శిల్పంలా ఉంటాడు అని అందరినీ అనలేము.**
**సిద్ధార్థ్ మల్హోత్రా ఇండస్ట్రీలో అడుగు పెట్టగానే**
**'ఫేస్ ఆఫ్ ది ఇయర్' అనిపించుకున్నాడు.**
**ఈ ఫేసే అతణ్ణి కాపాడింది.**
**గాడ్‌ఫాదర్‌లు లేకపోయినా**
**స్ట్రగుల్ చేద్దామంటే సపోర్ట్ లేకపోయినా**
**పట్టుదలతో పోరాడి**
**మిడిల్ క్లాస్ నుంచి**
**టాప్ క్లాస్‌కు చేరిన హీరో కథ ఇది.**



సిద్ధార్థ్ మల్హోత్రా

సిద్ధార్థ్ మల్హోత్రాకు తాను అందగాణ్ణని తెలియదు. పుట్టింది పెరుగుతున్నది ఢిల్లీలో. వాళ్ల నాన్న మర్చంట్ నేవీలో పని చేసేవాడు కనుక నేవీ అంటే సముద్రంతో పని కనుక సముద్రాన్ని చూసినా, నదిని చూసినా తండ్రిని తలుచుకుని ఎగ్జయిట్ అయ్యేవాడు. చదువు పెద్దగా రాలేదు. రగ్బీ ఆడేవాడు. పెద్దయ్యాక ఏమవుతావ్ అంటే 'రివర్ రాఫ్టర్ ట్రయినర్‌ని అవుతా అని అనేవాడు. రివర్ రాఫ్టర్ అంటే ఒడిదుడుకుల ప్రయాణం. కాని విధి అతణ్ణి అంతకంటే వొడిదుడుకులు ఉన్న ప్రవాహంలో పడేసింది. ఆ ప్రవాహం పేరు సినిమా ఇండస్ట్రీ.

**రెస్టరెంట్‌లో ఆఫర్**

సిద్ధార్థ్ కామర్స్‌లో డిగ్రీ చేస్తుండగా ఒకరోజు రెస్టరెంట్‌లో కూచుని టీ తాగుతుంటే 'ఈ కుర్రాడు అందగాడు' అని గ్రహించిన ఒక యాడ్ ఏజెన్సీ అతని దగ్గరకు వచ్చి 'నువ్వు బాగున్నావ్.. మోడలింగ్ చెయ్' అని చెప్పాడు. అప్పుడు సిద్ధార్థ్ వయసు సరిగ్గా 18 సంవత్సరాలు. ఆ వయసులో రంగుల ప్రపంచంలో అడుగు పెట్టడం ఏ కుర్రాడికైనా ఎగ్జయిట్ చేసే సంగతే కదా. సరే అన్నాడు. ముంబైతో పోల్చితే ఢిల్లీలో మోడలింగ్ ప్రపంచం చిన్నది. ఆ చిన్న ప్రపంచంలో సిద్ధార్థ్ స్టార్ అయ్యాడు. మంచి మంచి బట్టలు వేసుకుని ర్యాంప్ మీద నడవడం, అందుకు డబ్బులు కూడా రావడం కిక్ ఇచ్చింది. నాలుగేళ్లు గడిచిపోయాయి. డిగ్రీ పూర్తయ్యింది. మామూలుగా అయితే ఎం.బి.ఏ చేయాలనేది ప్లాన్. ఇప్పుడు మోడలింగ్ వల్ల మనసు చదువు మీద నిలవడం లేదు. అలాగని మోడలింగ్ కూడా నచ్చట్లేదు. ఒకరోజు తన ఏజెన్సీకి వెళ్లి 'ఇక మోడలింగ్ చేయను' అన్నాడు. 'ఏం' అన్నారు వాళ్లు. 'ఏముంది ఇందులో చేయడానికి. ఇచ్చిన డ్రస్ వేసుకొని కెమెరామాన్ ఇమ్మన్న ఫోజు ఇవ్వాలి. బోరు కొడుతోంది' అని వచ్చేశాడు. మనసు పెద్ద తెర మీద ఉంది. ఈ ముఖం పెద్దతెరకు సూట్ అవుతుంది అనుకున్నాడు.

**ఆఫీస్‌లో నిద్ర**

షారూక్ ఖాన్‌తో 'రా–వన్' లాంటి భారీ సినిమా తీసిన అనుభవ్ సిన్హా ఆ సినిమా తీయడానికి ముందు చిన్న సినిమా తీయడానికి ఢిల్లీ వచ్చి ఆడిషన్స్ నిర్వహించాడు. ఊళ్లో అందంగా ఉన్న కుర్రవాడు సిద్ధార్థ్ కనుక పెద్ద శ్రమ లేకుండానే సెలెక్ట్ అయ్యాడు. 'నా సినిమాలో నువ్వే హీరో' అనేసరికి ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చి బ్యాగ్‌లో బట్టలతో పాటు కొన్ని కలలను కూడా కుక్కుకుని ముంబైకి చేరుకున్నాడు. అనుభవ్ సిన్హా ఆఫీసులోనే బస. ఆఫీస్ ఉన్నప్పుడు బయట తిరిగి ఆఫీస్ మూసేసే సమయానికి చేరుకుని అక్కడే పడుకోవడం. సినిమా ఎప్పుడు మొదలవుతుందో తెలియదు. చివరకు 'రా–వన్' అవకాశం రావడంతో సినిమాయే ఆగిపోయింది. ఆ తలదాచుకునే చోటు కూడా లేదు. ముంబైలో ఒక్కరోజు గడపడమే ఖర్చుతో కూడిన పని. మిడిల్ క్లాస్ మనుషులు ఎంతని పంపుతారు... ? ఫ్రెండ్స్ ఇళ్లలో హాల్ మీద చాప వేసుకొని పడుకోవడం, బెడ్‌రూమ్ అంత ఇల్లు మాత్రమే ఉన్న చోట అక్కడే సిగ్గు లేకుండా అడ్జస్ట్ అవడం ఇలా కొనసాగింది. ఢిల్లీలో ఆడిషన్ ఇచ్చిన అనుభవంతో ముంబైలో ఆడిషన్స్ ఇవ్వడానికి వెళితే లెక్క చేసేవారు కాదు. 'నేను పెద్ద మోడల్‌ని' అంటే 'నీలాంటి వాళ్లు వెయ్యి మంది వస్తుంటారు' అని తేలిక చేసేవారు. అవమానాలు.. అవమానాలు.. అవమానాలు...

**ఆటో రిక్షా చూపిన దారి**

ఒకరోజు ఫ్రెండ్‌తో కలిసి ఆటోలో వస్తూ ఉంటే ఆ ఫ్రెండ్ సినిమా వాళ్ల కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు. 'నీకెలా తెలుసు?' అని అడిగితే 'నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. నువ్వూ చెయ్. సినిమా పని తెలుస్తుంది' అని చెప్పాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎలా దూరాలో సిద్ధార్థ్‌కు తెలియదు. ఒక మోడల్‌గా ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రాతో పరిచయం ఉంది కాబట్టి వెళ్లి ఆయనను అడిగితే 'ధర్మా ప్రొడక్షన్స్ వాళ్లకు చెబుతాను. వెళ్లి పని చెయ్' అన్నాడు. ధర్మా ప్రొడక్షన్స్ వాళ్లు ఆ సమయంలో జాన్ అబ్రహామ్, అభిషేక్ బచ్చన్‌లతో 'దోస్తానా' తీస్తున్నారు. ఆ సినిమాలో మొదట పని చేశాడు సిద్ధార్థ్. ఆ తర్వాత ఆ సంస్థ అధిపతి, దర్శకుడు అయిన కరణ్ జొహర్ కింద షారూక్ ఖాన్ హీరోగా 'మై నేమ్ ఈజ్ ఖాన్' సినిమాకు పని చేశాడు. అదే సినిమాకు ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద హీరోగా ఉన్న వరుణ్ ధావన్ కూడా అసిస్టెంట్ డైరెక్టర్. ఇద్దరూ ఫ్రెండ్స్ అయ్యారు. ఇద్దరూ సెట్‌లో ఖాళీగా ఉన్నప్పుడల్లా కరణ్ జొహర్‌తో తమకు యాక్టింగ్ చేయాలని చెబుతూ వచ్చేవారు. కరణ్ జొహర్ స్టార్ కిడ్స్‌కు లిఫ్ట్ ఇవ్వడంలో ముందుంటాడు... చాన్స్ ఇస్తే (దర్శకుడు డేవిడ్ ధావన్ కుమారుడైన) వరుణ్ ధావన్‌కు ఇవ్వొచ్చు... ఏ తాడూ బొంగరం లేని నాకెందుకు ఇస్తాడు అని సిద్ధార్థ్ అనుకునేవాడు. కాని వరుణ్ దగ్గర లేనిది తన దగ్గర ఉన్నది ఒకటి ఉంది. అందమైన ముఖం.

**స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్**

2012లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమా తీయాలనుకున్నాడు కరణ్ జొహర్. హీరోయిన్‌గా మహేశ్ భట్ కూతురు ఆలియా భట్‌ను తీసుకున్నాడు. ఒక హీరోగా స్టార్ కిడ్ వరుణ్‌ను తీసుకున్నాడు. ఇంకో వేషానికి మాత్రం సిద్ధార్థ్‌ను ఎంచుకున్నాడు. 'సార్... నాలో ఏం చూసి' అని తబ్బిబ్బయితే 'నీ ముఖం చూసి' అన్నాడు. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సూపర్ హిట్ అయ్యింది. రాత్రికి రాత్రి అందులో నటించిన ముగ్గురూ స్టార్స్ అయ్యారు. ఆలియా భట్‌కు నెక్స్ట్ సినిమా 'హైవే' వరుణ్ ధావన్‌కు 'మై తేరా హీరో' హిట్. కాని సిద్ధార్థ్ రెండో సినిమా 'హసీ తో ఫసీ' పెద్దగా ఆడలేదు. ఆ తర్వాత వచ్చిన 'ఏక్ విలన్' వంద కోట్ల క్లబ్‌ను దాటింది. అక్షయ్ కుమార్‌తో నటించిన 'బ్రదర్స్' యావరేజ్‌గా నిలిచింది. 'కపూర్ అండ్ సన్స్' హిట్. సిద్ధార్థ్ ప్రయాణం ఒక హిట్ ఒక ఫ్లాప్‌గా నడుస్తూ ఉంది. కాని ఎప్పటికప్పుడు కొత్త సినిమా వస్తూనే ఉంది. ప్రస్తుతం అతను కరణ్ జొహర్ నిర్మాణ సంస్థ ప్రతిష్టాత్మకంగా పరమ వీర చక్ర పురస్కార గ్రహీత విక్రమ్ భాత్ర జీవితం ఆధారంగా మిలట్రీ నేపథ్యంలో తీస్తున్న బయోపిక్ 'షేర్ షా'లో నటిస్తున్నాడు. దర్శకుడు విష్ణువర్ధన్ (పంజా ఫేమ్).

**ప్రవర్తన ముఖ్యం**

సిద్ధార్థ్ గొప్ప నటుడు కాకపోవచ్చు. కాని తన రూపానికి వచ్చిన నటనను కలిపి సినిమాను మోసుకుపోవడంలో అతనికి తిరుగు లేదు. క్రమశిక్షణ పాటించడం, ఫోజులు కొట్టకపోవడం, దుమారాల్లో చిక్కుకోకుండా ఉండటం ప్రస్తుతం అతనికి కవచాలుగా ఉన్నాయి. సల్మాన్ ఖాన్‌వంటి నటుడు సిద్ధార్థ్‌ను మెచ్చుకొని తమ్ముడిలా చూసుకుంటూ ఉన్నాడు. ఏమి ఉందో ఎంత ఉందో తెలుసుకుని కెరీర్‌ను మలుచుకోవడం తెలిసిన నటుడు సిద్ధార్థ్. అతడి తెర జీవితం అతని ముఖమంత అందంగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

**– సాక్షి ఫ్యామిలీ**


సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
29-2-2020


పరిపరిశోధన

# కొత్త సెల్ఫీ స్టిక్.. స్పాట్‌లైట్‌తో!

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు... ఈ కాలంలో సెల్ఫీలు జోరు జోరు. మరి వీటికి జతగా ఓ సెల్ఫీస్టిక్ కూడా ఉంటే.. అదికూడా ఓ స్పాట్ లైట్‌తో వస్తే? అబ్బో ఎన్ని అద్భుతాలు సృష్టించవచ్చో అని స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు మురిసిపోతూంటారు. ఈ మురిపెం అంతా తీర్చేందుకు పిక్టార్ స్మార్ట్ లైట్ సెల్ఫీ స్టిక్ రెడీ అయిపోతోంది. వీడియో బ్లాగులు తీసేవారికి ఇది చాలా బాగా ఉపయోగపడుతుందని అంచనా. ఈ స్మార్ట్ సెల్ఫీ స్టిక్‌ను ఉపయోగిస్తే ఫొటోలు, వీడియోలు డీఎస్ఎల్ఆర్ కెమెరాతో తీసినంత అద్భుతంగా వస్తాయని కంపెనీ చెబుతోంది. సుమారు 30 అంగుళాల పొడవుండే ఈ సెల్ఫీ స్టిక్ చివరన ఒక ఎల్ఈడీ స్పాట్‌లైట్ ఉంటుంది. అవసరమైనప్పుడు తగిలించుకోవడం లేదంటే తీసేయడం కూడా చేయవచ్చు. కాంతి పడే కోణాన్ని మార్చుకోనూ వచ్చు. సెల్ఫీస్టిక్ హ్యాండిల్‌లో ఉన్న కంట్రోల్ ప్యానెల్ సాయంతో 30, 60, 120 లూమెన్స్ తీవ్రత ఉన్న వెలుతురును ఉత్పత్తి చేయవచ్చు. అంతేకాకుండా ఈ కంట్రోల్ ప్యానెల్ ద్వారా ఫొటోల నుంచి వీడియోలకు, రికార్డింగ్ మొదలు/ఆపడం వంటి పనులు కూడా చేయవచ్చు. జూమిన్..జూమ్ అవుట్, చిత్రాన్ని ప్రకాశవంతం చేయడం లేదా కొంచెం మసకబార్చడం కూడా సాధ్యమే. ఈ కంట్రోల్ ప్యానెల్ నుంచి అన్ని ఆదేశాలు బ్లూటూత్ ద్వారా కాకుండా వైర్‌లెస్ పద్ధతిలో వెళతాయి. ప్రస్తుతం ఈ సరికొత్త స్మార్ట్ సెల్‌ఫోన్ స్టిక్‌ను వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేసేందుకు కిక్‌స్టార్టర్ ద్వారా నిధులు సేకరిస్తున్నారు.



# గుండెను కనిపెట్టుకుని ఉండే పరికరం...

గుండెజబ్బులుగానీ.. గుండెపోటుగానీ ఆకస్మికంగా జరిగిపోతూంటాయన్నది మనకు తెలిసిన విషయమే. ఇలా కాకుండా.. ఎప్పటికప్పుడు గుండె పనితీరును గమనిస్తూ.. ముంచుకొచ్చే సమస్యను ముందుగానే చెప్పేందుకు ఓ పరికరం ఉంటే? కచ్చితంగా అలాంటిదాన్నే తయారు చేశారు. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న వైటల్ కనెక్ట్ అనే కంపెనీ శాస్త్రవేత్తలు. ఈ పరికరాన్ని ఇటీవలే యూటా యూనివర్శిటీ, సాల్ట్ లేక్ సిటీ హెల్త్ కేర్ సిస్టమ్‌లలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. రోగి ఛాతీకి ఈ పరికరాన్ని (చిత్రం చూడండి) అతికించుకుంటే చాలు.. అది గుండె కొట్టుకునే వేగంతోపాటు ఆ క్రమంలో ఏవైనా తేడాలున్నాయా? ఉచ్ఛ్వాస, నిశ్వాసల తీరెలా ఉంది? రోగి వ్యాయామం చేస్తున్నారా? నిద్రపోతున్నారా? శరీరం ఏ వైపునకు తిరిగి ఉంది... వంటి అనేక అంశాలను పరిశీలిస్తుంది. ఈ సమాచారం అంతటినీ బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు అక్కడి నుంచి క్లౌడ్ ఆధారిత సర్వర్‌కు వెళుతుంది. ఇక్కడ మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీ సాయంతో సమాచారాన్ని విశ్లేషిస్తారు. గతంలో రికార్డుచేసిన సమాచారంతో పోల్చి చూస్తారు. ఈ పరిశీలనల ఆధారంగా రోగి పరిస్థితి మరింత అధ్వాన్నమైందా? మెరుగుపడిందా? అన్నది ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అవసరమైనప్పుడు ఆసుపత్రిలో చేరాల్సిందిగా సమాచారం పంపిస్తారు. పరీక్షల్లో ఈ పరికరం 80 శాతం కచ్చితత్వంతో పనిచేసినట్లు స్పష్టమైంది.



నేటి విజేత

# బూట్ పాలిష్ కుర్రాడు ఇండియన్ ఐడల్ అయ్యాడు



భటిండాలో సన్నీకి ఘన స్వాగతం

**పంజాబ్‌లోని భటిండాకు చెందిన 21 ఏళ్ల కుర్రవాడు సన్నీ హిందూస్తాని 'ఇండియన్ ఐడల్ 11' టైటిల్‌ని రెండు రోజుల క్రితం గెలుచుకుని సొంత ఊరుకి తిరిగి వస్తే ఊరు ఊరంతా అతనికి స్వాగతం చెప్పింది. ఒక బూట్‌పాలిష్ కుర్రవాడు ఇంత ఘనత సాధించినందుకు జేజేలు పలికింది.**

సన్నీ హిందూస్తానీ ఎక్కడా సంగీతం నేర్చుకోలేదు. సిడీల్లో విని ప్రఖ్యాత సంగీతకారుడు నుస్రత్ ఫతే అలీ ఖాన్ పాటలు నేర్చుకున్నాడు. నుస్రత్ ఫతే అలీఖాన్‌ని తన గురువుగా భావించాడు. ఆయనకు భక్తుడిగా మారాడు. సన్నీ హిందూస్తానీ పాడుతుంటే నుస్రత్ పోలికలు కనపడతాయి. ఫ్రెండ్స్ తమకు తోచినప్పుడల్లా అతని చేత పాడించుకునేవారు. కాని సన్నీకి జీవితంలో ఏదైనా సాధించాలని ఉండేది. కాని ఎలా సాధిస్తాడు? 12 ఏళ్ల వయసులో తండ్రి చనిపోయాడు. ఇంట్లో తల్లి, చెల్లెలు ఉంటారు. వారి పోషణకోసం చదువు మానేసి బూట్ పాలిష్ చేస్తున్నాడు సన్నీ.

కాని కాలం ప్రతి ఒక్కరి కోసం కిరీటం మోసుకుని తిరుగుతూ ఉంటుంది. ఆ కిరీటం దగ్గరకు తలను చేర్చాలంతే!

సోనీ టీవీలో 'ఇండియన్ ఐడల్11' ఆడిషన్స్ జరుగుతున్నాయని ఒక ఫ్రెండ్ ద్వారా సన్నీకి తెలిసింది. ముంబై వెళ్లాలంటే డబ్బులు కావాలి. వెళ్లి తల్లిని అడిగితే ఆమె కంగారుగా చివాట్లు పెట్టింది. 'మనకు అవసరమా... అదేమైనా వచ్చేదా చచ్చేదా' అన్నది. 'ఇంట్లో రూపాయి లేదు' అని కూడా అంది. దాంతో సన్నీ మూడు వేల రూపాయలు అప్పు చేసి ముంబై చేరుకున్నాడు.




సన్నీ హిందూస్తానీ

కాని ఈ దేశం చాలా పెద్దది. ప్రతిభ ఉన్న వాళ్లు ఎప్పుడూ క్యూలో ఉండేలా చేయగలిగేది. ఇండియన్ ఐడల్‌లో సన్నీ నంబర్ '1072'. అంటే వెయ్యి మందిలో మనవాడు ఒకడు. పిచ్చి టీషర్టు, స్లిప్పర్లు వేసుకొని లోపలికి వెళ్లిన సన్నీ జడ్జిలుగా ఉన్న అనూ మలిక్, నేహ కక్కర్, విశాల్ దద్లానిలను మెప్పించాడు. అతడు పాడిన పాట 'ఆఫ్రీన్.. ఆఫ్రిన్'.

పోటీ కొనసాగింది. రాను రాను సన్నీకి అభిమానులు పెరిగారు. భటిండా ఊరు మొత్తం ప్రతి వారం అతనికి ఓటు వేయడం మొదలుపెట్టింది. ఫైనల్స్‌లో మొత్తం ఐదు మంది గాయకులు మిగిలితే సన్నీ హిందూస్తానీ విన్నర్‌గా నిలిచాడు. బహుమతిగా 25 లక్షల రూపాయలు, ఒక కారు దక్కాయి. 'నా పేరు విజేతగా ప్రకటించిన క్షణాన మా అమ్మ ముఖంలో కనిపించిన చిరునవ్వు నాకెంతో సంతోషాన్నిచ్చింది' అంటాడు సన్నీ. అతడు తనకొచ్చిన డబ్బులో కొంత తల్లికోసం, కొంత చెల్లెలి కోసం ఉపయోగించనున్నాడు. నిజానికి సన్నీ ఈ కాంటెస్ట్‌లో ఉండగానే సినిమా వాళ్ల దృష్టి పడింది. 'గల్లీబాయ్' సినిమాలో పాడే చాన్స్ వచ్చింది. ఇప్పుడు టి–సిరీస్‌తో కాంట్రాక్ట్ కుదిరింది.

కలలు కంటే అవి తీరేదాకా పరిశ్రమించాలి అని సన్నీ గెలుపు తెలియచేస్తోంది.

ఫ్యామిలీ డాక్టర్

# గుండెజబ్బుల నివారణకు సూచనలు ఇవ్వండి

**నా వయసు 42 ఏళ్లు. ఇటీవలే నాకు తెలిసిన ఒకరిద్దరు వెంటవెంటనే గుండెజబ్బులతో చనిపోయారు. మేము రోజు కలిసేవాళ్లం. పైగా చనిపోయే ముందు రోజు వరకూ వాళ్లెంతో ఆరోగ్యంగా కనిపించడం, అంతలోనే మామధ్య లేకుండాపోవడం మమ్మల్ని ఎంతో బాధించిందీ, అలాగే ఆందోళనగానూ ఉంది. గుండెజబ్బులు రాకుండా నివారించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించండి.**

**– కె. విశ్వనాథశర్మ, నందిగామ**

మీ కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బు ఉన్నా లేదా దగ్గరి బంధువుల్లో గుండెజబ్బులు కనిపించినా అలాంటి కుటుంబ చరిత్ర గలవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. వారు పాటించాల్సిన సూచనలివి...

- ముందుగా డాక్టర్ పరీక్షలు చేయించి, రక్తంలో కొలెస్ట్రాల్ పాళ్లను తెలుసుకోవాలి. ఒకవేళ ఇంకా నలభై దాటని వారు ఆ కుటుంబంలో ఉన్నప్పటికీ... వారు కూడా ఇప్పట్నుంచే తరచూ కొలెస్ట్రాల్ పరీక్షలు చేయిస్తూ, ఆహార నియమాలు పాటిస్తూ ఉండాలి. డాక్టర్ సలహాల మేరకు కొన్ని మందులు తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకుంటూ ఉండాలి.
- గుండెపోటు రావడానికి డయాబెటిస్ ఒక ప్రధాన కారణం. అందుకే ఆ సమస్య ఉన్నవారు రక్తంలోని చక్కెరను పూర్తిగా నియంత్రణలో ఉంచుకోవడం తప్పనిసరిగా అవసరం. రోజూ క్రమం తప్పకుండా మందులు వాడుతూ, డాక్టర్ సూచన మేరకు వారు సూచించిన వ్యవధిలో క్రమం తప్పకుండా రక్తంలోని చక్కెరలను పరీక్షించుకుంటూ ఉండాలి.
- కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని బాగా తగ్గించాలి.
- పొగ తాగే అలవాటును పూర్తిగా వదిలేయాలి. అలాగే పొగాకుకు సంబంధించిన ఉత్పాదనలు, వస్తువులను పూర్తిగా మానేయాలి. అంటే గుట్కా, ఖైనీ, పాన్‌మసాలాలు వంటి అన్ని అలవాట్లనూ వదిలేయాలి. గుండెజబ్బుల నివారణలో ఇది చాలా ప్రధానం.
- డాక్టర్ సూచనల మేరకు శరీరానికి మరీ ఎక్కువ శ్రమ కలిగించకుండా చేసే వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయాలి.
- మన ఒంటి బరువును పెరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.
- రక్తపోటును అదుపులో పెట్టుకోవాలి.
- మనం తీసుకునే ఆహారంలో అన్ని పోషకాలు ఒంటికి అందేలా సమతులాహారం తీసుకోవాలి.
- ఆరోగ్యకరమైన జీవనశైలిని తప్పనిసరిగా పాటించాలి.

ఈ కొన్ని జాగ్రత్తలతోనే చాలావరకు గుండెజబ్బులను నియంత్రించవచ్చు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు తమ డాక్టర్లు సూచించిన మందులను తప్పక వాడుతుండాలి. ఆరోగ్యంలో ఏమాత్రం తేడా ఉన్నట్లు అనిపించినా డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి. ఈ కొద్దిపాటి సూచనలు పాటిస్తే గుండెపోటు వంటి ఎన్నో ప్రమాదకరమైన పరిస్థితులను నివారించడం చాలావరకు నివారించవచ్చు.

# నాకు తరచూ గుండెదడ... సలహా ఇవ్వండి

**నా వయసు 45 ఏళ్లు. ఈమధ్య నాకు గుండె దడగా ఉంటోంది. దీనివల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందా? గుండెదడు రావడానికి కారణాలు తెలపండి. నా విషయంలో నేనేం చేయాలో దయచేసి సూచించండి.**

**– ఎమ్. శ్రీధర్, వినుకొండ**

సాధారణ పరిస్థితుల్లో అయితే గుండె తాలూకు స్పందనలను మనం గ్రహించలేము. ఒకవేళ మన గుండె స్పందనలు మనకే తెలిసేలా గుండె కొట్టుకుంటుంటే గుండెదడ వస్తున్నట్లు తెలుసుకోవచ్చు. అయితే గుండె దడ అనేది ఒక వ్యాధి కాదు. ఒక లక్షణం. భయాందోళనలకు గురైనప్పుడు, లేదా ఏవైనా ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడినప్పుడు గుండె అదనపు వేగంతోనూ, శక్తితోనూ పనిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రయత్నంలో ఎవరి గుండె స్పందన వాళ్లకు తెలుస్తుంది. ఇలాంటి స్థితి తాత్కాలికంగా కనిపించినా, కొద్దిసేపట్లో దానంతట అదే తగ్గిపోతుంది.

అయితే ఇదే పరిస్థితి నిరంతరం కనిపిస్తుంటే మాత్రం, అప్పుడా అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ఒక్కోసారి సాధారణమైన జలుబులు, చిన్న చిన్న ఇన్ఫెక్షన్లు, టీ, కాఫీ, మద్యం తాగడం వంటి అంశాలు కూడా గుండెదడను కలిగించగలవనే విషయం తెలియక చాలామంది విపరీతమైన ఆందోళనకు, అలజడికి గురవుతారు. మీకు ఇలా ఏదైనా జరుగుతోందా అని పరిశీలించుకోవడం మంచిది.

**సాధారణ కారణాలు:** గుండె కవాటాలు వ్యాధిగ్రస్తం కావడం, గుండె కండరాలు బలహీనపడితే గుండెదడగా ఉంటుంది. ఛాతీలో వచ్చే నొప్పినీ, ఆయాసాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. శ్వాస అందని సమయాల్లోనూ, కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించినప్పుడు, కళ్లుబైర్లుగమ్మినట్లు అనిపించినప్పుడు ఎప్పుడూ అశ్రద్ధ చేయకూడదు.

**సూచనలు :**

- గుండెగడగా ఉన్నప్పుడు మరీ వేడిగా ఉండే పదార్థాలను తినకూడదు. కషాయం, చేదు, కారం రుచులను తగ్గించుకోవాలి. ఎక్కువగా తినడం, తిన్నది జీర్ణం కాకముందే తినడం మంచిది కాదు.
- మలమూత్ర విసర్జనలను ఆపుకోకూడదు.
- కాఫీ, టీ, కూల్‌డ్రింక్స్ లాంటి ఉత్ప్రేరక పదార్థాలు వాడటం తగ్గించాలి. టీ కంటే కాఫీ మరింత ప్రమాదకరం.
- పొగతాగే అలవాటు మానేయండి. పక్కనుండే స్నేహితులు పొగ తాగుతున్నా వారించండి.
- ఎప్పుడూ మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి ప్రయత్నించాలి. బిగ్గరగా మాట్లాడకూడదు, అలా మాట్లాడినప్పుడు కూడా గుండెదడ పెరుగుతుంది.
- నూనెలు, కొవ్వు పదార్థాలు వాడకాన్ని తగ్గించాలి.
- మరీ దడ ఎక్కువగా ఉన్నపుడు ఐస్‌ను నలగ్గొట్టి ఒక బ్యాగ్‌లో వేసి, ఛాతీపై పెట్టుకుంటే గుండెదడ తగ్గుతుంది.

పై జాగ్రత్తలు పాటించాక లేదా ఎలాంటి ఆందోళనలు లేనప్పుడుకూడా గండెదడ తరచూ కనిపిస్తుంటే తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి. ఎందుకంటే ఒక్కోసారి గుండెకు సంబంధించిన వ్యాధులలో కూడా గుండెదడ కనిపిస్తుంది. అలాంటప్పుడు మీ సమస్య ఏమిటో తెలుసుకోడానికి, వైద్యశాస్త్రపరంగా విశ్లేషించడానికి సాధారణ రక్తపరీక్ష మొదలు ఈసీజీ వరకు కొన్ని పరీక్షలు అవసరమవుతాయి.

కార్డియాలజీ కౌన్సెలింగ్స్




**డాక్టర్ హేమంత్ కౌకుంట్ల**
కార్డియోథొరాసిక్ సర్జన్ అండ్‌డైరెక్టర్ ఆఫ్ కార్డియాక్ సర్జరీ, సెంచరీ హాస్పిటల్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్, హైదరాబాద్



epaper.sakshi.com

# ఆఫీసర్ భక్తవత్సలం నాయుడు


మోహన్‌బాబు

మోహన్ బాబు అసలు పేరు భక్తవత్సలం నాయుడు. సినిమాల్లోకి ప్రవేశించాక మోహన్ బాబుగా స్క్రీన్‌నేమ్ పెట్టుకున్నారు. తాజాగా ఆయన భక్తవత్సలం నాయుడు పేరుతో స్క్రీన్‌పై కనిపించడానికి రెడీ అయ్యారు. సూర్య హీరోగా మోహన్‌బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తమిళ చిత్రం 'సూరరై పోట్రు'. తెలుగులో 'ఆకాశమే నీ హద్దురా' టైటిల్‌తో విడుదల కానుంది. సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సూర్య నిర్మిస్తున్నారు. అపర్ణా బాలమురళి కథానాయిక. ఈ సినిమాలో సీనియర్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ యం. భక్తవత్సలం నాయుడు పాత్రలో కనిపించనున్నారు మోహన్‌బాబు. ఆయన లుక్‌ని శుక్రవారం విడుదల చేశారు. సూర్యకు మార్గ నిర్దేశకునిగా ఆయన పాత్ర ఉండబోతోందట. మరో విశేషం ఏంటంటే.. తమిళ వెర్షన్‌కు మోహన్‌బాబే స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నారు. ఏప్రిల్ 9న ఈ సినిమా విడుదల కానుంది.

# విజయ్‌వర్మ ఆన్ డ్యూటీ


నాగార్జున

ఏసీపీ విజయ్ వర్మ ఆన్ డ్యూటీ. హైదరాబాద్‌లో ఓ సీరియస్ మిషన్ మీద ఉన్నారాయన. ఏసీపీ విజయ్ వర్మగా నాగార్జున నటిస్తున్న చిత్రం 'వైల్డ్ డాగ్'. నూతన దర్శకుడు అహిషోర్ సోల్మాన్ తెరకెక్కిస్తున్న ఈ థ్రిల్లర్ చిత్రంలో సయ్యామీ ఖేర్, దియా మిర్జా హీరోయిన్లు. నిరంజన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. 'వైల్డ్ డాగ్' సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గతంలో లుంబినీ పార్క్, గోకుల్ చాట్ పరిసర ప్రాంతాల్లో బాంబ్ పేలుళ్లు జరిగిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమా కోసం ఆ బాంబ్ పేలుళ్ల ఘటనలను తెరకెక్కిస్తున్నారట. రెండు రోజులుగా లుంబినీ పార్క్, గోకుల్ చాట్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: షానీ డియోల్, సహ నిర్మాతలు: ఎన్.ఎం. పాషా, జగన్‌మోహన్ వంచా.

# చిరు వర్సస్ సోనూ?

‘అతడు, అరుంధతి, దూకుడు, జులాయి, సీత’ వంటి సినిమాల్లో విలన్ పాత్రల్లో తన విలక్షణ నటనతో పాపులర్ అయ్యారు బాలీవుడ్ యాక్టర్ సోనూ సూద్. తాజాగా చిరంజీవి 152వ సినిమాలో కీలకపాత్ర చేస్తున్నారాయన. కొరటాల శివ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. రామ్‌చరణ్, నిరంజన్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయిక. ‘‘చిరంజీవిగారి సినిమాలో భాగమవ్వడం, ఆయనతో కలసి నటించడం గర్వంగా ఉంది. సౌత్ ఇండస్ట్రీ నన్ను ఎప్పుడూ ప్రేమతో ఆదరించింది. మంచి మంచి సినిమాలు చేసి వాళ్ల ప్రేమను తిరిగివ్వాలనుకుంటున్నాను’’ అన్నారు సోనూ సూద్. ఈ సినిమాలో విలన్ పాత్రలో చిరంజీవితో సోనూ తలపడనున్నారా? తెలియాల్సి ఉంది. ప్రస్తుతం హిందీలో ‘పృథ్వీరాజ్’, తమిళంలో ‘తమిళరసన్’ సినిమాలు చేస్తున్నారు సోనూ సూద్.


సోనూ సూద్

# హీరో రిటర్న్స్



టైగర్ ష్రాఫ్

బాలీవుడ్ యంగ్ హీరో టైగర్ ష్రాఫ్‌కి మంచి యాక్షన్ హీరో ఇమేజ్ ఉంది. స్క్రీన్‌పై అతను విలన్స్‌పై విరుచుకుపడిన ప్రతిసారీ బాక్సాఫీస్ బద్దలయింది. తాజాగా మరో యాక్షన్ సినిమాను ప్రకటించారు టైగర్. 2014లో ‘హీరో పంతి’ చిత్రంతో బాలీవుడ్‌కి పరిచయమయ్యారు టైగర్. ఇప్పుడు ఈ సినిమా సీక్వెల్ ‘హీరో పంతి 2’ చేస్తున్నట్టు తెలిపారు. ‘ప్రపంచం అతని చావుని కోరుకుంటోంది’ అనేది ట్యాగ్‌లైన్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మాణంలో అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జూలై 16న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్టు ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.



# అవును.. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా!

‘‘మన కోసం మనం చేసుకునే సహాయం ఏదైనా ఉందంటే మన శరీరం, మెదడులో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను గమనించడం.. వాటిని తెలుసుకోవడం... అర్థం చేసుకోవడం’’ అంటున్నారు శ్రుతీహాసన్. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఓ ఫొటోను షేర్ చేశారు. ఆ ఫొటోకి ‘శ్రుతీ చిక్కిపోయిందేంటి? ఆరోగ్య సమస్యలా? దారుణంగా ఉంది’ అంటూ నెటిజన్ల నుంచి కొన్ని నెగటివ్ కామెంట్స్ వచ్చాయి. తనపై వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్‌కు స్పందిస్తూ రాసిన ఓ లేఖను పంచుకున్నారు శ్రుతి. దాని సారాంశం ఈ విధంగా.. ‘‘సాధారణంగా ఇతరుల అభిప్రాయాలను నేను పెద్దగా పట్టించుకోను. కానీ అదేపనిగా తను లావుగా ఉంది, సన్నగా ఉంది అంటూ చేసే విమర్శలకు స్పందించాలనిపిస్తుంది. ఈ రెండు ఫొటోలు (ఇన్‌సెట్‌లో ఉన్న ఫొటో) కేవలం మూడు రోజుల వ్యవధిలో దిగినవి. నేను ఏం చెప్పబోతున్నానో చాలా మంది స్త్రీలు అర్థం చేసుకుంటారని, రిలేట్ చేసుకుంటారని అనుకుంటున్నాను. నేనెప్పుడూ నా శరీరంలోని హార్మోన్ల అధీనంలోనే నడుచుకునే ప్రయత్నం చేస్తున్నాను. వాటిని బ్యాలెన్స్ చేయడానికి నిరంతరం శ్రమిస్తూనే ఉన్నాను. వాటితో సమన్వయం కుదుర్చుకునే పనిలోనే ఉన్నాను. అది అనుకున్నంత సులువైన పనేం కాదు. ఆ బాధ తేలికైనదేం కాదు. శరీరంలో వచ్చే మార్పులు చెప్పినంత సులువేం కాదు. కానీ ఈ ప్రయాణాన్ని మీతో పంచుకోవడం సులువు అనుకుంటున్నాను. ఏ వ్యక్తి అయినా సరే ఏ సందర్భంలోనూ మరో వ్యక్తిని జడ్జ్ చేయకూడదు. అవును.. నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాను. దాంట్లో సిగ్గుపడటానికి ఏం లేదు. ఇది నా జీవితం, నా ముఖం. ప్లాస్టిక్ సర్జరీని నేను ప్రమోట్ చేయను. అది విరుద్ధమైనది అని కూడా అనను. నా ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయం అది. అయితే నన్ను విమర్శించడం కరెక్ట్ కాదు. ప్రస్తుతం నేను కొంచెం కొంచెంగా ప్రతిరోజూ నన్ను నేను మరింత ప్రేమించడానికి ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే మన జీవితంలో గొప్ప ప్రేమకథ మనతోనే అయ్యుండాలి. మీ జీవితం కూడా అలానే ఉండాలనుకుంటున్నాను. ప్రేమను పంచుదాం’’ అన్నారు శ్రుతీ హాసన్.


శ్రుతీ హాసన్

# విలన్ సునీల్


సునీల్

‘మజిలీ, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, ప్రతిరోజూ పండగే’ చిత్రాలతో ప్రేక్షకులను నవ్వించిన సుహాస్ ‘కలర్ ఫోటో’ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. చాందినీ చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో సందీప్ రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. సాయి రాజేష్ నీలం, బెన్నీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నటుడు సునీల్ విలన్‌గా నటిస్తున్నారు. శుక్రవారం సునీల్ పుట్టినరోజు సందర్భంగా ‘కలర్ ఫోటో’ చిత్రంలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ‘‘1995లో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ప్రేమకథతో రూపొందుతోన్న చిత్రమిది. వినోదాత్మకంగా ఉంటుంది. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాలో విలన్‌గా సునిల్ చేసిన హంగామాని మాత్రం థియేటర్స్‌లో చూడాలి. ‘మత్తు వదలరా’ ఫేమ్ కాల భైరవ చక్కని సంగీతం అందించారు’’ అన్నారు. ‘‘కలర్ ఫోటో’ సినిమాలో రామరాజు పాత్రలో కనిపిస్తాను. నా కెరీర్‌లో మంచి పాత్ర ఇది. ఈ పాత్రలోని కొత్తదనం అందర్నీ ఆకట్టుకుంటుంది’’ అన్నారు సునిల్. ఈ చిత్రానికి సమర్పణ: శ్రవణ్ కొంక, లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్, కెమెరా: వెంకట్ ఆర్. శాఖమూరి.

# కొత్త సినిమా షురూ

‘అశ్వత్థామ’ విజయంతో మంచి జోరు మీదున్న నాగశౌర్య తన నూతన చిత్రాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం 4గా రూపొందుతున్న ఈ చిత్రానికి మహేశ్ కోనేరు నిర్మాత. రాజా దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ‘దిల్’ రాజు క్లాప్ ఇవ్వగా, హీరో కల్యాణ్‌రామ్ కెమెరా స్విచాన్ చేశారు. దర్శకులు హరీశ్ శంకర్, వి.ఐ. ఆనంద్ గౌరవ దర్శకత్వం వహించారు. ప్రారంభోత్సవం అనంతరం మహేశ్ కోనేరు మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా నాగశౌర్య కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ అండ్ ప్రిస్టేజియస్ ప్రాజెక్ట్స్‌గా రూపొందనుంది. రాజా చక్కటి ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథ తయారు చేశారు. మార్చిలో షూటింగ్ స్టార్ట్ చేసి ఈ ఏడాది సెకండాఫ్‌లో విడుదల చేస్తాం’’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాగర్ మహతి.


రాజా, నాగ శౌర్య, మహేశ్ కోనేరు

# నేనే ఖైదీని

‘ఖైదీ’ హిందీ రీమేక్‌కి ఖైదీ దొరికారు. నేనే ‘ఖైదీ’ని అని శుక్రవారం ప్రకటించారు బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్. కార్తీ నటించిన తమిళ సూపర్ హిట్ చిత్రం ‘ఖైదీ’. ఈ సినిమా హిందీలో రీమేక్ కాబోతోంది. కార్తీ పోషించిన ఖైదీ పాత్రను అజయ్ దేవగన్ హిందీలో చేయనున్నారు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలసి యస్.ఆర్ ప్రభు నిర్మించనున్నారు. ‘‘అవును. ‘ఖైదీ’ రీమేక్‌లో నేనే నటించబోతున్నాను. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం’’ అని ట్వీట్ చేశారు అజయ్ దేవగన్. ఈ సినిమాను ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారనే విషయాన్ని మాత్రం ప్రకటించలేదు.


అజయ్ దేవగన్

# ముహూర్తం కుదిరింది


నిఖిల్

నిఖిల్, స్వాతి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన ‘కార్తికేయ’ చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం 2014 అక్టోబర్ 24న విడుదలై, మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇన్నాళ్లకి వీరిద్దరి కాంబినేషన్‌లో ‘కార్తికేయ 2’కి ముహూర్తం కుదిరింది. మార్చి 2న తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో పూజా కార్యక్రమాలతో ‘కార్తికేయ 2’ సినిమా ప్రారంభం కానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ అర్ట్స్ పతాకాలపై టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రం నిర్మించనున్నారు. ఈ ఏడాది ఆఖరులో సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# మహిళల కోసం...


రంజిత్ కూమర్, రోజా

ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, అరాచకాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘ఆర్‌కె పురంలో’. కౌసల్య, దీప్తి ప్రధానపాత్రల్లో నటిస్తున్నారు. డాక్టర్ రంజిత్ కుమార్ దర్శకత్వంలో దుగ్గిరాల నాగేశ్వరరావు నిర్మిస్తున్న ఈ సినిమా పోస్టర్‌ని ఎమ్మెల్యే, సినీనటి రోజా విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘ఆడపిల్లలపై జరుగుతున్న అరాచకాల ఇతివృత్తంతో సాగే సినిమా ఇది. కుటుంబ మొత్తం కలసి చూసేలా తెరకెక్కిస్తున్నారు. సందేశాత్మక సినిమా తీస్తున్న దర్శక–నిర్మాతల్ని అభినందించాలి. సాటి మహిళల కోసం నా సహకారం ఎప్పుడూ ఉంటుంది’’ అన్నారు. ‘‘రోజాగారి ఆశీస్సులతో ‘ఆర్‌కె పురంలో’ చిత్రం తెరకెక్కిస్తున్నాం. మా సినిమాకు కథే హీరో. మన చుట్టూ కనిపించే పాత్రలే ఇందులో ఉంటాయి’’ అన్నారు డాక్టర్ రంజిత్ కుమార్.

# ఇమేజ్ మారుతుందా?


పాయల్ రాజ్‌పుత్

‘ఆర్‌ఎక్స్ 100’ ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో ఓ సినిమా తెరకెక్కుతోంది. గుణశేఖర్ దగ్గర పలు చిత్రాలకు దర్శకత్వ శాఖలో పని చేసిన ప్రణదీప్ ఈ సినిమాతో దర్శకునిగా పరిచయమవుతున్నారు. కైవల్య క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న ఈ సినిమా ఒక షెడ్యూల్ మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా ప్రణదీప్ మాట్లాడుతూ– ‘‘క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మిస్టరీ డ్రామాగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో పాయల్ రాజ్‌పుత్ ఐపీఎస్ అధికారిణి పాత్ర చేస్తున్నారు. ఇప్పటివరకూ పాయల్‌ను గ్లామర్ హీరోయిన్‌గానే చూశారు. మా సినిమాలో ఆమెను మరో విధంగా చూస్తారు. తన ఇమేజ్ మార్చే విధంగా ఆమె పాత్ర ఉంటుంది. మార్చి మొదటివారంలో చివరి షెడ్యూల్ షూటింగ్‌కి సన్నాహాలు చేస్తున్నాం. మా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మార్చి 4న విడుదల చేయనున్నాం. వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు.

# నా పుట్టినరోజు నాలుగేళ్లకోసారి వస్తుంది

‘‘యం 6’ వంటి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం ద్వారా హీరోగా పరిచయమయ్యారు ధ్రువ. ఆ చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ధ్రువ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ‘‘చిన్నప్పటి నుంచి హీరో కావాలనుకునేవాణ్ణి.. అది ‘యం 6’ ద్వారా నెరవేరింది. నిర్మాత విశ్వనాథ్ తన్నీరుగారు ఒక మంచి సస్పెన్స్ థ్రిల్లర్ ద్వారా నన్ను హీరోగా పరిచయం చేశారు. ఆ సినిమాలో నా నటన నచ్చడంతో నాతోనే మరో సినిమాని ప్లాన్ చేశారు విశ్వనాథ్‌గారు. ఈ సినిమాకి నిర్మాతగానే కాదు, దర్శకుడిగా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సినిమా త్వరలోనే ప్రారంభం కానుంది. సరికొత్త కథతో చక్కని సందేశంతో ఈ చిత్రం ఉంటుంది. నా పుట్టినరోజు (ఫిబ్రవరి 29) నాలుగు సంవత్సరాలకి ఒకసారి వస్తుంది. నేను హీరో అయిన తర్వాత వచ్చిన మొదటి పుట్టినరోజు ఇది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూ హీరోగా మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటున్నా’’ అన్నారు.


ధృవ




# రెక్కలు తొడిగి... రివ్వున దూసుకెళ్లి...

## అసమానం శిఖా పాండే ప్రస్థానం





### ప్రపంచకప్‌లో కీలక పాత్ర పోషిస్తున్న భారత పేస్ బౌలర్

### ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయిట్ లెఫ్టినెంట్ హోదా

### అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచే కెరీర్

**చిన్నప్పుడు ఆ అమ్మాయి క్రికెటర్ కావాలనుకుంది... మామూలుగా క్రికెట్ ఆడటమే కాదు దేశానికే ప్రాతినిధ్యం వహించింది...ఆమెను ఇంజనీర్‌గా చూడాలని అమ్మానాన్న అనుకున్నారు... సీరియస్‌గా చదువుపై దృష్టి పెట్టి ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆ అమ్మాయి తల్లిదండ్రులకిచ్చిన మాటను నిలబెట్టుకుంది... ఎప్పటికైనా ఎయిర్‌ఫోర్స్‌లో పని చేయాలనేది ఆమె కల... అర్హత పరీక్షల్లో సత్తా చాటి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా ఎంపికైంది... ఒకే అమ్మాయిలో ఇన్ని విభిన్న కోణాలు కలగలిస్తే ఆమె శిఖా పాండే అవుతుంది. ప్రస్తుతం టి20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న పేస్ బౌలర్. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగం కావాలనేది శిఖా బలమైన కోరిక. 2017 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో తన రనౌట్‌తోనే ఆమె కల చెదిరింది. ఈ సారైనా అది నెరవేరుతుందా అనేది ఆసక్తికరం.**

(సాక్షి క్రీడా విభాగం)

ప్రొఫెషనల్‌గా ఆటలో సత్తా చాటుతూ మరో వైపు సమాంతరంగా ఉన్నత చదువులను కొనసాగించే వారు క్రికెట్ ప్రపంచంలో అతి తక్కువ మంది కనిపిస్తారు. అనిల్ కుంబ్లే, అశ్విన్, అంజుమ్ చోప్రాలాంటి వారు కూడా ఇంజినీరింగ్‌లు చదివినా దానిని పేరుకు, డిగ్రీ పట్టా అందుకోవడం వరకే పరిమితం చేశారు. మరో వైపు ఆటగాళ్లకు ప్రోత్సాహంగా కొన్ని సంస్థలు ఇచ్చే మేనేజర్ తరహా ఉద్యోగాలు కూడా ఉంటాయి. కానీ భారత మహిళా క్రికెటర్ శిఖా సుభాశ్ పాండే మాత్రం వీటికి భిన్నం. తన సామర్థ్యానికి తగినట్లుగా పోటీల్లో నిలిచి తాను అనుకున్న ఉద్యోగంలో చేరింది. ఒక వైపు క్రికెటర్‌గా భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తూనే ఎయిర్‌పోర్ట్‌లో కూడా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. ఆసక్తి, ప్రతిభ ఉంటే ఎన్ని విజయాలైనా సాధించవచ్చని చేతల్లో చూపించిన శిఖా కెరీర్ ఎందరో అమ్మాయిలకు స్ఫూర్తిదాయకం.

#### జూనియర్ క్రికెట్ నుంచి...

శిఖా క్రికెట్ కెరీర్ గోవాలో మొదలైంది. గల్లీల్లో కుర్రాళ్లతో కలిసి ఆడిన ఆమె స్కూల్ క్రికెట్‌లో సత్తా చాటడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో అండర్–17, అండర్–19 స్థాయిలో వరుసగా మ్యాచ్‌లు ఆడే అవకాశం లభించింది. అప్పుడప్పుడే ఎదుగుతున్న గోవా క్రికెట్‌లో పెద్దగా పోటీ కూడా లేని సమయం కావడంతో వేగంగా దూసుకుపోవడం సులువైంది.

అదే సమయంలో బీసీసీఐ కూడా మహిళా క్రికెట్‌ను గుర్తించడంతో శిఖా ప్రదర్శన అందరి దృష్టినీ ఆకర్షించింది. దాంతో ఉమెన్ చాలెంజర్ టోర్నీ, సౌత్ జోన్ అండర్–19 జట్లలో అవకాశాలు దక్కాయి. అనంతరం గోవా సీనియర్ టి20 టీమ్‌లో వచ్చేందుకు కూడా ఎక్కువ సమయం పట్టలేదు. 2011లో భారత పర్యటనకు వచ్చిన వెస్టిండీస్ జట్టుతో టూర్ మ్యాచ్ ఆడిన భారత 'ఎ' జట్టులో, ఇంగ్లండ్‌పై ఆడిన బోర్డు ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టులో కూడా చోటు దక్కింది. వరుస వికెట్లతో శిఖా ఈ పోటీల్లో సత్తా చాటింది. ఆపై భారత జట్టులో స్థానం లభించడం లాంఛనమే అయింది. గోవా తరఫున భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తొలి క్రికెటర్‌గా పాండే అరుదైన ఘనత అందుకుంది. ప్రధానంగా పేస్ బౌలరే అయినా...లోయర్ ఆర్డర్‌లో ధాటిగా ఆడుతూ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

**శిఖా పాండే అంతర్జాతీయ కెరీర్**

| | మ్యాచ్‌లు | పరుగులు | సగటు | స్ట్రయిక్‌రేట్ | అర్ధ సెంచరీలు | వికెట్లు | సగటు | ఎకానమీ |
|---|---|---|---|---|---|---|---|---|
| వన్డేలు | 52 | 507 | 21.12 | 91.51 | 2 | 73 | 21.06 | 3.94 |
| టి20లు | 48 | 204 | 14.57 | 80.00 | 0 | 35 | 23.14 | 6.12 |

#### చదువులో తగ్గకుండా...

ఆటలో ఎదగాలనుకునేవారికి అందరికంటే ముందుగా కోచ్‌లు, సన్నిహితులు చెప్పే మాట ఒకటే. రెండు పడవల ప్రయాణం మంచిది కాదని, ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని పూర్తిగా దానిపైనే దృష్టి పెట్టాలని సూచిస్తుంటారు. కానీ శిఖా అలా అనుకోలేదు. ఆటలో పడి చదువును ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. స్కూల్‌నుంచి కాలేజీ వరకు మంచి మార్కులతో నంబర్‌వన్‌గా ఉంటూ తనపై నమ్మకాన్ని నిలబెడుతూ వచ్చింది. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ అంటే ఆమెకు చాలా ఇష్టం. తల్లిదండ్రులకిచ్చిన మాట ప్రకారం గోవా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌నుంచి 'ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్'లో పట్టా అందుకుంది. ఆ అర్హతతో పలు పెద్ద కంపెనీలు ఉద్యోగం ఇచ్చేందుకు సిద్ధమైనా... క్రికెట్‌లో ముందుకు వెళ్లటమే లక్ష్యంగా పెట్టుకుంది. 2011లో ఎయిర్‌ఫోర్స్‌లోకి ఎంపికైన శిఖా ఏడాది శిక్షణ అనంతరం ఫ్లయింగ్ ఏటీసీ ఆఫీసర్‌గా నియమితురాలైంది. అటు క్రికెట్ ఆడుతూ, ఇటు సీరియస్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆమె తన కెరీర్‌ను కొనసాగించిన తీరు నిజంగా అద్భుతం. గత టి20 ప్రపంచకప్‌కు ముందు భారత జట్టులో చోటు కోల్పోయినా...పట్టుదలతో పోరాడి తిరిగొచ్చిన శిఖా పునరాగమనంలో మరింత పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను పడగొడుతోంది.



#### కరీంనగర్ నుంచి...

శిఖా తండ్రి సుభాశ్ పాండే కేంద్రీయ విద్యాలయ(కేవీ) పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో పని చేసిన ఆయన చివరకు గోవాలో స్థిరపడ్డారు. గతంలో తెలంగాణలోని రామగుండంలో ఆయన పని చేశారు. అదే సమయంలో శిఖా కరీంనగర్‌లోనే పుట్టింది. కేవీ కారణంగానే స్పోర్ట్స్‌పై ఆమెకు ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఢిల్లీలోని పాలమ్ విమానాశ్రయంలో ఆమె ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 31 ఏళ్ల శిఖాను పేస్ బౌలర్‌గా, యార్కర్ స్పెషలిస్టుగా తీర్చిదిద్దడంలో భారత మాజీ పేసర్ సుబ్రతో బెనర్జీ కీలక పాత్ర పోషించారు.





# అజేయంగా ముందుకెళ్తారా..!

## నేడు లంకతో భారత్ నామమాత్రపు పోరు

ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–2 చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

**మెల్‌బోర్న్:** భారత అమ్మాయిల జట్టు అందరి కంటే ముందుగానే సెమీస్ చేరింది. ఇప్పుడు అజేయంగా ముందుకెళ్లడంపై దృష్టిపెట్టింది. మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు గ్రూప్'ఎ'లో జరిగే తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడనుంది. భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో వరుస విజయాలతో ఊపు మీదుంది. మొదట డిఫెండింగ్ చాంపియన్ ఆసీస్‌పై, తర్వాత బంగ్లా, కివీస్‌లను ఓడించిన భారత్ ఇప్పుడు గ్రూప్ టాపర్‌గా ఉంది. ఇలాంటి జట్టు లంకను ఓడించడం పెద్ద కష్టం కాకపోవచ్చు. పైగా హర్మన్ సేన అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లో దుర్భేద్యంగా ఉంది. అందుకేనేమో సారథి హర్మన్ వరుసగా విఫలమవుతున్నా ఆ ప్రభావం జట్టుపై ఏమాత్రం లేదు. 16 ఏళ్ల షఫాలీ వర్మ ప్రత్యర్థుల పాలిట సింహ స్వప్నమవుతోంది. జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు మిడిలార్డర్‌లో తానియా, వేద కృష్ణమూర్తిలు చక్కగా రాణిస్తున్నారు. ఇక బౌలింగ్ అయితే బ్యాటింగ్‌కు దీటుగా ఉంది. గత మూడు మ్యాచ్‌ల్లో మనం చేసిన స్కోర్లను నిలబెట్టిందే బౌలర్లు. స్పిన్నర్ పూనమ్ యాదవ్, పేసర్ శిఖా పాండేలను ఎదుర్కొనేందుకు ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ ఆపసోపాలు పడుతున్నారు. పేలవ ఫామ్‌ను కనబరుస్తున్న హర్మన్‌ప్రీత్ గనక ఈ మ్యాచ్‌తో గాడిన పడితే భారత్ తిరుగులేని జట్టుగా మారడం ఖాయం. మరో వైపు శ్రీలంక అమ్మాయిలది పూర్తిగా భిన్నమైన పరిస్థితి. భారత్ ఆడినవన్నీ గెలిస్తే... లంకేమో ఓడింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ లక్ష్యాల్ని బౌలర్లు కాపాడితే... లంక లక్ష్యాలన్నీ చెదిరిపోయాయి. బ్యాటింగ్‌లో కెప్టెన్ జయాంగని ఫామ్‌లో ఉంది. హర్షిత మాధవి, హాసిని పెరీరాలు కూడా మెరుగ్గా ఆడారు. కానీ బౌలింగ్ వైఫల్యం లంకను పరాజయం పాలు చేసింది. రెండు మ్యాచ్‌ల్లో లంక బౌలర్లు తీసింది 7 వికెట్లే కావడం గమనార్హం. దీనివల్లే లంక లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. ఇప్పటికే సెమీస్‌ను కష్టం చేసుకున్న లంక... పరువుకోసమైనా గెలిచేందుకు ఆరాటపడుతోంది.





క్రైస్ట్‌చర్చ్‌లో ప్రాక్టీస్ తర్వాత ఎలక్ట్రిక్ స్కూటర్‌పై జడేజా

# ఇషాంత్ అవుట్

- తుది జట్టులోకి ఉమేశ్ యాదవ్!
- పృథ్వీ షా ఫిట్, అశ్విన్ స్థానంలో జడేజా

**క్రైస్ట్‌చర్చ్:** కివీస్ పర్యటనలో ఆఖరి పోరుకు ముందు భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ గాయపడ్డాడు. అతని కుడి చీలమండకు గాయం కావడంతో రెండో టెస్టుకు అతను అందుబాటులో లేకుండా పోయాడు. ఇతని స్థానంలో ఉమేశ్ యాదవ్ బరిలోకి దిగే అవకాశముంది. ఇషాంత్‌కు అయిన గాయం కొత్తదేం కాదు. జనవరిలో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో గాయపడ్డాడు. అప్పుడే అతను కివీస్ పర్యటనకు అనుమానమేనని వార్తలొచ్చాయి. అయితే చక్కటి ఫామ్‌లో ఉన్న ఇషాంత్‌ను... వేగంగా కోలుకున్నాడనే కారణంతో టెస్టు జట్టులోకి తీసుకున్నారు. టీమ్ మేనేజ్‌మెంట్ ఆశించినట్లుగానే తొలిటెస్టులో ఇషాంత్ (5/68) రాణించాడు. బ్యాటింగ్ వైఫల్యంతో భారత్ ఈ మ్యాచ్ ఓడింది. శుక్రవారం జట్టు సభ్యులు ప్రాక్టీసు చేస్తుండగా... అతను కూడా వచ్చాడు. కానీ అసౌకర్యంగా కనిపించడంతో నెట్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో జట్టు మేనేజ్‌మెంట్ ముందు జాగ్రత్తగా అతని కుడి చీలమండకు స్కానింగ్ కూడా తీయించింది. రిపోర్టులు ప్రతికూలంగా వచ్చినట్లు సమాచారం. బౌలింగ్‌లో ఎదురుదెబ్బ తగిలినా... బ్యాటింగ్‌లో మాత్రం యువ ఓపెనర్ పృథ్వీ షా ఫిట్‌నెస్‌తో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అతని ఎడమ పాదానికి అయిన వాపు మానిందని, రెండో టెస్టు ఆడతాడని భారత హెడ్ కోచ్ రవిశాస్త్రి తెలిపాడు. ఫామ్‌లోలేని వెటరన్ స్పిన్నర్ అశ్విన్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ జడేజాను తీసుకునేది ఖాయమైంది. జడేజా బ్యాటింగ్ చేయగల సమర్థుడు కావడంతో అతన్ని తీసుకోవాలని కోచ్‌తో పాటు కెప్టెన్ కోహ్లి నిర్ణయించినట్లు తెలిసింది.

**బ్యాటింగ్ పిచ్!**

క్రైస్ట్‌చర్చ్ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం. గత టెస్టులా కాకుండా ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారే అవకాశముంది. ఇది బ్యాట్స్‌మెన్‌కు ఊరటనిచ్చే అంశం. ప్రత్యేకించి భారత బ్యాట్స్‌మెన్ ఆఖరి పోరులో అదిరిపోయే ఆట ఆడేందుకు ఇది చక్కని వేదిక.

# దుబాయ్‌లో ఆసియా కప్

### సౌరవ్ గంగూలీ ప్రకటన



**కోల్‌కతా:** సెప్టెంబరులో జరగాల్సిన ఆసియా కప్ వేదిక మారింది. టోర్నీ పాకిస్తాన్‌లో జరగాల్సి ఉండగా...పాక్‌లో ఆడలేమంటూ బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో మార్పు అనివార్యమైంది. ఈ టోర్నీ యూఏఈలోని దుబాయ్‌లో జరుగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వెల్లడించాడు. భారత్, పాక్‌ల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ఇరు జట్ల మధ్య 2012–13 నుంచి ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రం తలపడుతున్నాయి. దుబాయ్‌లో వచ్చే నెల 3న జరిగే ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) సమావేశంలో పాల్గొనేందుకు గంగూలీ అక్కడికి వెళ్లనున్నాడు. ఈ సందర్భంగా ఈడెన్ గార్డెన్స్‌లో మీడియాతో మాట్లాడుతూ... ఆసియా టోర్నీలో దాయాది జట్లు భారత్, పాకిస్తాన్ తలపడతాయని అన్నాడు. ఆసీస్ ఆతిథ్యమిస్తున్న మహిళల టి20 ప్రపంచకప్‌లో అమ్మాయిల జట్టు అద్భుతంగా రాణిస్తోందని అతను కితాబిచ్చాడు. న్యూజిలాండ్ పర్యటనలో టెస్టు సిరీస్‌లో వెనుకబడిన విరాట్ సేన రెండో టెస్టులో పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశాడు.

## సింగిల్స్ కోచ్‌గా సాంటోసో

### టోక్యో ఒలింపిక్స్ వరకు శిక్షణ



**న్యూఢిల్లీ:** ఒలింపిక్ ఏడాది నేపథ్యంలో భారత బ్యాడ్మింటన్ సింగిల్స్ కోచ్‌గా ఇండోనేసియాకు చెందిన అగుస్ డ్వి సాంటోసోను ఎంపిక చేస్తూ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దక్షిణ కొరియాకు చెందిన కిమ్ జి హ్యూన్ వెళ్లడంతో ఏర్పడిన కోచ్ ఖాళీని భర్తీ చేయాలంటూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) గతంలో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను కోరింది. దానిపై స్పందించిన మంత్రిత్వ శాఖ సాంటోస్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. అతడు ఒలింపిక్స్ ముగిసే వరకు కోచ్‌గా సేవలు అందించనున్నాడు. సాంటోస్ మార్చి రెండో వారంలో భారత బ్యాడ్మింటన్ జట్టుతో కలుస్తాడు. అతడి పర్యవేక్షణలో ప్రపంచ చాంపియన్ పీవీ సింధుతో పాటు ఇతర సింగిల్స్ షట్లర్లు కూడా టోక్యో కోసం సిద్ధమవుతారు. సాంటోస్ శిక్షణతో సంతృప్తి చెందితే అతడిని 2024 వరకు కూడా కొనసాగిస్తామని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి అజయ్ సింఘానియా తెలిపారు. ఒలింపిక్స్ వరకు సాంటోసోకు నెలకు 8 వేల డాలర్లు (సుమారు రూ.5.8 లక్షలు ) చెల్లించనున్నారు.

## నేటినుంచి రంజీ ట్రోఫీ సెమీస్

గుజరాత్ Vs సౌరాష్ట్ర (వేదిక రాజ్‌కోట్)

బెంగాల్ Vs కర్ణాటక (వేదిక కోల్‌కతా)

ఉ.గం. 9.15 నుంచి స్టార్ స్పోర్ట్స్ చానల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

### షూటింగ్ ప్రపంచ కప్ నుంచి

## వైదొలిగిన భారత్

**న్యూఢిల్లీ:** సైప్రస్ వేదికగా మార్చి 4 నుంచి 13 వరకు జరిగే ప్రపంచ షూటింగ్ ప్రపంచ కప్ నుంచి భారత్ వైదొలిగింది. కోవిడ్–19 విజృంభిస్తున్న నేపథ్యంలో భార త షూటర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు భారత జాతీయ రైఫిల్ సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కోవిడ్–19 రోజు రోజుకు విస్తరిస్తున్న తరుణంలో భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ కొన్ని దేశాలకు భారతీయులు ప్రయాణం చేయకుండా ఉంటేనే మంచిదంటూ ఈ నెల 26న తెలిపింది. ఆ దేశాల జాబితాలో సైప్రస్ ఉండటంతో భారత షూటర్లు షూటింగ్ ప్రపంచ కప్ ఈవెంట్‌కు దూరమయ్యారు.

# సఫారీ భారీ విజయం

- చితక్కొట్టిన లిజెల్లీ లీ
- మహిళల టి20 ప్రపంచ కప్





**కాన్‌బెర్రా:** మహిళల టి20 ప్రపంచకప్‌లో థాయ్‌లాండ్ కూనపై దక్షిణాఫ్రికా 113 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. సఫారీ ఓపెనర్ లిజెల్లీ లీ (60 బంతుల్లో 101; 16 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగింది. ఆమె సెంచరీలో 82 పరుగులు ఫోర్లు, సిక్సర్లతోనే వచ్చాయి. మొదట దక్షిణాఫ్రికా అమ్మాయిల జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లకు 195 పరుగులు చేసింది. సున్ లూస్ (41 బంతుల్లో 61 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించింది. లీ, లూస్ రెండో వికెట్‌కు 13 ఓవర్లలో 131 పరుగులు జోడించారు. కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన థాయ్‌లాండ్ కూన 19.1 ఓవర్లలో 82 పరుగులకే ఆలౌటైంది. కంచోంపు (26), సుతిరంగ్ (13)లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. షబ్నిమ్, లూస్ చెరో 3 వికెట్లు తీశారు.

**పాక్‌పై ఇంగ్లండ్ జయభేరి**

మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ మహిళలు 42 పరుగుల తేడాతో పాకిస్తాన్ అమ్మాయిలపై గెలిచారు. ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. హీథెర్ నైట్ (62), సీవెర్ (36) ధాటిగా ఆడారు. ఐమన్‌కు 3 వికెట్లు దక్కాయి. లక్ష్యఛేదనకు దిగిన పాక్ 19.4 ఓవర్లలో 116 పరుగులకే ఆలౌటైంది. అలియా (41) ఒంటరి పోరాటం చేసింది. ష్రబ్‌సోల్, గ్లెన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

## సున్ యాంగ్‌పై ఎనిమిదేళ్ల నిషేధం



**హాంకాంగ్:** మూడు సార్లు ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, చైనా ఫ్రీ స్టయిల్ స్విమ్మర్ సున్ యాంగ్‌పై కోర్ట్ ఆఫ్ ఆర్బిటరేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్) శుక్రవారం ఎనిమిదేళ్ల నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. 2018 సెప్టెంబర్‌లో అతడి నుంచి శాంపిల్స్‌ను సేకరించడానికి వెళ్లిన ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ప్రతినిధులకు సహకరించకుండా... వారు సేకరించిన శాంపిల్స్‌ను నాశనం చేశాడనే అభియోగంతో సీఏఎస్ అతడిపై విచారణ చేపట్టింది. తాజాగా ఆ ఘటనలో సున్ యాంగ్‌ను దోషిగా తేలుస్తూ... అతడిపై ఎనిమిదేళ్ల నిషేధం విధించింది. అయితే దీనిపై స్పందించిన సున్ తానెటువంటి తప్పు చేయలేదని...దీనిపై స్విట్జర్లాండ్ ఫెడరల్ కోర్టులో అప్పీల్ చేస్తానని మీడియాకు తెలిపాడు. చైనా స్విమ్మింగ్ సంఘం (సీఎస్ఏ) కూడా సున్‌కు మద్దతు తెలిపింది. ఆ రోజు సున్ శాంపిల్స్ సేకరించడానికి వచ్చిన వారు అర్హత కలిగిన అధికారులు కాదని తెలిపింది. 2014లో కూడా సున్ డోపింగ్‌లో పట్టుబడి నిషేధాన్ని ఎదుర్కొన్నాడు.

సాక్షి బిజినెస్
శనివారం
29-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 1,448 ▼ | 432 ▼ |
| 38,297 | 11,202 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,520 | ▼ 43 |
| డోజోన్స్ | 25,270 | ▼ 497 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,582 | ▼ 216 |
| డాక్స్ | 11,890 | ▼ 477 |
| షాంఘై | 2,880 | ▼ 111 |
| నికాయ్ | 21,143 | ▼ 805 |

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ●కొనుగోలు | ●అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 71.37 | 74.01 |
| బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 91.72 | 95.30 |
| యూరో | థామస్‌కుక్ | 78.16 | 81.49 |
| జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 63.00 | 70.00 |
| ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 46.01 | 48.42 |
| సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 50.92 | 53.39 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.46 | 20.07 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.19 | 20.04 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.71 | 10.96 |

# కరోనా ముసలం...

కోవిడ్–19(కరోనా) వైరస్ ప్రపంచమంతా పాకుతుండటంతో అంతర్జాతీయ వృద్ధిపై భయాందోళనలు చెలరేగుతున్నాయి. ప్రస్తుతమున్న ఆర్థిక మందగమనం కోవిడ్ వైరస్ కారణంగా మాంద్యంగా పరిణమిస్తుందనే భయాలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. మన మార్కెట్ శుక్రవారం భారీగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీలు కీలక మద్దతులన్నింటినీ కోల్పోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,448 పాయింట్లు పతనమై 38,297 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 432 పాయింట్లు నష్టపోయి 11,202 పాయింట్ల వద్దకు చేరింది. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 3.64 శాతం, నిఫ్టీ 3.71 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యంత భారీ పతనం. 2015, ఆగస్టు 24 వ తేదీన సెన్సెక్స్ అత్యధికంగా 1,625 పాయింట్లు నష్టపోయింది.

**ఆరో రోజూ నష్టాలే...:** సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా ఆరో రోజూ క్షీణించాయి. ఈ రెండు సూచీలు నాలుగున్నర నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఇక ఈ వారంలో సెన్సెక్స్ 2,873 పాయింట్లు, నిఫ్టీ 879 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 6.9%, నిఫ్టీ 7.2% పడ్డాయి

**ఎదురీదిన ఐటీసీ**

- మొత్తం 30 సెన్సెక్స్ షేర్లలో ఐటీసీ మినహా మిగిలిన అన్ని షేర్లు నష్టపోయాయి. టెక్ మహీంద్రా 8 శాతం, టాటా స్టీల్ 7.5 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 7.5 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 7 శాతం, బజాజ్ ఫైనాన్స్ 6 శాతం, ఇన్ఫోసిస్ 6 శాతం చొప్పున పతనమయ్యాయి.
- 400కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. ఏసీసీ, ఏబీబీ ఇండియా, అపోలో టైర్స్, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హీరో మోటొ, గెయిల్, కోల్ ఇండియా, విప్రో, మహీంద్రా, వేదాంత, ఎల్ అండ్ టీ, ఓఎన్‌జీసీ, లుపిన్, టాటా పవర్, హెచ్‌పీసీఎల్, పీఎన్‌బీ తదితర షేర్లు జాబితాలో ఉన్నాయి.
- మిధాని, డీఐసీ ఇండియా తదితర 30 పైగా షేర్లు ఏడాది గరిష్టాలకు ఎగిశాయి.
- 300కు పైగా షేర్లు లోయర్ సర్క్యూట్లను తాకాయి. ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ఇండియాబుల్స్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్, శంకర బిల్డింగ్స్ ప్రొడక్ట్స్, రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ పవర్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. కాగా డీహెచ్‌ఎఫ్‌ఎల్, రుచి సోయా, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ తదితర షేర్లు అప్పర్ సర్క్యూట్లను తాకాయి.

## 57 దేశాలకు పాకిన కోవిడ్-19 వైరస్

- మందగమనం మాంద్యంగా మారుతుందనే భయాలు
- కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు
- మన మార్కెట్లో కొనసాగుతున్న విదేశీ అమ్మకాలు
- 50 పైసలకు పైగా పడిపోయిన రూపాయి
- కీలక మద్దతులను కోల్పోయిన దేశీ సూచీలు...
- 1,448 పాయింట్ల నష్టంతో 38,297కు సెన్సెక్స్
- సెన్సెక్స్‌కు ఇదే రెండో అతి పెద్ద నష్టం
- 432 పాయింట్లు తగ్గి 11,202కు నిఫ్టీ



# బ్లాక్ ఫ్రైడే..!

### పతనానికి ప్రధాన కారణాలు...

**వైరస్ విలయం...**

మొన్నమొన్నటిదాకా 30 దేశాలకే పరిమితమైన కోవిడ్–19 వైరస్ ఇప్పుడు మొత్తం ఆరు ఖండాల్లోని 57 దేశాలకు పాకింది. చైనాలో కొత్త కేసులు, కోవిడ్ వైరస్ బాధితుల మరణాలు తగ్గినప్పటికీ, న్యూజిలాండ్, నైజీరియా, అజర్‌బైజాన్, నెదర్లాండ్స్ దేశాల్లో కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వైరస్ సోకిన వారి సంఖ్య 80,000కు, మరణాల సంఖ్య 2,900కు చేరింది.

**ప్రపంచ మార్కెట్ల పతనం**

కోవిడ్–19 వైరస్ భయాలతో ప్రపంచ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. 2008 నాటి ఆర్థిక సంక్షోభం సమయంలో ఒక వారం పాటు ప్రపంచ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. మళ్లీ ఈ ఏడాది ఈ వారంలో అదే స్థాయి నష్టాలు వాటిల్లాయి. శుక్రవారం షాంఘై, హాంగ్‌సెంగ్, సియోల్, టోక్యో సూచీలు 2–4 శాతం వరకూ నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు ఆరంభంలోనే 4% క్షీణించాయి. గురువారం అమెరికా స్టాక్ సూచీ, డో జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1,191 పాయింట్లు పతనమైంది. డోజోన్స్ చరిత్రలో ఇదే అత్యంత భారీ పతనం. గత ఏడు ట్రేడింగ్ సెషన్లలో డోజోన్స్ మొత్తం 3,581 పాయింట్లు (12%) మేర క్షీణించింది.

**విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు**

విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. ఈ వారంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రమారమి రూ.10,000 కోట్ల మేర నికర అమ్మకాలు జరిపారు. కోవిడ్–19 వైరస్ ప్రభావం మన దేశంపై లేనప్పటికీ, ప్రపంచ మార్కెట్ల పతనం కొనసాగితే, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణ మరింతగా జరుగుతుందని నిపుణులంటున్నారు.

**ముడి చమురు ధరల పతనం**

కోవిడ్–19 వైరస్ కారణంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించి చమురుకు డిమాండ్ తగ్గుతుందనే అంచనాలతో ముడి చమురు ధరలు 3.3 శాతం మేర నష్టపోయాయి. సాధారణంగా ముడి చమురు ధరలు పతనమైతే, మన మార్కెట్ లాభపడాలి. కానీ మాంద్యం భయాలతో ముడి చమురు ధరలు పడిపోవడం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావమే చూపించింది.

**రూపాయి డౌన్**

డాలర్‌తో రూపాయి మారకం విలువ 55 పైసలు క్షీణించి 72.16కు చేరడం కూడా స్టాక్ మార్కెట్లో అమ్మకాల జోరుకు ఒక కారణమైంది.

### ప్రపంచ మార్కెట్లు విలవిల..

| సూచీ(దేశం) | నష్టం(పాయింట్లు–%) |
|---|---|
| సెన్సెక్స్(భారత్) | 1,448(3.6) |
| నిఫ్టీ(భారత్) | 432(3.7) |
| నికాయ్(జపాన్) | 805(3.6) |
| హాంగ్‌సెంగ్(హాంగ్ కాంగ్) | 649(2.4) |
| కోస్పి(ద.కొరియా) | 68(3.3) |
| షాంఘై (చైనా) | 111(3.7) |
| ఎఫ్‌టీఎస్‌ఈ (ఇంగ్లండ్) | 216(3.1) |
| క్యాక్(ఫ్రాన్స్) | 186(3.3) |
| డ్యాక్స్(జర్మనీ) | 477(3.8) |
| డోజోన్స్(అమెరికా-ఇంట్రాడే) | 972(3.7) |
| నాస్‌డాక్(అమెరికా-ఇంట్రాడే) | 247(2.8) |

### సెన్సెక్స్ టాప్–10 పతనాలు

| తేదీ | పాయింట్లు |
|---|---|
| 24/08/2015 | 1,625 |
| 28/02/2020 | 1,448 |
| 21/01/2008 | 1,408 |
| 24/10/2008 | 1,071 |
| 1/02/2020 | 988 |
| 17/03/2008 | 951 |
| 3/03/2008 | 901 |
| 22/01/2008 | 875 |
| 6/06/2009 | 869 |
| 6/01/2015 | 854 |



# శోకావిఘాలం



శుక్రవారం సెన్సెక్స్ ఆరంభం 39087 పాయింట్లు నష్టం 659 పాయింట్లు



సెన్సెక్స్ ముగింపు 38297 పాయింట్లు 1448 పాయింట్లు డౌన్

### పతనం ఇక్కడితో ఆగుతుందా?

స్టాక్ మార్కెట్ తదుపరి గమనంపై విశ్లేషకులు విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మన మార్కెట్ అంతర్జాతీయ సంకేతాలపై అధికంగా ఆధారపడుతోందని, ప్రపంచ మార్కెట్లు పతనమవుతుండటంతో ప్రస్తుతానికి మార్కెట్‌కు దూరంగానే ఉంటే మంచిదని కొందరు విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే ప్రతి పతనం కొనుగోలుకు మంచి అవకాశమని మరికొందరంటున్నారు.

**వచ్చే వారం పుల్‌బ్యాక్ ర్యాలీ...!**

మార్కెట్ ఇక్కడ స్థిరపడటానికి ఇది మంచి అవకాశమని ట్రేడింగ్‌బుల్స్ సీనియర్ ఎనలిస్ట్ సంతోష్ మీనా పేర్కొన్నారు. వచ్చే వారం పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారు. 200 రోజుల చలన సగటు(డీఎమ్‌ఏ)–11,687 పాయింట్లకు నిఫ్టీ చేరవచ్చని తెలిపారు. మద్దతు స్థాయిలు 11,200–11,100 పాయింట్లని, కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించినప్పుడు నిఫ్టీ ఇక్కడినుంచే ర్యాలీ జరిపిందన్నారు. ఒకవేళ నిఫ్టీ 11,100 పాయింట్ల దిగువకు పడిపోతే నిఫ్టీ తదుపరి మద్దతు 10,700 పాయింట్లని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు ఇదే మంచి తరుణమా..?**

కాగా కరోనా విలయం ప్రపంచ మార్కెట్లపై మరింతగానే ప్రభావం చూపుతుందని నిపుణులంటున్నారు. మన దేశంలో కోవిడ్–19 వైరస్ కేసులు ఏమీ నమోదు కాలేదని, ఈ విషయంలో ఇతర దేశాలతో పోల్చితే మన దేశం ఒకింత ఉత్తమ స్థాయిలోనే ఉందని మేబ్యాంక్ కిమ్ యంగ్ సెక్యూరిటీస్ సీఈఓ జిగర్ షా వ్యాఖ్యానించారు. దీర్ఘకాలం దృష్ట్యా ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్న షేర్లలో మదుపు చేయడానికి ఇదే మంచి తరుణమని సూచించారు. ఎగుమతులపై భారత్ అధికంగా చైనాపై ఆధారపడి ఉందని, అందుకని కోవిడ్–19 వైరస్ ప్రభావం భారత్‌పై కూడా ఉంటుందని విదేశీ ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారని డాల్టన్ క్యాపిటల్ ఎనలిస్ట్ యూ.ఆర్. భట్ చెప్పారు.

### మార్కెట్లో 6 రోజుల విలయం ఇదీ..

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 2,873 పాయింట్లు ↓ | 7% |
| నిఫ్టీ | 879 పాయింట్లు ↓ | 7% |
| డోజోన్స్ | 3,581 పాయింట్లు ↓ | 12% |
| మన ఇన్వెస్టర్ల సంపద | రూ.12 లక్షల కోట్లు ↓ | |

### మరో రూ.5.5 లక్షల కోట్లు హుష్

స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.5.45 లక్షల కోట్ల మేర ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.5.45,453 కోట్లు క్షీణించి రూ.1.46,94,572 కోట్లకు పడిపోయింది. గత ఆరు రోజుల్లో మొత్తం రూ.11,76,986 కోట్ల సంపద హరించుకుపోయింది.

### భారీగా తగ్గిన పసిడి ధర

**న్యూయార్క్:** అంతర్జాతీయంగా ఔన్స్ (31.1గ్రా) పసిడి ధర శుక్రవారం భారీగా దిగివచ్చింది. కేవలం రెండు రోజుల క్రితం 1,686.6 డాలర్లకు చేరి ఏడేళ్ల గరిష్టాన్ని చూసిన పసిడి, ఈ వార్త రాసే 10.30 గంటల సమయానికి 50 డాలర్ల నష్టంతో (గురువారం ముగింపుతో పోల్చి)1,594 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ట్రేడింగ్ ఒక దశలో 1,575 డాలర్లకు పడిపోవడం గమనార్హం. ఇక క్రూడ్ విషయానికి వస్తే, ఒక దశలో 6 శాతం పైగా పడిపోయి 43.86 డాలర్లను చూసిన నైమెక్స్ క్రూడ్ బ్యారల్ ధర కొంచెం బలపడి 45 డాలర్ల



స్థాయికి చేరడం గమనార్హం. అయితే ఇది కోవిడ్ వైరస్ భయాలు త్వరలో ఉపశమిస్తున్నాయనడానికి సంకేతమా? అన్నది కొన్ని వర్గాల విశ్లేషణ.

> కోవిడ్–19 వైరస్ కొత్త దేశాలకు విస్తరిస్తుండటంతో ప్రపంచ మార్కెట్లు పతనమవుతున్నాయి. అంతర్జాతీయంగా ఎక్స్‌పోజర్ ఉన్న లోహ, ఐటీ షేర్లు అధికంగా పతనమయ్యాయి. ఈ వైరస్ ఆర్థికంగా ఏ మేరకు ప్రభావం చూపగలదో అనే విషయమై స్పష్టత లేనప్పటికీ, వైరస్ వేగంగా విస్తరిస్తుండటంతో స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి ప్రభావం తీవ్రంగానే ఉండగలదు.
>
> –వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్

### జెనీవా ఆటో షో రద్దు

**జెనీవా:** కోవిడ్–19 వైరస్(కరోనా) నేపథ్యంలో ఎగ్జిబిషన్ల వంటి కార్యక్రమాలను నిషేధించినట్లు స్విస్ ప్రభుత్వం శుక్రవారం నిషేధాన్ని ప్రకటించింది. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు 1,000 మందికి మించిన జనసమూహాలు ఉండ కూడదని వెల్లడించింది. దీంతో ఈ ఏడాది మార్చి 5 నుంచి 15 వరకు జరగాల్సిన జెనీవా ఆటో షో రద్దు అయ్యింది. ఇప్పటికే 15 కేసులను గుర్తించిన స్విస్ ప్రభుత్వం.. ఈ మహమ్మారి వ్యాప్తి జరగకుండా ఉండడం కోసం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలోనే ఆటో షో రద్దు అయ్యిందని స్విట్జర్లాండ్ మంత్రి అలైన్ బెర్సెట్ ప్రకటించారు.




# ఏడేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి

- డిసెంబర్ త్రైమాసికంలో 4.7 శాతంగా నమోదు
- అంతక్రితం త్రైమాసికంలో 4.5 శాతం
- తాజాగా 5.1 శాతానికి సవరణ
- పరుగులు తీస్తున్న ద్రవ్యలోటు
- బడ్జెట్ అంచనాలను దాటి 121 శాతానికి

**న్యూఢిల్లీ:** ఇంటా, బయటా ఎన్నో సవాళ్లతో కూడుకున్న పరిస్థితుల్లో, మన స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటు డిసెంబర్ త్రైమాసికం(క్యూ3)లో ఏడేళ్ల కనిష్టానికి తగ్గిపోయింది. 4.7 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20) జూలై–సెప్టెంబర్ కాలంలో వృద్ధి రేటును గతంలో పేర్కొన్న 4.5 శాతం నుంచి 5.1 శాతానికి సవరించినట్లు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) శుక్రవారం ప్రకటించింది. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (2019 ఏప్రిల్–జూన్)లో వృద్ధి రేటును 5 శాతం నుంచి 5.6 శాతానికి సవరించింది. క్రితం ఆర్థిక సంవత్సరం (2018–19) డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 5.6 శాతంగా ఉండడం గమనార్హం. తయారీ రంగంలో ఉత్పత్తి క్షీణించడం వృద్ధి రేటు తగ్గేందుకు దారితీసినట్లు ఎన్‌ఎస్‌ఓ తెలిపింది.

**వృద్ధి గణాంకాలు ఇవీ...**

- డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన 4.7 శాతం వృద్ధి రేటు 2012–13 ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి క్వార్టర్‌లో నమోదైన 4.3 శాతం తర్వాత తక్కువ స్థాయి.



- 2019 ఏప్రిల్–డిసెంబర్ వరకు తొమ్మిది నెలలకు జీడీపీ వృద్ధి 5.1 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 6.3 శాతంగా ఉంది.
- తయారీ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ) అంతక్రితం ఏడాది ఇదే కాలంలో 5.2 శాతం వృద్ధి చెందగా, తాజా ఇది 0.2 శాతం మేర తగ్గింది.
- వ్యవసాయ రంగంలో జీవీఏ క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2 శాతం నుంచి 3.5 శాతానికి పుంజుకుంది.
- నిర్మాణ రంగంలో జీవీఏ 6.6 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గింది. మైనింగ్ రంగంలోనూ జీవీఏ 4.4 శాతం నుంచి 3.2 శాతానికి దిగొచ్చింది.
- విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవల విభాగంలోనూ జీవీఏ 0.7 శాతం మేర తగ్గింది.
- వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగంలో జీవీఏ క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 7.8 శాతం నుంచి 5.9 శాతానికి పరిమితమైంది.
- ప్రస్తుత ధరల ఆధారంగా తలసరి ఆదాయం 2019–20లో రూ.1,34,432గా ఉంటుంది. 2018–19లో ఉన్న తలసరి ఆదాయం రూ.1,26,521తో పోలిస్తే 6.3 శాతం అధికం.

**ద్రవ్యలోటు...**

2019–20 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటును రూ.7,66,846 కోట్లకు పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, జనవరి చివరికే (10 నెల కాలం) రూ.9,85,472 కోట్లకు ( 128.5 శాతం) చేరింది. ప్రభుత్వ ఖర్చులు, ఆదాయం మధ్య అంతరాన్ని ద్రవ్యలోటుగా పేర్కొంటారు.

**క్షీణత ఇక ముగిసినట్టే: ఆర్థిక శాఖ**

దేశ జీడీపీ వృద్ధి రేటు కనిష్టాన్ని చూసేసిందని (బోటమ్డ్ అవుట్) కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని అకనమిక్ అఫైర్స్ విభాగం కార్యదర్శి అతాను చక్రవర్తి ప్రకటించారు. కీలక పారిశ్రామిక రంగాల్లో వృద్ధి డిసెంబర్, జనవరి నెలల్లో పుంజుకున్నట్టు చెప్పారు.

### స్థిరత్వం శుభ సంకేతం!

**వృద్ధి తీరుపై ఆర్థికమంత్రి**

భారత్ ఆర్థిక వృద్ధి రేటు మూడవ త్రైమాసికంలో 4.7 శాతంగా నమోదుకావడాన్ని ఆర్థిక రంగంలో ''స్థిరత్వం''గా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థకు ఇది ఒక శుభ సంకేతమనీ విశ్లేషించారు. సీఎన్‌బీసీ టీవీ 18 బిజినెస్ లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవ




**రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీకి సీఎన్‌బీసీ టీవీ18 'ఐకానిక్ బిజినెస్ లీడర్ ఆఫ్ ద డికేడ్' అవార్డును అందించిన నిర్మలా సీతారామన్**

కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థికమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వృద్ధి రేటు మరి కొంతకాలం ఇదే స్థాయిలో స్థిరంగా ఉండే వీలుందని పేర్కొన్నారు. కోవిడ్–19 వైరస్ విషయంలో తక్షణం భయపడాల్సింది ఏదీ లేదన్నారు. అయితే సమస్యలు మరో రెండు, మూడు వారాలు కొనసాగితే మాత్రం సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

# జనవరిలో మౌలిక రంగం వృద్ధి 2.2%

**న్యూఢిల్లీ:** ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ వృద్ధి జనవరిలో కొంచెం కోలుకుని 2.2 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 44% వాటా ఉన్న ఈ గ్రూప్ ఏప్రిల్–జనవరి మధ్య 0.6% మాత్రమే వృద్ధిని నమోదుచేసుకుంది. శుక్రవారం విడుదలైన గణాంకాలకు సంబంధించి 8 విభాగాలనూ వేర్వేరుగా చూస్తే,

**వృద్ధిలో ఐదు**

- బొగ్గు పరిశ్రమ ఉత్పత్తి 8 శాతం పెరిగింది. రిఫైనరీ ప్రొడక్టుల్లో వృద్ధి 1.9 శాతం కాగా, విద్యుత్ విభాగం 2.8 శాతం వృద్ధిని సాధించాయి. ఇక స్టీల్ ఉత్పత్తి 2.2 శాతం, సిమెంట్ ఉత్పత్తి 5 శాతం పెరిగాయి.

**క్షీణతలో మూడు...**

- క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో –5.3 శాతం క్షీణత నమోదయ్యింది. సహజ వాయువుల ఉత్పత్తి సైతం –9.1 శాతం క్షీణతను నమోదుచేసుకుంది. ఎరువుల విషయంలో క్షీణత (–0.1 శాతం) చోటుచేసుకుంది. కాగా 2019 జనవరిలో ఈ విభాగం వృద్ధి రేటు 1.5 శాతం మాత్రమే.



# ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై కేంద్రం సమీక్ష

**న్యూఢిల్లీ:** మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సమస్యల పరిష్కారంపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా .. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ సారథ్యంలోని ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ) 17 ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పరిస్థితి సమీక్షించింది. దాదాపు 36 అవరోధాలను గుర్తించింది. వాటిని సత్వరం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. సుమారు రూ. 32,910 కోట్లతో ఈ ప్రాజెక్టులు తలపెట్టినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. సమీక్షించిన వాటిల్లో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం బీపీసీఎల్‌కు రసాయని (మహారాష్ట్ర)లోని పెట్రోకెమికల్ ప్రాజెక్టు కూడా ఉన్నట్లు పేర్కొంది. పీఎంజీ ఇప్పటిదాకా దాదాపు రూ. 32 లక్షల కోట్ల పెట్టుబడులున్న 809 ప్రాజెక్టులకు సంబంధించి 3,500 అంశాలను పరిష్కరించినట్లు పేర్కొంది. ప్రస్తుతం సుమారు రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులతో తలపెట్టిన 260 ప్రాజెక్టుల విషయంలో 588 అంశాలను సమీక్షిస్తోందని వివరించింది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,580 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,500 | 0 |
| వెండి (కిలో) | 49,000 | ▼ 1900 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,670 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,640 | 0 |
| వెండి (కిలో) | 49,000 | ▼ 1900 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,050 | ▼ 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,980 | ▼ 20 |
| వెండి (కిలో) | 47,000 | ▼ 1300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,500 | ▼ 250 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,450 | ▼ 230 |
| వెండి (కిలో) | 50,000 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,880 | ▼ 60 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,640 | 0 |
| వెండి (కిలో) | 46,900 | ▼ 1500 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్)

| | రాత్రి 11.00కు | | గురువారం ముగింపు |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 44.91 | $ | 47.09 |
| బ్రెంట్ | 50.02 | $ | 51.73 |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 29-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375-00 |
| చిత్తూరు | 383-00 |
| వరంగల్ | 319-00 |
| విజయవాడ | 340-00 |
| గోదావరి | 340-00 |
| 28-2-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 316-00 |

### ఎన్‌ఎస్‌ఈలో వాటా విక్రయించిన
## యూనియన్ బ్యాంక్
### డీల్ విలువ రూ.104 కోట్లు

**న్యూఢిల్లీ:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్‌ఎస్‌ఈ)లో 0.21 శాతం వాటాను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విక్రయించింది. 0.21 శాతం వాటాకు సమానమైన మొత్తం 10,21,250 ఈక్విటీ షేర్లను ఒక్కొటి రూ. 1,020కు విక్రయించామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. మొత్తం నగదులోనే ఈ లావాదేవీ జరిగిందని, డీల్ విలువ రూ.104 కోట్లని పేర్కొంది.

## న్యూస్ కంటెంట్‌కు నగదు ఇచ్చే 'ఇన్‌స్టాఫీడ్' యాప్ ఆవిష్కరణ

**సాక్షి, న్యూఢిల్లీ:** వీడియో, ఫోటో, టెక్స్ట్ రూపంలో వార్తలు అందించేవారికి నగదు చెల్లించేలా క్రియేటివ్ క్రూసేడర్ ప్రయివేట్ లిమిటెడ్ 'ఇన్‌స్టాఫీడ్' పేరుతో న్యూస్ యాప్‌ను ఆవిష్కరించింది. సంస్థ చైర్మన్ రాజ్‌భాటియా ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా ఈ యాప్ ఫేక్ న్యూస్‌ను కూడా నియంత్రిస్తుందని ఆయన వివరించారు. కంటెంట్ అందించడం ద్వారా జర్నలిస్టులు, పౌరులు నగదు పొందవచ్చని వివరించారు.



## సెబీ చైర్మన్ అజయ్ త్యాగి పదవీ కాలం పొడిగింపు!

**న్యూఢిల్లీ:** మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ చైర్మన్‌గా అజయ్ త్యాగీ పదవీకాలాన్ని కేంద్రం మరో ఆరు నెలలు పొడిగించిందని సమాచారం. సెబీకి కొత్త చైర్మన్ ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ పొడిగింపును ఇచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 1984 బ్యాచ్, హిమాచల్ ప్రదేశ్ కేడర్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన అజయ్ త్యాగి 2017, మార్చి 1న సెబీ చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా సెబీ చైర్మన్ పదవికి 20 మందికి పైగా దరఖాస్తు చేశారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతను చక్రవర్తి, కంపెనీ వ్యవహారాల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శి ప్రవీణ్ గార్గ్ తదితరులు ఈ పదవికి పోటీ పడుతున్నారు.




## పరిస్థితిని అవకాశాలుగా మలుచుకోవాలి

### ఫిక్కీ ప్రెసిడెంట్ సంగీత రెడ్డి



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రస్తుత కార్మిక చట్టాల్లో కొన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ సంగీత రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'ఆరు త్రైమాసికాలుగా జీడీపీ పడిపోతూ వస్తోంది. చాలా రంగాల్లో వినియోగం తగ్గింది. గ్రామీణ భారత్‌లో కూడా ఇదే పరిస్థితి. ఇప్పుడు కరోనా తోడైంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతింది. ఈ తరుణంలో ప్రస్తుత పరిస్థితులను అవకాశాలుగా మార్చుకోవాలి. భారత్‌లో కార్మిక చట్టాలను స్వల్పంగా సవరణ చేయాలి. చైనా నుంచి దిగుమతులు తగ్గుతున్న తరుణంలో ఇక్కడ తయారీ పెరిగితే భారత్‌కు కలిసి వస్తుంది' అని తెలిపారు. కరోనా భారత్‌కు వ్యాప్తి చెందితే పరిస్థితులు ఎలా ఉంటాయన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'పరిస్థితి ఊహించలేం. ఇక్కడి ఉష్ణోగ్రతలు కాపాడతాయేమో. విమానాశ్రయాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. ఆ విధంగా నియంత్రించవచ్చు' అని అన్నారు.

## గెలాక్సీ ఎస్10 లైట్ @ రూ. 44,999



**గురుగ్రామ్:** శాంసంగ్ తన గెలాక్సీ ఎస్10 లైట్ స్మార్ట్‌ఫోన్‌లో 512జీబీ వేరియంట్‌ను శుక్రవారం భారత మార్కెట్లో విడుదలచేసింది. వెనుకవైపు ట్రిపుల్ కెమెరాలు (48 మెగాపిక్సెల్ స్టడీ ఓఐఎస్, 12ఎంపీ అల్ట్రా-వైడ్, 5ఎంపీ మాక్రో సెన్సార్స్) ఉండగా, సెల్ఫీల కోసం 32 ఎంపీ కెమెరాను అమర్చింది. 6.7 అంగుళాల పూర్తి హెచ్‌డీ సూపర్ అమోలెడ్ ప్లస్ ఇన్ఫినిటీ–ఓ డిస్‌ప్లే, క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 855 ఆక్టా–కోర్ ఎస్‌ఓసీ, జీబీ ర్యామ్, ఆండ్రాయిడ్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ ఇందులో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. దీని ధర రూ. 44,999 కాగా, పాత వేరియంట్‌తో మార్పిడి ద్వారా రూ. 5000 వరకు బోనస్ ఇస్తున్నట్లు వెల్లడించింది.

## ఎన్‌సీఎల్‌టీకి అరబిందో ఫార్మా

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్‌కు చెందిన ఫార్మాసూటికల్స్ తయారీ కంపెనీ అరబిందో ఫార్మా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌ను ఆశ్రయించింది. అరబిందోకు చెందిన అనుబంధ కంపెనీలు ఏపీఎల్ రీసెర్చ్ సెంటర్, ఏపీఎల్ హెల్త్‌కేర్, ఆరోజైమ్స్, క్యూర్‌ప్రో పేరెంటల్స్, హైసింత్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిలికాన్ లైఫ్ సైన్సెస్‌లను అరబిందో ఫార్మాలో విలీనం (అమాల్గమేషన్) చేయాలని కోరుతూ శుక్రవారం ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ జ్యూడిషియల్ సభ్యుడు రాతకొండ మురళి ఐదు కంపెనీల విలీన వివరాలను ముందుగా స్టాక్ మార్కెట్లకు, ఇన్‌కంట్యాక్స్ (ఐటీ) విభాగాలకు తెలపాలని ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 23కు వాయిదా వేశారు.

## 'రెడ్ చీఫ్' క్యాంపైన్‌కు విశేష స్పందన

ప్రముఖ లెదర్ బ్రాండ్ 'రెడ్ చీఫ్' ఇటీవలే ప్రారంభించిన ఖేల్ గయే చీఫ్ క్యాంపైన్‌కు విశేష స్పందన లభిస్తోందని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అఖిలేష్ సింగ్ అన్నారు. సినీ హీరో వికీ కౌశల్ నటించిన ఈ ప్రచారానికి యువత నుంచి మంచి స్పందన వస్తోందని వెల్లడించారు. యాడ్‌లో ఆయన ప్రదర్శించిన ఆర్‌సీ 30013 ఆర్టికల్‌ని మరింతగా ఇష్టపడుతున్నారని చెప్పారు. మరో రెండు నెలల్లో నూతన శ్రేణిని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



## అమూల్ చేతికి హెరిటేజ్ పంజాబ్ ప్లాంటు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డెయిరీ రంగంలో ఉన్న హైదరాబాద్ కంపెనీ హెరిటేజ్ ఫుడ్స్.. పంజాబ్‌లోని తన ప్లాంటును అమూల్‌కు విక్రయించనుంది. డీల్ విలువ రూ.21.2 కోట్లు. వారం రోజుల్లో అమూల్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకోనుంది. అమూల్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న గుజరాత్ కో–ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు (జీసీఎంఎంఎఫ్) చెందిన కైరా డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్‌కు ప్లాంటును విక్రయిస్తోంది. ప్లాంటు ద్వారా హెరిటేజ్ ఫుడ్స్‌కు 2017–18లో రూ.33.82 కోట్ల టర్నోవర్‌పై రూ.75 లక్షల నష్టం, 2018–19లో రూ.46.63 కోట్ల టర్నోవర్‌పై రూ.13 లక్షల నష్టం వాటిల్లింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబరు కాలంలో రూ.40 కోట్ల టర్నోవర్‌పై రూ.5 కోట్ల నష్టం మూటగట్టుకుంది. ప్లాంటు నెట్‌వర్త్ రూ.21.10 కోట్లు అని కంపెనీ తెలిపింది.

## ఏజీఆర్‌పై టెల్కోలకు నిరాశ

### డీసీసీ భేటీలో నిర్ణయం వాయిదా

**న్యూఢిల్లీ:** తీవ్ర సంక్షోభంలో ఉన్న టెలికం రంగానికి ఊరటనిచ్చే చర్యలపై చర్చించేందుకు శుక్రవారం జరిగిన డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (డీసీసీ) సమావేశం.. ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ఏజీఆర్ డేటాను మదింపు చేసేందుకు మరిన్ని వివరాలు అవసరం కావడంతో డీసీసీ కొద్ది రోజుల్లో మరోసారి భేటీ అయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, ఏజీఆర్ అంశంపై పెద్దగా చర్చ జరగలేదని, భారత్ నెట్ ప్రాజెక్టు అమలు విషయంపైనే సమావేశంలో ప్రధానంగా దృష్టి పెట్టినట్లు టెలికం శాఖ వర్గాలు తెలిపాయి.

## ఆర్థిక రంగంపై మరింత దృష్టి అవసరం: రాజన్ సూచన



**న్యూఢిల్లీ:** ఆర్థిక పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. అయితే దీనికి బదులు ప్రభుత్వం తన రాజకీయ, సామాజిక అజండాలపైనే మరింత దృష్టి సారిస్తోందని అన్నారు. వృద్ధి మందగమనానికి ఈ అంశమూ ఒక కారణమనీ ఆయన విశ్లేషించారు. ఫైనాన్షియల్ రంగం ప్రక్షాళనకు కేంద్రం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం కూడా ఆర్థిక రంగంపై ప్రతికూలత చూపుతోందన్నారు. ప్రపంచాభివృద్ధి దిశలో సరఫరాల సమస్యలను అధిగమించడానికి దేశాలు చర్యలు తీసుకోవాలన్నారు.

---

## ప్రాణహాని ఉంది.. కేంద్ర భద్రత కల్పించాలి

### హైకోర్టులో రేవంత్ రిట్ దాఖలు



**సాక్షి, హైదరాబాద్:** తన ప్రాణాలకు ముప్పు ఉందని, 4ప్లస్4 గన్‌మెన్‌లతోపాటు ఎస్కార్ట్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు వ్యతిగత, రాజకీయ వ్యతిరేకులుగా ఉన్న వారు సీఎం, మంత్రులు వంటి పదవులను అధిష్టించారని, సీఎంకు అత్యంత సన్నిహితుడైన పారిశ్రామికవేత జూపల్లి రామేశ్వరరావు నుంచి కూడా ప్రాణహాని ఉందని పిటిషన్‌లో ఆరోపించారు. రాష్ట్ర విభజన సమయంలో తనకు 3ప్లస్3 భద్రత ఉండేదని, దీనిని 2ప్లస్2కు తగ్గించారని, 2018 ఎన్నికల సమయంలో హైకోర్టు ఆదేశాల మేరకు 4ప్లస్4కు పెంచినా తర్వాత 2ప్లస్2కు తగ్గించారని తెలిపారు. తనకు కేంద్ర ప్రభుత్వ భద్రత కల్పించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు గతేడాది ఆగస్టు 28న చేసుకున్న దరఖాస్తు పరిశీలనలో ఉన్నట్లుగా తనకు కేంద్రం నుంచి జవాబు వచ్చిందని, ఆ దరఖాస్తును ఆమోదించి తనకు భద్రత కల్పించేలా కేంద్ర హోం శాఖకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇందులో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, జూపల్లి రామేశ్వరరావులను ప్రతివాదులుగా చేశారు.

## అత్తాపూర్ హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

**హైదరాబాద్:** పట్టపగలు నడిరోడ్డుపై అతి కిరాతకంగా ఒకరిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు జీవిత ఖైదుతోపాటు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించింది. రాజేంద్రనగర్‌కు చెందిన జె.రమేశ్‌ను 2018 సెప్టెంబర్ 26న విక్రమ్‌సింగ్, కిషన్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్‌లు అత్తాపూర్ ప్రధాన రహదారిపై పిల్లర్ నంబర్ 139 వద్ద కిరాతకంగా నరికి చంపారు. వీరిలో ఇద్దరు నిందితులు గతంలోనే పోలీసులకు లొంగిపోగా.. మూడో నిందితుడు విక్రమ్‌సింగ్‌ను అక్టోబర్ 1న రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు పూర్తి వివరాలను సమర్పించారు. ఈ కేసులో 32 మంది సాక్షులను విచారించిన కోర్టు.. ముగ్గురు నిందితులకు జీవిత కాలం జైలు శిక్షతోపాటు ఒకొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

## ముగ్గురు అటవీ అధికారులకు జైలు శిక్ష

**సాక్షి, హైదరాబాద్:** కోర్టు ధిక్కార కేసులో ముగ్గురు అటవీ అధికారులకు 2 నెలల జైలు శిక్ష, రూ.20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. అకినేపల్లిలోని సర్వే నం.5/1లోని భూమిని వ్యవసాయ సాగుకు అనుమతించాలని 2018లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో మేకల రమేశ్, ఆయన భార్య దాఖలు చేసిన కోర్టు ధిక్కార కేసులో న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు తీర్పు చెప్పారు. మంచిర్యాల డివిజనల్ అటవీ అధికారి రామలింగం, బెల్లంపల్లి అటవీ రేంజ్ ఆఫీసర్ విజయకుమార్ సాహుల్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అయిన అకినేపల్లి ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ సతీశ్‌కుమార్‌లకు సాధారణ జైలు శిక్ష విధించింది. అయితే, దీనిపై అప్పీల్ చేసుకునేందుకు తీర్పు అమలును 4 వారాల పాటు నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## సహ నిందితుడి హాజరుకు అనుమతివ్వండి

### హైకోర్టును ఆశ్రయించిన ఇండియా సిమెంట్స్ ఎండీ శ్రీనివాసన్

**సాక్షి, హైదరాబాద్:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు విచారణకు తనకు బదులుగా సహ నిందితుడు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇండియా సిమెంట్స్ ఎండీ ఎన్.శ్రీనివాసన్ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. తన సహ నిందితుడు జి.ప్రమోద్‌కుమార్‌ను హాజరయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాలని రిట్‌లో హైకోర్టును కోరారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌ను ఈడీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టుగా పరిగణిస్తున్న సీబీఐ కోర్టు కొట్టేసిన ఉత్తర్వులను సవాల్ చేశారు. తనకు 75 ఏళ్ల వయసుందని, పలు కంపెనీలను నిర్వహిస్తున్నానని, 12 సంస్థలకు వివిధ హోదాల్లో చేస్తున్నానని పేర్కొన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని సహ నిందితుడు విచారణకు హాజరయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

### రాష్ట్రీయం

# చికెన్.. మంచి పౌష్టికాహారం

- ముఖ్యమంత్రితో సహా మేమంతా తింటున్నాం: కేటీఆర్
- చికెన్ అండ్ ఎగ్ మేళాను ప్రారంభించిన మంత్రి
- హాజరైన మంత్రులు ఈటల, తలసాని

**హైదరాబాద్:** రాష్ట్రంలో నాలుగు కోట్ల మందిలో ఏ ఒక్కరికీ చికెన్, గుడ్డుతో ఆరోగ్య పరమైన సమస్యలు రాలేదని.. దుష్ప్రచారా లు, అపోహలు, అనుమానాలతో జరుగుతు న్న వైరల్ క్యాంపెయిన్ తప్పని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. చికెన్, ఎగ్‌తో కరోనా వైరస్ రాదని, ఆరోగ్యానికి మంచి పౌష్టిక విలువలు లభిస్తాయని పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చికెన్ అండ్ ఎగ్ మేళాను ఆయన ప్రారంభించారు. మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలసి ఆయన చికెన్ తిని చూపించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గుడ్డు, చికెన్‌లో ఉన్న పోషక విలువలు ఏ ఆహార పదార్థంలో లేవన్నారు. మనదేశంలో అధిక మంటపై ఉడికించే తినే వంటలకు ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు లేవన్నారు. చికెన్, గుడ్డు తినడంతో కోవిడ్ వ్యాపిస్తుందన్న వదంతులు నమ్మవద్దని, ఆరోగ్య శాఖ మంత్రే వచ్చి చికెన్, గుడ్డు తినడంతో ఎలాంటి హాని జరగదని సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత ఇంకా అపోహలు పెట్టుకోవదన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు జిల్లాల్లో కూడా చేయాలని.. దీనికోసం నటులు, డాక్టర్లు ముందుకు రావాలన్నారు. తమ కుటుంబంలో ముఖ్యమంత్రితో సహా అంతా రోజూ చికెన్ తింటామని కేటీఆర్ తెలిపారు. త్వరలో తెలంగాణ పౌల్ట్రీ పాలసీ కూడా రాబోతుందని వివరించారు.




చికెన్ అండ్ ఎగ్ మేళాలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

### అనారోగ్య సమస్యలు రావు...

మన ఆహారపు అలవాట్లకు కోవిడ్ వైరస్ వచ్చే అవకాశం లేదని ఈటల రాజేందర్ అన్నారు. కేరళలో 3 కేసులు నమోదయ్యాయి తప్ప, మన రాష్ట్రంలో ఒక్క కేసు కూడా నమోదుకాలేదన్నారు. మన వద్ద సగం ఉడికించి తినే ఆహారపు అలవాటు లేదన్నారు. వైరల్ వార్తల కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైందన్నారు. 2 నెలల కాలంలో రూ.500 కోట్ల పైచిలుకు నష్టపోయిందన్నారు. వదంతులు నమ్మవద్దని, కరోనా వైరస్‌కు, చికెన్‌కు ఎలాంటి సంబంధం లేదని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చికెన్ అండ్ ఎగ్ మేళాలో 6,200 కిలోల వివిధ రకాల చికెన్ వంటకాలు, 22వేల గుడ్లు నగరవాసులకు ఉచితంగా అందజేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్‌రావు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, సురేందర్, పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుదీప్, లిప్సిక, లిటిల్ సింగర్ సాయివేద పాటలతో అలరించగా, బిత్తిరి సత్తి మాటలతో ఆకట్టుకున్నారు.

## చెక్‌డ్యామ్‌లకు నాబార్డ్ రుణం!

**సాక్షి, హైదరాబాద్** : రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నదులు, వాగులు, వంకలపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లకు నిధుల కొరత లేకుండా నాబార్డ్ నుంచి రుణాలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ నిర్ణయించింది. మొత్తంగా రూ.1,650 కోట్ల మేర రుణాలు తీసుకునేలా నాబార్డ్ ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తంగా 1,235 చెక్‌డ్యామ్‌లను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం కాగా, వీటికి రూ.4,920 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంది. తొలి విడతగా ఈ ఏడాది గోదావరి బేసిన్‌లో 410, కృష్ణాబేసిన్‌లో 200 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేయాలని తలపెట్టి ఇప్పటికే సాంకేతిక అనుమతులు ఇచ్చే ప్రక్రియ వేగిరం చేశారు. వాటికి నిధుల కొరత లేకుండా ఈ మార్చి వరకు నిర్మించే చెక్‌డ్యామ్‌ల అవసరాలకు రూ.150 కోట్లు, ఆ తర్వాత వార్షిక ఏడాదికి మరో రూ.1500 కోట్లు రుణాలు తీసుకునేలా చర్చలు జరుపుతోంది. ఈ ప్రక్రియ కొలిక్కి వస్తే నిధులకు కొరత ఉండదు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా కరీంనగర్ జిల్లాలో మానేరు నదిని ఏడాదంతా పూర్తిగా సజీవం చేసేలా 29చెక్‌డ్యామ్‌లు, మూలవాగుపై మరో 12 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అవసరమయ్యే రూ.580 కోట్ల నిధులకు ఆటంకం ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## సంయమనంతో చక్కదిద్దండి..!

- నిరసనకారులను చాకచక్యంగా అదుపులోకి తీసుకునే ప్రణాళిక
- 'జూడో'తరహా ప్రత్యేక శిక్షణ ఇప్పించే యోచనలో పోలీసులు

**సాక్షి, హైదరాబాద్:** పటాన్‌చెరు ఘటనతో పోలీసుశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇకపై పౌరుల ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించకూడదన్న డీజీపీ ఆదేశాల మేరకు ఆందోళనకారులను అదుపు చేసేందుకు అవలంబించాల్సిన చర్యల్లో భాగంగా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కుమార్తె మృతదేహాన్ని తరలించడాన్ని అడ్డుకున్న తండ్రిని కానిస్టేబుల్ తన్నడం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను పోలీసు బాస్ డీజీపీ మహేందర్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. గతంలో ఎన్నడూలేని విధంగా హోంగార్డు నుంచి ఏడీజీ వరకు అన్ని ర్యాంకుల పోలీసు అధికారులతో మూడుగంటలపాటు సుదీర్ఘంగా వీడియోకాన్ఫరెన్స్ జరిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారుల సూచన మేరకు ఇకపై ధర్నాలు, రాస్తారాకోలు జరిగినపుడు పోలీసులు వారిని నియంత్రించే, అదుపులోకి తీసుకునే పద్ధతి మారాలని ఆదేశించారు. ఆందోళనకారులపై నేరుగా దాడికి దిగకుండా.. చాకచక్యంగా ఒడిసిపట్టుకుని అదుపులోకి తీసుకోవాలని డీజీపీ సూచించిన అభిప్రాయంతో చాలామంది ఉన్నతాధికారులు ఏకీభవించారు. ఈ మేరకు సిబ్బందికి శిక్షణ ఇప్పించాలన్న నిర్ణయానికి వచ్చారని సమాచారం.

**ఏకబిగి విధులతో ఒత్తిడి..**

రాస్తారోకోలు జరిగినపుడు నిరసనకారులను నియంత్రించడంలో అప్పుడప్పుడూ పోలీసులు సహనం కోల్పోతున్నారు. దీనికి కారణం పని ఒత్తిడిగా గుర్తించారు. పోలీసు డిపార్ట్‌మెంటులో కిందిస్థాయి సిబ్బందిపై తీవ్ర పనిఒత్తిడి ఉంది. ముఖ్యంగా కానిస్టేబుళ్లు, ఎస్సై ర్యాంకు అధికారులు ఊపిరి సలపకుండా ఏకబిగిన దాదాపు 16 గంటలు విధులు నిర్వహిస్తున్నారు. దీని ప్రభావం అప్పుడప్పుడూ బయటపడుతోంది. ధర్నా లు, రాస్తారోకోలకు దిగిన నిరసనకారులు ఒకపట్టాన మాట వినరు. ఈ క్రమంలో పోలీసులు ఏమాత్రం సహనం కోల్పోయినా.. స్మార్ట్‌ఫోన్ లేదా మీడియా కెమెరాల కంట చిక్కడం, అవి వైరల్‌గా మారడం క్షణాల్లో జరిగిపోతోంది. అందుకే, ఈ సమస్యను అధిగమించేందుకు కానిస్టేబుళ్లకు జూడో తరహాలో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారని సమాచారం.

## రైతాంగం పరిస్థితిపై నేడు కాంగ్రెస్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు దిగేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. రైతాంగ పరిస్థితులపై చర్చించేందుకు గాను టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లో కీలక నేతలు సమావేశం కానున్నారు. దీనికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తాజాగా రాష్ట్రంలో జరుగుతున్న కంది రైతుల ఆందోళనలు, ధాన్యం రైతులు పడ్డ కష్టాలు, రైతు రుణమాఫీ, రైతుబంధు పథకం అమలులో ఇబ్బందులు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఫసల్ బీమా యోజన, పసుపు బోర్డు ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టనున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి తన లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో నిర్వహిస్తోన్న 'పట్నం గోస'కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అంశంపై కూడా చర్చించనున్నారు.

## మందేసి.. చిందేసి..!

- చేతిలో మద్యం బాటిళ్లతో పోలీసుల నృత్యాలు
- సోషల్ మీడియాలో వైరల్

**హైదరాబాద్:** షాద్‌నగర్ పోలీసులు ఇటీవల నాగిని డ్యాన్స్ చేసిన ఘటన మరవకముందే.. కొత్తూరు పీఎస్‌లో పనిచేస్తున్న పోలీసులు సైతం ఇలాంటి వీడియోలతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు. కొత్తూరు పీఎస్‌లో విధులు నిర్వహించే ఓ కానిస్టేబుల్ వివాహం ఈ నెల 12న షాద్‌నగర్ సమీపంలోని రామేశ్వరం ఆలయంలో జరిగింది. ఈ పెళ్లికి కొత్తూరు పీఎస్‌లో పనిచేసే సుమారు 12 మంది పోలీసులు హాజరయ్యారు. పెళ్లి తర్వాత సమీపంలోని ఓ వెంచర్‌లో విందు చేసుకున్నారు. ఈ విందులో పాల్గొన్న కొంత మంది పోలీసులు మద్యం బాటిళ్లు చేతపట్టుకొని, మద్యం సేవిస్తూ, నృత్యాలు చేసిన వీడియోలు శుక్రవారం సాయంత్రం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతోపాటు పలు టీవీ చానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**నేను బిజీగా ఉన్నా..**

ఈ విషయమై కొత్తూరు ఇన్‌స్పెక్టర్ చంద్రబాబును వివరణ కోరేందుకు ప్రయత్నించగా తాను బిజీగా ఉన్నానని, పోలీస్ స్టేషన్ నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడాలని ఫోన్ కట్ చేశారు. ఏఎస్సై అబ్దుల్లాను అడగ గా ఈ నెల 12న ఉన్నతాధికారుల అనుమతితోనే వివాహ వేడుకకు హాజరైనట్లు తెలిపారు.

## సీఎంను కలిసేలా ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సమస్యలున్న ప్రతీ ఒక్కరు సీఎం కేసీఆర్‌ను కలిసే అవకాశం కల్పించేలా ప్రగతిభవన్‌లో ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. సీఎం కేసీఆర్ హైదరాబాద్ టోలిచౌకి వద్ద మహ్మద్ సలీం అనే దివ్యాంగుడి సమస్యలు తెలుసుకొని వికలాంగుల పెన్షన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తున్నట్టు శుక్రవారం ఆ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది పేదలు తమ సమస్యలను సీఎంకు తెలియజేయడానికి సమయం లభించక దయనీయ స్థితిలో ఉన్నారని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఏఐసీటీఈకి ఇంజనీరింగ్ కాలేజీల నివేదికలు

### రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

**సాక్షి,హైదరాబాద్:** భవన నిర్మాణ అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్, 111జీవో పరిధిలో ఉన్న 238 ఇంజనీరింగ్ కాలేజీల్లో శుక్రవారం వరకు లోపాల సవరణకు చేపట్టిన చర్యలపై యాజమాన్యాలు ఇచ్చిన నివేదికలను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో లోపాలున్న ఈ కాలేజీలకు సంబంధించి సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఏఐసీటీఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కాలేజీలనుంచి నివేదికలను తీసుకోవాలని జేఎన్‌టీయూను ఆదేశించింది. దీంతో జేఎన్‌టీయూ యాజమాన్యాల నుంచి నివేదికలు కోరగా, ఇప్పటివరకు 86 కాలేజీలు మాత్రమే లోపాల సవరణకు చేపట్టిన నివేదికలను అందజేశాయి. అందులో జేఎన్‌టీయూ పరిధిలోని కాలేజీలు 82 ఉండగా, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలు 4 ఉన్నాయి. శుక్రవారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రాంచంద్రన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీటిపై చర్చించారు.

**ముగిసిన గడువు**

కాలేజీలకు అనుమతి ఇచ్చేందుకు ఏఐసీటీఈ ఇచ్చిన దరఖాస్తుల గడువు శుక్రవారంతో ముగిసింది. ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకునే గడువు మార్చి 5 వరకు ఉంది. మార్చి 5లోగా యాజమాన్యాలు ఇచ్చే లోపాల సవరణ నివేదికలను ఏఐసీటీఈకి పంపించాలని నిర్ణయించారు.

## జేఎన్‌టీయూలో కొత్త కోర్సులు

**సాక్షి, హైదరాబాద్:** తమ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో 2020–21 విద్యా సంవత్సరంలో పలు కొత్త కోర్సులను ప్రవేశ పెడుతూ జేఎన్‌టీయూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని తమ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్‌లో పొందుపరుస్తున్నట్లు వెల్లడించింది. కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, నెట్‌వర్క్ కోర్సులకు అనుబంధ గుర్తింపు ఇవ్వనున్నట్లు పేర్కొంది.

## వారంలో 26,048 ఎంసెట్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** ఎంసెట్ దరఖాస్తులు శుక్రవారం నాటికి 26,048 వచ్చాయి. ఈనెల 21 నుంచి ఎంసెట్ కమిటీ దరఖాస్తుల స్వీకరణను చేపట్టింది. శుక్రవారం నాటికి ఇంజనీరింగ్ కోసం 16,533 మంది, అగ్రికల్చర్ కోసం 9,515 మంది దరఖాస్తుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మొదటిరోజు 1,88,581 హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో మొదటి రోజు 1,88,581 మంది విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని గుర్తించే ఇంటర్‌బోర్డు సెంటర్ లొకేటర్ యాప్‌ను కూడా నుంచి 3,712 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ ఎంపికకు కమిటీ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** అర్హులైన షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ విడుదలకు సంబంధించిన రాష్ట్రస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. డీఎస్‌ఎస్ భవన్‌లో ఎస్టీశాఖ కార్యదర్శి క్రిస్టీనా చోంగ్తూ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేఎన్‌టీయూ, ఉన్నత విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ల కోసం మొత్తం 39 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 37 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎస్టీ సంక్షేమశాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019–20 విద్యా సంవత్సరంలో ఇప్పటికే 22 మంది ఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు లబ్ధి పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంటర్వ్యూలు నిర్వహించిన 37 మంది విద్యార్థుల్లో ప్రమాణాల మేరకు ఎంత మంది అర్హులో రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయిస్తుందని చెప్పారు. ఈ స్కాలర్‌షిప్‌ల కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఈ–పాస్ తెలంగాణ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు ఎస్టీ సంక్షేమశాఖ తెలిపింది.

## శ్రీచైతన్య స్కూల్స్ 'సైన్స్ ఎక్స్‌పో-2020'

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేశవ్యాప్తంగా శ్రీచైతన్య స్కూల్స్ తమ 466 బ్రాంచీల్లో 'సైన్స్ ఎక్స్‌పో –2020'ని ఘనంగా నిర్వహించింది. ఏపీలోని మారుతినగర్ బ్రాంచ్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు ముఖ్య అతిథులుగా శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బి.ఎస్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి, సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌ను పెంచడానికి ఇలాంటి సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడుతాయని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో వందలాది మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొని వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించి విశేషంగా ఆకట్టుకున్నారు. ఇక హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ బ్రాంచ్‌లో నిర్వహించిన బ్రాంచ్‌లో ఆ స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్ని ఆల్‌రౌండ్ డెవలపర్స్‌గా మార్చి గ్లోబల్ సిటిజన్స్‌గా చూడాలన్నది తమ స్కూల్స్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అందులో భాగంగా విద్యార్థుల్ని స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా యాక్టివేట్ చేస్తూ ప్రతిభావంతులుగా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, శ్రీచైతన్య విద్యాసంస్థలను ఏపీ దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అభినందించారు.

## 4 నుంచి మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ స్టెనో, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థులకు వచ్చే నెల 4 నుంచి 7 వరకు మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. వెరిఫికేషన్ హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉంటుందని పేర్కొంది. అలాగే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులకు మార్చి 8న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు నిర్వహిస్తామని తెలిపింది. అభ్యర్థులు పోస్టులు, జోన్ల ప్రాధాన్యతలను బట్టి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించింది. వెబ్ ఆప్షన్ల ఆధారంగానే తుది ఎంపిక ఉంటుందని పేర్కొంది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

## ప్రవేశ దరఖాస్తుల గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** మోడల్ స్కూళ్లలో వచ్చే విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగించారు. ఈ గడువును మార్చి 10 వరకు పొడిగించినట్లు మోడల్ స్కూల్స్ డైరెక్టర్ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 12కు బదులు ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సీపీఎస్ రద్దు కోసం రేపు నిరాహార దీక్ష

**సాక్షి, హైదరాబాద్:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సీపీఎస్) రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీంను (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1వ తేదీన ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్ తెలిపారు. నేషనల్ ఓల్డ్ పెన్షన్ రిస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్‌ఓపీఆర్‌యుఎఫ్) ఆధ్వర్యంలో ఈ దీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందిరా పార్కు వద్ద నిర్వహించే దీక్ష కార్యక్రమంలో ఎన్‌ఓపీఆర్‌యుఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ బీపీ రావత్, రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు 29 రాష్ట్రాలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొనను న్నట్లు వెల్లడించారు.




## అందమైన హైదరాబాద్‌ను నరకంగా మార్చేస్తారా..

**ఆక్రమణలపై హైకోర్టు ఆగ్రహం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ స్థలాలను రక్షించలేని దుస్థితిలో అధికారులు ఉన్నారని మరోసారి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆక్రమణలను అడ్డుకోలేకపోతున్నారని, జీతాలు తీసుకుని నిద్రపోతున్నారంటూ ఘాటువ్యాఖ్యలు చేసింది. మార్చి 24న జరిగే విచారణకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ కమిషనర్లు హైకోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా ఐదేళ్లకోసారి వాటిని క్రమబద్ధీకరణకు జీవో జారీ చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రంగారెడ్డి జిల్లా గడ్డి అన్నారంలో అక్రమ నిర్మాణంపై జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ శివారి, మరొకరు వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలను దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపారు. చెరువులు, కుంటలు, పార్కులు ఆక్రమణలకు గురవుతుంటే అధికారులు అడ్డుకోకుండా నిద్రపోతున్నారా అని వ్యాఖ్యానించింది. జీతాలు తీసుకునేది నిద్రపోవడానికా అంటూ దుయ్యబట్టింది. జీహెచ్‌ఎంసీలో ఆక్రమణలను అడ్డుకునేందుకు ప్రత్యేక విభాగం ఉందా అని ప్రశ్నించింది.

# ఎట్టకేలకు వర్సిటీలకు ఈసీలు

**ఉస్మానియా సహా ఆరింటికి ఈసీ సభ్యుల నియామకం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీలకు పూర్తిస్థాయి పాలక మండళ్ల (ఈసీ) నియామకాలను ఎట్టకేలకు ప్రభుత్వం ప్రారంభించింది. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు మహాత్మాగాంధీ, తెలంగాణ, పాలమూరు, జేఎన్‌ఏఎఫ్‌ఏయూ, శాతవాహన యూనివర్సిటీలకు పూర్తి స్థాయి పాలక మండళ్లను నియమించింది. ఈ మేరకు పాలక మండళ్లలోని క్లాస్–2, ఇతర సభ్యులను నియమిస్తూ విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామ్‌చంద్రన్ శుక్రవారం ఉత్తర్వులు (జీవోలు 66, 67, 68, 69, 70, 72) జారీ చేశారు. రాష్ట్రంలో 9 ఏళ్లుగా పూర్తి స్థాయి మండళ్లు లేకుండానే యూనివర్సిటీలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల నియామకం కోసం ఏర్పాటు చేయాల్సిన సెర్చ్ కమిటీల్లో ఉండే యూనివర్సిటీ నామినీని పూర్తిస్థాయి ఈసీ మాత్రమే ప్రతిపాదించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి స్థాయి ఈసీల నియామకానికి చర్యలు చేపట్టింది.



**ఓయూ పాలక మండలి సభ్యులు..**

ఓయూ కామర్స్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు, ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కుమార్, నారాయణగూడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్, ఓయూ అరబిక్ విభాగం లెక్చరర్ ప్రొఫెసర్ సైదా తాలత్ సుల్తానా, సంగారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ ఎం.ప్రవీణ, ఇండస్ట్రీ, ఆర్కిటెక్చర్, ట్రేడ్, కామర్స్, ఎడ్యుకేషన్, లీగల్, సామాజిక సేవ తదితర రంగాల నుంచి హెటిరో డ్రగ్స్ నుంచి కె.రత్నాకర్‌రెడ్డి, శ్రీ మిత్రా అండ్ వెన్నెల కాలేజీల కరస్పాండెంట్ ఎస్‌వీ ప్రకాష్, పెర్క శ్యామ్, ఎంఏ ముఖీద్.

**పాలమూరు యూనివర్సిటీ ఈసీ సభ్యులు..**

ప్రొఫెసర్ గిరిజ మంగతాయారు, ఎండీ నూర్జహాన్, డాక్టర్ గోవింద్ భూషన్, ఎన్.కిషోర్, ఎ.చందోజీ రావు, జి.గోపాల్, డీఎస్‌హెచ్ విజయలక్ష్మి, పి.జగదీశ్వర్, పి.ప్రసాదరావు.

**తెలంగాణ యూనివర్సిటీ ఈసీ సభ్యులు..**

ప్రొఫెసర్ నసీం, డాక్టర్ సీహెచ్ ఆరతి, కె.ప్రవీణ్‌కుమార్; రవీందర్‌రెడ్డి, వి.వసుంధరా దేవి, పి.గంగాధర్‌గౌడ్, ఎన్‌ఎల్ శాస్త్రి, ఎం.రాజేందర్, మారయ్యగౌడ్.

**మహాత్మాగాంధీ వర్సిటీ ఈసీ సభ్యులు**

ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి, ఆకుల రవి, ఘనశ్యాం, కె.శ్రీదేవి, కె.వెంకటేశ్వర్‌రావు, బి.కృష్ణారెడ్డి, సవిధర్ కుమార్, బి.సూర్యనారాయణరెడ్డి, ఎస్.రమేష్.

**శాతవాహన యూనివర్సిటీ ఈసీ సభ్యులు..**

ప్రొఫెసర్ ఎం.భరత్, డి.సురేష్ కుమార్, కె.రామకృష్ణ, ఎం.వరప్రసాద్, వి.ఉమాదేవి, సీహెచ్ శ్రీనివాస్, ఐ.దీపిక, పి.వేణు, కె.మొగిలయ్య.

**జేఎన్‌ఏఎఫ్‌ఏయూ ఈసీ సభ్యులు..**

ప్రొఫెసర్ ఎస్‌ఎన్ వికాస్, ఎస్.కుమార్, మున్నవర్ పాషా, కె.సుందర్ కుమార్, సుమన్ రేఖ, లక్ష్మణ్ ఆలే, మహేష్ గుప్తా, రమణారెడ్డి, లక్ష్మి నంబియార్.

**జేఎన్‌టీయూ ఈసీ సభ్యులు..**

ప్రొఫెసర్ ఎస్.తారా కల్యాణి, ఆర్.మార్కండేయ, సీడీ నాయుడు, తాటిపర్తి విజయలక్ష్మి, జి.విష్ణుమూర్తి, వి.రాజన్న, శ్రీకాంత్ సిన్హా, అరుటియా ప్రశాంత్, మసూద్ హుస్సేన్.

## ఆన్‌లైన్ బిడ్డింగ్ అదిరింది

### ఒక్క రోజులోనే రూ.31.48 లక్షల ఆదాయం

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు శుక్రవారం అనూహ్య స్పందన వచ్చింది. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి చెందిన నంబర్లపై జరిగిన ఆన్‌లైన్ వేలంలో 'టీఎస్ 09 ఎఫ్‌కె 9999'నంబర్ కోసం ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ రూ.9.14 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. 'టీఎస్ 09 ఎఫ్‌ఎల్ 0001'నంబర్ కోసం లహరి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆన్‌లైన్ వేలంలో రూ.3,81,111 చెల్లించింది. 'టీఎస్ 09 ఎఫ్‌ఎల్ 0099' నంబర్ కోసం అస్మిత పద్మనాభన్ అనే వాహనదారుడు రూ.3,33,000 చెల్లించాడు. శుక్రవారం ఒక్క రోజే రూ.31,48, 487 ఆదాయం లభించినట్లు హైదరాబాద్ జేటీసీ పాండురంగ్ తెలిపారు. ఆర్టీఏ ప్రత్యేక నంబర్ల సిరీస్ ప్రారంభమైన మొదటి రోజే అనూహ్య స్పందన లభించిందని పేర్కొన్నారు. సాధారణ బిడ్డింగ్‌కు తీసిపోని విధంగా ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో వాహనదారులు పోటీ పడ్డారని తెలిపారు. సాధారణ బిడ్డింగ్ స్థానంలో రవాణా శాఖ కొద్ది రోజుల క్రితమే ఆన్ లైన్ పద్ధతిని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆన్‌లైన్ వేలం పద్ధతిని త్వరలో అన్ని ఆర్టీఏలకు విస్తరించనున్నారు.

## రసాయనాల్లోనూ స్వావలంబన!

- త్వరలో విశాఖ–కాకినాడలో పీసీపీఐఆర్
- ఆర్థిక వ్యవస్థలో రసాయనాలది కీలకపాత్ర
- కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రాఘవేంద్రరావు వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** మందుల తయారీ, వ్యవసాయాలతోపాటు అనేక ఇతర రంగాల్లో ఉపయోగించే రసాయనాల విషయంలో స్వావలంబన సాధించే దిశగా దేశం అడుగులు వేస్తోందని కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ కార్యదర్శి పి.రాఘవేంద్రరావు వెల్లడించారు. ఈ దిశగా కేంద్రం ఇప్పటికే ఓ పత్రాన్ని సిద్ధం చేసిందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో (ఐఐసీటీ) శుక్రవారం మాట్లాడుతూ.. అన్ని రకాల రసాయనాలను దేశీయం గా తయారు చేసుకోవడం ఒక అంశం కాగా.. ఈ రంగంలో స్వదేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, మేకిన్ ఇండియాలో భాగంగా నాణ్యమైన రసాయనాల తయారీని ప్రోత్సహించడం, రసాయనాల ఎగుమతులు, దిగుమతుల విషయంలో స్పష్టమైన నిబంధనలను, మార్గదర్శకాలను పాటించడం మిగతా అంశాలని ఆయన వివరించారు. జాతీయ సైన్స్ డే ఉత్సవాల్లో భాగంగా ఐఐసీటీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాఘవేంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలో ప్రస్తుతం రసాయనాల మార్కెట్ విలువ 6,500 కోట్ల డాలర్లు కాగా.. దీన్ని 2024–25 నాటికి 2 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. సింగపూర్‌లోని జురాంగ్ పార్క్ తరహాలో 'పెట్రోలియం, కెమికల్స్, పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజన్'క్లుప్తంగా పీసీపీఐఆర్‌ల ఏర్పాటుకు కేంద్రం ప్రయత్నాలను ముమ్మరం చేసిందని రాఘవేంద్రరావు తెలిపారు. విశాఖ–కాకినాడల్లోనూ ఇలాంటి పెట్టుబడుల ప్రాంతం ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించిందన్నారు. కోవిడ్ వైరస్ కారణంగా మనకు పలు రసాయనాల సరఫరా నిలిచిపోయినా పరిస్థితి మందులు నిల్వ చేసుకునే స్థాయికి చేరలేదని ఐఐసీటీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఐఐసీటీ శాస్త్రవేత్త సత్యనారాయణ పాల్గొన్నారు.



**జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీవారి చంద్రశేఖర్, చిత్రంలో రాఘవేంద్రరావు, సత్యనారాయణ**

## మేలో డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్

- వాట్సాప్ నంబర్‌కూ డిగ్రీ ప్రవేశాల సమాచారం
- మూడు దఫాల్లో ఆన్‌లైన్ ప్రవేశాలు పూర్తి
- జిల్లా కేంద్రాల్లోనే దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణ
- దోస్త్ సమావేశంలో నిర్ణయం...

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే నెలలో దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) నోటిఫికేషన్ జారీ కానుంది. శుక్రవారం జరిగిన దోస్త్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. హెల్ప్‌లైన్ కేంద్రాల కోఆర్డినేటర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ప్రవేశాలతోపాటు విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులపైనా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి ఎక్కువ దఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహించకుండా, డిగ్రీ ప్రవేశాలను మూడు దఫాల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల దరఖాస్తుల్లో పొరపాట్లు దొర్లితే వాటిని సవరించుకునేందుకు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా జిల్లా కేంద్రాల్లోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే సవరించుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఫొటో మార్చుకోవాలన్నా, పేరులో తప్పులు దొర్లినా, పుట్టిన తేదీలో తప్పులు దొర్లినా, ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమాచారంలో తప్పులు దొర్లినా సవరించుకునేలా ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే ఎడిట్ చేసుకునేలా ఆప్షన్ ఇస్తున్నారు. విద్యార్థి ద్వితీయ భాషను తాను చేరిన కాలేజీలోనే మార్చుకునేలా ఎడిట్ ఆప్షన్ ఇస్తారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించిన సమాచారాన్ని విద్యార్థికి మూడు విధాలుగా అందించనున్నారు. విద్యార్థి ఇచ్చే మొబైల్ నంబరుకు ఎస్‌ఎంఎస్ పంపించడంతోపాటు మెయిల్ ఐడీకి సమాచారం ఇవ్వాలని, ఇటు విద్యార్థికి వాట్సాప్‌లోనూ సమాచారాన్ని అందించాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 60 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థి లాగిన్ అయిన ప్రతిసారీ వేర్వేరు వన్ టైం పాస్ వర్డ్ (ఓటీపీ) వచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. గతంలో ఒకసారి ఇచ్చిన ఓటీపీనే పలుమార్లు వినియోగించిన నేపథ్యంలో కాలేజీలు విద్యార్థుల నుంచి ఆ ఓటీపీ తీసుకొని దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



## గూగుల్ పేతో జాక్‌పాట్!

### నగదు బదిలీ చేయడంతో లక్ష రివార్డు

**పెనుకొండ:** గూగుల్‌పే ద్వారా నగదు బదిలీ చేసినందుకు ఓ యువకుడికి రూ.లక్ష రివార్డు లభించింది. అనంతపురం జిల్లా పెనుకొండ పట్టణానికి చెందిన సూర్యప్రకాశ్ శుక్రవారం తన స్నేహితుడికి రూ.3 వేలు గూగుల్‌పేలో బదిలీ చేశాడు. నగదు బదిలీ అయిన కొద్దిసేపటికి సూర్యప్రకాశ్ బ్యాంకు ఖాతాకు రూ.1,00,107 జమ అయినట్టు గూగుల్‌పే నుంచి మెసేజ్ వచ్చింది. అనూహ్యంగా అంత డబ్బు రావడంతో సూర్యప్రకాశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.